

ఒంగోలులో క్రిస్మస్ వేడుకల సందర్భంగా పశువుల పాకలో బాలఏసు

క్రిస్మస్ జోష్!

విద్యుత్ దీపాల అలంకరణతో మెరిసిపోతున్న చర్చిలు

- అర్ధరాత్రి నుంచే ప్రారంభమైన ప్రత్యేక ప్రార్థనలు
- మార్మోగిన ఏసు నామస్మరణ


ఒంగోలు, కార్పొరేషన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రక్షకుడు, దయామయుడు ఏసు ప్రభువు జన్మదిన వేడుకలకు ప్రార్థనా మందిరాలు ముస్తాబయ్యాయి. సరికొత్త శోభను సంతరించుకున్నాయి. గ్రామాల నుంచి పట్టణాల వరకు అంతటా సందడి నెలకొంది. పండుగ శుభాకాంక్షలు తెలియజేసే ఫ్లెక్సీలు, స్టార్స్, క్రిస్మస్ ట్రీలు పెద్దఎత్తున ఏర్పాటు చేశారు. ఏసుక్రీస్తు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ యువత రాత్రివేళ ఇళ్లను సందర్శించి క్యాండిల్స్ అందజేసింది. ఇక పిల్లలు, పెద్దలు, షాపింగ్‌లలో మునిగిపోయారు. దీంతో ఫుట్‌పాత్ వ్యాపారాలు ఊపందుకోగా, పెద్దపెద్ద షాపింగ్ మాల్స్ కిక్కిరిసిపోతున్నాయి. పండుగ నేపథ్యంలో చరిత్ర కలిగిన చర్చిలకు రంగులు వేశారు. విద్యుత్ దీపాలతో అలంకరించారు. జిల్లాలోని ఒంగోలు జువెట్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చి, మిషన్ కాంపౌండ్‌లోని క్లౌ మెమోరియల్, కనిగిరి దుర్గం బాప్టిస్ట్, మార్కాపురం తెలుగు బాప్టిస్ట్, పొదిలి సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలతోపాటు, ఆర్‌సీఎం చర్చిలు, పెంతెకోస్తు, ఎష్కోలు, క్రీస్తు సంఘం తదితర మందిరాల్లో మంగళవారం అర్ధరాత్రి నుంచి ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. క్రీస్తు పుట్టకను క్రైస్తవ పరిజనం ఘనంగా స్వాగతించింది. ఈ సందర్భంగా క్యాండిల్ లైట్స్ ప్రదర్శించారు. అంతటా ఏసు నామస్మరణ మార్మోగింది. సంఘ కాపరులు దైవ వాక్యాన్ని వినిపించారు.



పామూరులో ఏసు జననం నాటికను ప్రదర్శిస్తున్న చిన్నారులు



ఒంగోలులోని జేఎంబీ చర్చిలో క్రీస్తు పుట్టుకను క్యాండిల్ లైట్స్‌తో స్వాగతిస్తున్న క్రైస్తవులు



విద్యుత్ దీపాలు, స్టార్‌లతో కాంతులీనుతున్న ఒంగోలులోని కబాడీపాలెం



ప్రక్షాళన జరిగేనా?

- వైసీపీ ప్రభుత్వ హయాంలో వైద్యశాఖలో అన్నీ అడ్డగోలు వ్యవహారాలు
- ఉద్యోగుల నియామకాల నుంచి బదిలీల వరకు అక్రమాలే
- అంతటా దళారులదే ఇష్టారాజ్యం
- అక్రమ డిప్యుటేషన్లు, వైద్యశాలల తనిఖీల పేరుతో అధికారుల వసూళ్ల పర్వం
- నేడు డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లా వైద్యశాఖ ప్రతిష్ట మసకబారింది. అనేక అక్రమాలకు నిలయంగా మారింది. అసలు ఆ శాఖ అంటేనే జనం హడలిపోయే పరిస్థితి ఏర్పడింది. అక్కడ ఏపని కావాలన్నా చేతులు తడపాల్సిన పరిస్థితి కొనసాగింది. ఇక ఉద్యోగ నియామకాలు అంటే అధికారులు, సిబ్బందికి పండుగే. ఏ ఉద్యోగం ఎవరికి ఇస్తారో కూడా తెలియని పరిస్థితి. అర్హులను కాదని పోస్టులను అనర్హులకు కట్టబెట్టిన ఘటనలు కోకొల్లలు. వైసీపీ ప్రభుత్వ హయాంలో విడుదల చేసిన నోటిఫికేషన్లలో వైద్యశాఖలో చోటుచేసుకున్న అవకతవకలు అన్నీఇన్నీ కావు. కరోనా విపత్కర సమయంలో చేపట్టిన పలురకాల నియామకాల్లోనూ అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఆ వ్యవహారంపై ఏకంగా త్రిసభ్య కమిటీని విచారణకు నియమించారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఉద్యోగ నియామకాల్లో భారీ ఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆ కమిటీ విచారణ నివేదికలు ఇచ్చినా పట్టించుకునే వారు కరువయారు.

బదిలీలలో భారీగా అవకతవకలు

ఉద్యోగుల బదిలీల సమయంలో చేతులు తడిపిన వారిని అనుకూలమైన ప్రాంతాలకు, అర్హత ఉన్న వారిని సుదూర ప్రాంతాలకు స్థానచలనం కల్పించిన ఉదంతాలు ఉన్నాయి. ఇక ఉద్యోగుల అక్రమ డిప్యుటేషన్లు సరేసరి. ఏ ఉద్యోగిని ఎక్కడి నుంచి ఎక్కడకు పంపుతారో కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది. ఈ అక్రమ డిప్యుటేషన్లలో భారీగా చేతులు మారినట్లు ఆరోపణలు వచ్చినా పట్టించుకున్న వారు లేరు. ఇవి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా జరిగాయంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక ప్రైవేటు

మిగతా 6వ పేజీలో

డ్వామాలో శీనారెడ్డి భారీ దోపిడీ

త్రిసభ్య కమిటీ ఎదుట ప్రధాన ఫిర్యాదుదారు ఈదర మోహన్

- పలు ఆరోపణలపై అంశాల వారీ వివరణ
- కొనసాగుతున్న విచారణ
- సోషల్ ఆడిట్ పరిస్థితిపైనా దృష్టి

ఒంగోలు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : డ్వామా పీడీగా కె.శీనారెడ్డి పనిచేసిన కాలంలో పెద్దఎత్తున అవినీతి, అక్రమాలు జరిగాయని, తద్వారా భారీగా ప్రజాధనాన్ని ఆయన దోపిడీ చేశారని పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఈదర మోహన్ ఆరోపించారు. ఆమేరకు శీనారెడ్డిపై వచ్చిన ఫిర్యాదులపై విచారణ నిర్వహిస్తున్న త్రిసభ్య కమిటీ ఎదుట పలు అంశాలపై వివరణ ఇచ్చారు. డ్వామా పూర్వ పీడీ శీనారెడ్డి అక్రమాలపై విచారణ చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలతో కలెక్టర్ అన్సారియా త్రిసభ్య కమిటీని నియమించిన విషయం విదితమే. డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు, జిల్లా ఆడిట్ అధికారి నారాయణరెడ్డి, స్టెప్ సీఈవో శ్రీమన్నారాయణలతో కూడిన కమిటీ కొద్దిరోజులుగా డ్వామాలో విచారణ చేస్తోంది. మంగళవారం కూడా కొనసాగించింది. జిల్లాలో శీనారెడ్డి పీడీగా పనిచేసిన కాలంలో ఉపాధి హామీ పథకంలో చోటుచేసుకున్న అవకతవకలపై దృష్టి సారించింది. సామాజిక తనిఖీలు, మండలాల్లో జరిగిన ప్రజావేదికలు.. ఆ సందర్భంగా సోషల్ ఆడిట్ బృందాలు అవకతవకలు జరిగినట్లు గుర్తించిన మొత్తాలు, వాటిని ప్రజావేదికల్లో పీడీ హోదాలో పాల్గొన్న శీనారెడ్డి తగ్గించడం, అనంతరం ఆయా సిబ్బందిని వ్యక్తిగత విచారణ పేరుతో పిలిచి రికవరీలు లేకుండా చేయడం, తదితర అంశాలకు సంబంధించిన ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు.



ప్రధాన ఫిర్యాదుదారు ఈదర మోహన్ నుంచి వివరాలు తెలుసుకుంటున్న త్రిసభ్య కమిటీ

అందరికీ నోటీసులు

భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయన్న ఫిర్యాదులు ఉన్న కనిగిరి, దోర్నాల, ముండ్లమూరు, కొండపి మండలాలకు సంబంధించిన ఫైళ్లపై విజిలెన్స్ అధికారి ఝాన్సీరాణి, ఆ విభాగంలో కీలకమైన ఉద్యోగి సురేష్‌లను త్రిసభ్య కమిటీలోని అధికారులు పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. తదనంతరం ఇతర విభాగాల వారీ ఫైళ్లను పరిశీలిస్తున్నారు. ఇదిలాఉండగా ఆరోపణలు ఎదుర్కొంటున్న శీనారెడ్డిని వచ్చేనెల 2న విచారణకు హాజరుకావాలని నోటీసులు ఇచ్చిన త్రిసభ్య కమిటీ ఆలోపు ఆయా ఫైళ్ల పరిశీలనతోపాటు ఫిర్యాదుచేసిన వ్యక్తులను కూడా విచారించాలని నిర్ణయించింది. తదనుగుణంగా ప్రధాన ఫిర్యాదుదారునిగా ఉన్న పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఈదర మోహన్‌బాబును పిలిచి విచారించారు. ఆయన

మిగతా 6వ పేజీలో

ఒడిశా టూ ఒంగోలు



- జోరుగా గంజాయి రవాణా
- ముగ్గురు నిందితుల అరెస్టు
- రెండు కిలోల సరుకు పట్టివేత
- మధ్యవర్తిత్వం చేసిన ఓ మహిళ

ఒంగోలు క్రైం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గంజాయి ముఠాలు రూటు మార్చాయి. అక్రమ రవాణాపై రాష్ట్రంలో పోలీసులు నిఘా పటిష్టం చేయడంతో అక్రమార్కులు ఒడిశా వైపు దృష్టి సారించారు. అక్కడి నుంచి జోరుగా జిల్లాలోకి గంజాయి వస్తోంది. అందుకు కొందరు నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకొని విచ్చలవిడిగా వ్యాపారం చేస్తున్నారు. నగరంలోని కొత్త కూరగాయల మార్కెట్‌లో ముగ్గురు వ్యక్తులను మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా గంజాయి అక్రమ రవాణా గుట్టురట్టయ్యింది. పోలీసుల కథనం మేరకు.. స్థానిక విజయనగర్ కాలనీకి చెందిన షేక్ ఖాజా, బండారు భార్గవ్‌లు చీమకుర్తి మండలం మర్రిచెట్టపాలెంనకు చెందిన ఓ యువతి ద్వారా ఒడిశాలోని బి.సూరజ్ ఆచార్యను ఫోన్‌లో సంప్రదించారు. ఆచార్య మంగళవారం ఉదయం రెండు కిలోల గంజాయి ప్యాకెట్లను తీసుకొని స్థానిక కొత్త కూరగాయల మార్కెట్ వద్దకు వచ్చాడు. అప్పటికే ఫోన్‌లో సంప్రదింపులు చేస్తున్న ఖాజా, భార్గవ్‌లు సూరజ్ ఆచార్యను కలిశారు. ఆయన నుంచి గంజాయి ప్యాకెట్లు తీసుకొని డబ్బులు ఇస్తున్న సమయంలో అప్పటికే సమాచారం అందుకున్న ఒంగోలు వన్‌టౌన్ సీఐ నాగరాజు సిబ్బందితో దాడి చేశారు. అక్కడ గంజాయి కలిగి ఉన్న ముగ్గురిని అదుపులోకి తీసుకొన్నారు. వారి వద్ద రెండు కిలోల సరుకును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.



అంద్రకొండపైకి వెళ్లే దారి

చారిత్రక విశేషాల నేల

అంద్రకొండ

పురాతన శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న పుణ్యధామం

7



కలెక్టర్ అన్సారియాతో చర్చిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల, ఎంపీ మాగుంట

ఒంగోలు అభివృద్ధిపై దృష్టి

- కలెక్టర్‌తో ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల భేటీ
- ప్రభుత్వ భవనాలతోపాటు పలు అంశాలపై చర్చ

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని ప్రభుత్వ కార్యాలయ భవనాలపై ప్రజాప్రతినిధులు దృష్టి సారించారు. నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్స్ కార్పొరేషన్ (ఎన్‌బీసీసీ) అధికారులతో కలిసి మంగళవారం కలెక్టరేట్‌లో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్‌లు కలెక్టర్ తమీమ్ అన్సారియాతో భేటీ అయ్యారు. శిథిలావస్థలో ఉన్న ప్రకాశం భవనంతోపాటు పాత రిమ్స్, ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయంతోపాటు ఊరచెరువు అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై

మిగతా 6వ పేజీలో

జిల్లాపై అల్పపీడన ప్రభావం

- తూర్పు ప్రాంతంలో ముసురుపట్టి జల్లులు
- అవస్థ పడుతున్న ప్రజలు
- క్రిస్మస్ కొనుగోళ్లపైనా ప్రభావం
- పంటలు దెబ్బతింటాయని రైతుల ఆందోళన



ఒంగోలులో కురుస్తున్న వర్షం

ఒంగోలు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం జిల్లాపై కనిపిస్తోంది. ప్రత్యేకించి తూర్పు ప్రాంతంలో మంగళవారం ఉదయం నుంచి ముసురు పట్టింది. రోజంతా తెరపి లేకుండా జల్లులు కురుస్తూనే ఉన్నాయి. చలి తీవ్రత కూడా పెరిగింది. ఉదయం నుంచి ఒంగోలుతోపాటు టంగుటూరు, సింగరాయకొండ, కొండపి, మద్దిపాడు, కొత్తపట్నం, సంతనూతలపాడు, చీమకుర్తి, నాగులుప్పలపాడు, పొదిలి, తాళ్లూరు

మిగతా 6వ పేజీలో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నిషేధిత జాబితా నుంచి తొలగిస్తాం

- ఆస్తుల క్రయవిక్రయాలకు ఇబ్బంది లేకుండా చూస్తాం
- మర్రిపూడిలో భూముల సమస్యపై తహసీల్దార్ నరసింహం

6

శీనారెడ్డి భారీ దోపిడీ

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వ పెద్దలకు చేసిన ఫిర్యాదులలో కొన్నింటిపై వివరాలను అడిగారు. కాగా తాను పేర్కొన్న ఫిర్యాదులన్ని వాస్తవాలే అని సంబంధిత ఫైళ్ళను పరిశీలిస్తే స్పష్టంగా ఆ విషయం బయటపడుతుందని ఆ సందర్భంగా అధికారుల కమిటీకి మోహన్ చెప్పినట్లు సమాచారం.

కమిటీ దృష్టికి పలు అంశాలు

నాటి వైసీపీ ప్రభుత్వంలో కీలకమైన వారితో అంటకాగుతూ డ్వామాలో శీనారెడ్డి అడ్డగోలుగా అవినీతికి పాల్పడ్డాడని తద్వారా ప్రజాధనాన్ని భారీగా దోపిడీ చేశాడని మోహన్ త్రిసభ్య కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. తాను చేసిన ఫిర్యాదుపై అంశాల వారీగా వివరణలు ఇచ్చారు. ఆయన అధికారుల సూచనల మేరకు రాతపూర్వకంగా కూడా స్టేట్‌మెంట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. డ్వామా పీడీగా పనిచేసిన కాలంలో శీనారెడ్డి సంపాదించిన అవినీతి సొమ్ముతో కొనుగోలు చేసిన భూములు, భవనాలు ఇతరత్రా ఆస్తుల విషయంపై కూడా వారికి వివరాలు చెప్పినట్లు తెలిసింది. కాగా మరికొందరు ఫిర్యాదుదారులను కూడా పిలిచి విచారించాలన్న ఆలోచనలో త్రిసభ్య కమిటీ ఉన్నట్లు సమాచారం.

ప్రక్షాళన జరిగేనా?

(5వ పేజీ తరువాయి)

వైద్యశాలల అనుమతుల విషయంలోనూ అడ్డగోలు వ్యవహారాలు నడిచాయి. ఒక డాక్టర్ అందుకోసం తన వైద్య వృత్తినే పక్కన పెట్టి కార్యాలయంలో తిష్టవేసి వ్యవహారాలు నడిపిన ఉదంతాలు అనేకం ఉన్నాయి. మరోవైపు వైద్యశాఖ కార్యాలయంలోనే కొంతమంది ఉద్యోగులు దళారుల అవతారం ఎత్తారు. కార్యాలయానికి వివిధ పనుల కోసం వచ్చే వారితో బేరాలు మాట్లాడుకొని డబ్బులు వసూలు చేసిన ఘటనలు కూడా ఉన్నాయి.

పాలన కత్తి మీద సామే

గత ఐదేళ్లలో వైద్యశాఖ అనేక అవినీతి, అక్రమాలకు అడ్డాగా మారింది. ఈ నేపథ్యంలో జిల్లాకు వైద్యారోగ్యశాఖ అధికారిగా నియమితులైన డాక్టర్ వెంకటేశ్వర్లుకు పరిపాలన కత్తి మీద సాములా తయారైంది. పోయిన పరువును నిలబెట్టాలంటే ప్రక్షాళన దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఉమ్మడి జిల్లాలోని అద్దంకిలో పనిచేసిన వెంకటేశ్వర్లుకు అధికారిగా మంచి గుర్తింపు ఉంది. ఆ కారణంగానే అయనను జిల్లా వైద్యశాఖాధికారిగా నియమించారు. వెంకటేశ్వర్లు బుధవారం ఉదయం 10 గంటలకు బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆయన కార్యాలయంలో జరుగుతున్న అనేక అంశాలపై ఇప్పటికే సమాచారం తెప్పించుకొని ఒక అవగాహనకు వచ్చినట్లు సమాచారం. వైద్యశాఖ కార్యాలయ పరిస్థితితోపాటు అందులో పనిచేసే ఉద్యోగుల వ్యవహారాలు కూడా ఆయన దృష్టిలో ఉన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో వైద్యశాఖ పరువు, ప్రతిష్టలను ఇనుమడింపజేసే దిశగా నూతన డీఎంహెచ్‌వో అడుగులు వేసే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

జిల్లాపై అల్పపీడన ప్రభావం

(5వ పేజీ తరువాయి)

తదితర మండలాల్లోని పలుగ్రామాల్లో జల్లులు పడుతుండటంతో ప్రజలు బయటకు రాలేకపోయారు. ప్రత్యేకించి స్కూళ్లు, కార్యాలయాలకు వెళ్లేవారు, వీధి వ్యాపారులు ఎక్కువగా ఇబ్బంది పడ్డారు. క్రిస్మస్ కొనుగోళ్లపైనా తీవ్ర ప్రభావం కనిపించింది. బుధవారం క్రిస్మస్ పర్వదినం కాగా సాధారణంగా ముందు రోజున పెద్దఎత్తున వస్త్రాలు, స్వీట్లు, చెప్పులు, క్రిస్మస్ అలంకరణ వస్తువులు కొనుగోలు చేస్తారు. ప్రధాన పట్టణాలలో ఈ తరహా వ్యాపార సంస్థలు కిటకిటలాడుతుంటాయి. కానీ జల్లులు ఇబ్బందికరంగా మారాయి. తెరపి లేకుండా కురుస్తున్న జల్లులతో జనం రోడ్లపై తిరిగేందుకు వీలుకాలేదు.

వణికిపోతున్న రైతులు

అల్పపీడన ప్రభావంతో జిల్లాలో బుధ, గురువారాల్లో కూడా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ప్రధాన పంటలన్నింటిపైనా వర్షాలు, ఆ తరహా వాతావరణంతో తెగుళ్లు, పురుగులు ఉధృతి పెరిగి నష్టపోతున్నారు. సాధారణంగా ఈ సమయంలో తెల్లవారుజామున మంచు కురవడం తప్ప వర్షాలు పడవు. అలాంటిది ముసురు పట్టి జల్లులు కురుస్తుండటంతో పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పలుప్రాంతాల్లో ఇటీవల వేసిన లేత పొగ తోటలు, శనగ మొలకలు ఉరకెత్తి దెబ్బతినే పరిస్థితి ఉండగా, కోతకు వచ్చిన మిర్చి, వరి ఇతర పంటలకు నష్టం జరిగే అవకాశం ఉంది.

ఒంగోలు అభివృద్ధిపై దృష్టి

(5వ పేజీ తరువాయి)

చర్చించారు. ఒంగోలు నగరంలో ఖాళీ స్థలాల పరిస్థితిని కమిషనర్ వెంకటేశ్వరరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్‌బీసీసీ అధికారి రాజారాంకు వివరించారు. నగరంలో రీ డెవలప్‌మెంట్ కోసం తీసుకోవాల్సిన పలు అంశాలను ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌లు వివరించారు. అభివృద్ధికి సంబంధించి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ భవనాలతోపాటు కార్పొరేషన్‌లో ఖాళీగా ఉన్న స్థలాలను అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటామని ఎన్‌డీసీసీ అధికారి రాజారాం తెలిపారు. అనంతరం వారు నగరంలోని ఖాళీస్థలాలను పరిశీలించారు.

రేపు సీపీఐ శతాబ్ది ఉత్సవాలు ప్రారంభం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పేదలకు అండగా నిలిచిన సీపీఐ శతాబ్ది ఉత్సవాల ప్రారంభ సభ గురువారం ఒంగోలులో జరుగుతుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించి కార్మికుల వర్గానికి అండగా నిలిచి రైతాంగ పోరాటాలలో ముందుకు నిలిచిందన్నారు. తెలంగాణా సాయుధ పోరాట ఉద్యమానికి నాయకత్వం వహించిందన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 26వతేదీన ఒంగోలులోని అద్దంకి బస్టాండు నుంచి సీవీఎన్ రీడింగ్ రూము వరకు ర్యాలీ, అనంతరం అక్కడ బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు.



జేఎంబీ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

వైభవంగా.. క్యాండిల్ లైట్స్ ప్రదర్శన



- కొవ్వొత్తుల వెలుగులో క్రీస్తుకు స్వాగతం
- భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు జన్మదినం సందర్భంగా క్రీస్తుకు స్వాగతం పలుకుతూ ముందురోజు నిర్వహించే క్యాండిల్ లైట్ సర్వీస్ ప్రార్థనలు మంగళవారం భక్తి శ్రద్ధలతో జరిగాయి. ఒంగోలులోని జువెట్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చి ఆవరణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీనియర్ పాస్టర్ డి.జాన్‌ఆగస్టీన్ వాక్యోపదేశం చేశారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి హాజరై క్రిస్మస్ కేక్ కట్‌చేశారు. అలాగే జేఎంబీ చర్చిలో జరిగిన క్యాండిల్ లైట్ సర్వీస్ ప్రార్థనలో పాస్టర్ జాన్ కెనడీ వాక్యోపదేశం చేయగా, ఎంపీ మాగుంట ముఖ్య అతిథిగా విచ్చేశారు. క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇక నగరంలోని క్లౌపేటలోని ఎప్కోలు ప్రార్థన మందిరం, కబాడిపాలెంలోని పెంతెకోస్తు చర్చి, బాలాజి నగర్‌లోని హోసన్నా ప్రార్థన మందిరం, రామనగర్‌లోని నాజరీన్ బాప్టిస్ట్ చర్చితోపాటు పాత మార్కెట్ సెంటర్‌లోని పునీత చిన్న తెరెసమ్మ ప్రార్థన మందిరంలో క్యాండిల్ లైట్ సర్వీస్ ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా చర్చీల్లో క్రిస్మస్ కేక్ కట్ చేసి, స్వీట్లు పంచుకున్నారు. దీంతో అంతటా క్రిస్మస్ సంతోషాలు వెల్లిరిశాయి. ఈ సందర్భంగా అతిథులు, పాస్టర్లు భక్తులు, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.





పాత మార్కెట్ సెంటర్‌లోని చిన్న పునీతమ్మ చర్చి విద్యుత్ వెలుగులు

నిషేధిత జాబితా నుంచి తొలగిస్తాం

- ఆస్తుల క్రయవిక్రయాలకు ఇబ్బంది లేకుండా చూస్తాం
- మర్రిపూడిలో భూముల సమస్యపై తహసీల్దార్ నరసింహం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మర్రిపూడి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మర్రిపూడి గ్రామాన్ని నిషేధిత భూముల జాబితా నుంచి తొలగిస్తామని తహసీల్దార్ జ్వాలా నరసింహం తెలిపారు. అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. 'ఆస్తులున్నా.. అమ్ముకోలేరు' శీర్షికన మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. 2015లో జరిగిన మీభూమి గ్రామసభలో మర్రిపూడి గ్రామాన్ని దేవదాయశాఖ పరిధిలో చేర్చడంతో అప్పటి నుంచి ఆస్తుల క్రయవిక్రయాలు నిలిచిపోయాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యంలో వచ్చిన సమగ్ర కథనంపై ఉన్నతాధికారులు స్పందించారు. అటు దేవదాయ, ఇటు రెవెన్యూ శాఖలకు చెందిన క్షేత్రస్థాయి అధికారుల నుంచి సమాచారం తీసుకున్నారు. వారి ఆదేశాల మేరకు దేవదాయశాఖ కార్యనిర్వాహణాధికారి దేవదాయ భూమిగా పొరపాటున గ్రామాన్ని చేర్చారని, 40 సెంట్ల స్థలంలోనే వేణుగోపాలస్వామి, రామలింగేశ్వరస్వామి అలయాలు ఉన్నాయని తహసీల్దార్‌కు నివేదించారు. సబ్‌డివిజన్ చేసి మిగిలిన గ్రామకంతం భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. గ్రామ రెవెన్యూ అధికారి, సర్వేయర్‌లు కూడా రెవెన్యూ రికార్డుల ప్రకారం 547 సర్వే నంబరులోని 43.25 ఎకరాలు గ్రామకంతంగా నమోదై ఉందని నివేదిక ఇచ్చారు. ఈనేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశం మేరకు రెవెన్యూ సదస్సులో మర్రిపూడిలోని భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తామని తహసీల్దార్ స్పష్టం చేశారు. ఆస్తుల క్రయవిక్రయాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల, జేసీ గోపాలకృష్ణ

'మేలుకొలుపు' పుస్తకావిష్కరణ

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రచురించిన మేలుకొలుపు పుస్తకాన్ని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌లు ఆవిష్కరించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో మంగళవారం జరిగిన జాతీయ వినియోగదారుల దినోత్సవ సభకు వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాగుంట మాట్లాడుతూ వినియోగదారులు నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే దామచర్ల సూచించారు. కాగా అంతకు ముందు జరిగిన సభలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ మాట్లాడుతూ వినియోగదారులు వస్తువులు కొనుగోలు చేసే సమయంలో క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే తీసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన వస్తువులకు తప్పని సరిగా బిల్లులు తీసుకోవాలని, వినియోగదారులు నష్టపోకుండా ఉండేందుకు చట్టాలను అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముసాయిదా ఓటర్ల జాబితా పరిశీలన

మద్దిపాడు, డిసెబంకె 24(ఆంధ్రజ్యోతి): ముసాయిదా ఓటర్ల జాబితా తయారీ కోసం బీఎల్‌వోలు తీసుకుంటున్న చర్యలను జిల్లా ఎన్నికల రోల్ అబ్జర్వర్, డబ్ల్యూడీసీడబ్ల్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎ.సూర్యకుమారి పరిశీలించారు. మద్దిపాడు తహసీల్దార్ కార్యాలయానికి విచ్చేసిన ఆమె రికార్డులను తనిఖీ చేశారు. బీఎల్వోలకు పలు సూచనలు చేసి రికార్డుల నిర్వహణ పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి అక్కడ చిన్నారులతో కాసేపు ముచ్చటించారు.

భగవద్గీత గ్రంథాలతో ప్రచారం

యద్దనపూడి (మార్టూరు), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలం సూరవరపుపల్లి గ్రామంలో మంగళవారం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక నరసరావుపేట కమిటీ సభ్యులు భగవద్గీత గ్రంథాలతో ప్రచారం నిర్వహించారు. కమిటీ సభ్యులు ముఖ్యంగా మహిళలు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. అనంతరం అనంతవరం, వింజనంపాడు గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఘడియం పెద్దిరెడ్డి, రమేష్, భాస్కర్, వెంకటేశ్వర్లు, అశోక్, పలువురు మహిళలు పాల్గొన్నారు.



బోనేపల్లివారిపాలెం వెన్నుదశలో ఉన్న మొక్కజొన్న

వర్షంతో రైతుల్లో గుబులు

చీమకుర్తి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి) : అల్పపీడన ప్రభావంతో మంగళవారం చీమకుర్తిలో రోజంతా మేఘావృతమై వర్షం కుస్తోంది. రాబోయే రెండురోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణశాఖ హెచ్చరికలు రైతులను అందోళనకు గురి చేస్తోంఇ. మండలపరిధిలో పొగాకు, కంది, వరి, మినుము, మొక్కజొన్న, మిరప పంటలను ఎక్కువగా సాగు చేశారు. ఈక్రమంలో భారీ వర్షాలు కురిస్తే అన్నిరకాల పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. దీంతో రైతుల్లో గుబులు రేపుతోంది.

ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక మామిడిపాలెంలోని ఈవీఎంల గోడౌన్‌ను కలెక్టర్ తమీమ్ అన్సారియా మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు.. ఆయా అసెంబ్లీ నియోకవర్గాల వారీగా ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూములను పరిశీలించిన అనంతరం కలెక్టర్ రిజిస్టర్‌లో సంతకం చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమోరాల పనితీరును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం రాజకీయ పార్టీల నేతలతో పలు అంశాలను చర్చించారు. కార్యక్రమంలో ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మి, రాజకీయ పార్టీలకు చెందిన కోనేటి వెంకటరావు, క్రాంతికుమార్, బి.రాజశేఖర్ పాల్గొన్నారు.

రెండు చెరువులు అభివృద్ధి

పరిశీలించిన మంత్రి స్వామి



చెరువును పరిశీలిస్తున్న మంత్రి స్వామి, డ్వామా పీడీ జోసఫ్ కుమార్

టంగుటూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రెండు చెరువులను అభివృద్ధి చేస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. చెరువుల చుట్టూ వాకింగ్ ట్రాక్ కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. మండలంలోని తూర్పు నాయుడుపాలెం చెరువును మంగళవారం ఆయన డ్వామా పీడీ జోసఫ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. దీనితోపాటు జమ్ములపాలెం తాగునీటి చెరువును కూడా అమృత్ సరోవర్ పథకం కింద అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. చెరువుల చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం జమ్ములపాలెం చెరువును డ్వామా పీడీ పరిశీలించారు. ఆయన వెంట అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటస్వామి, ఏపీవో సుభాషిణి, జమ్ములపాలెంలో టీడీపీ నాయకుడు మక్కెన వెంకట్రావు ఉన్నారు.

అండర్-12 జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్-12 క్రికెట్ జట్టు ఎంపిక చేసినట్లు జిల్లా కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఒంగోలు నగరం మంగమూరురోడ్‌లోని క్రికెట్ సబ్ సెంటర్ మైదానంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు జిల్లావ్యాప్తంగా 50 మంది క్రీడాకారులు హాజరయినట్లు పేర్కొన్నారు. వారిలో ప్రతిభ చాటిన 26మందిని ఎంపిక చేశామని, వారికి ఈనెల 29వ తేదీన కొరిశపాడు మండలం రావినూతలలోని క్రికెట్ స్టేడియంలో రెండు రోజులపాటు మ్యాచ్‌లు నిర్వహించి, ఉత్తమ ప్రతిభ కనబరిని వారిలో 15మందిని ఫైనల్ జట్టుగా ఎంపిక చేస్తామని వెల్లడించారు. ఈ జట్టు జనవరి 9వ తేదీ నుంచి కృష్ణా జిల్లా మూలపాడులో రిజగే అంతర్ జిల్లాల క్రికెట్ మ్యాచ్‌ల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపిక పోటీల పర్యవేక్షకులుగా కోచ్‌లు సుధాకర్, చంద్ర, లెఫ్ట్ శ్రీను, బాబూరావు వ్యవహరించగా, అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ బచ్చు శ్రీనివాసరావు, సభ్యులు నవీన్ హనుమంతరావు, డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్, కొత్తూరు బలరాం, అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ అద్దె బకాయిలు వసూలు చేయాలి

- మాల కార్పొరేషన్ చైర్మన్ విజయకుమార్

ఒంగోలు నగరం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ షాపింగ్ కాంప్లెక్స్‌లను నిర్వహిస్తూ అద్దెబకాయిలు చెల్లించని వారిపై తగిన చర్యలు తీసుకోవాలని మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయకుమార్ ఆదేశించారు. మంగళవారం ఒంగోలులోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గతంలో తీసుకున్న రుణాల రికవరీని పెంచాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్ షాపింగ్ కాంప్లెక్స్‌లను నిర్వహిస్తున్న ఎక్కువ మంది అద్దెబకాయిలు చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారని చెప్పారు. పలువురు లబ్దిదారులు దుకాణాలు నిర్వహిచకుండా తాళాలు వేసి తమ ఆధీనంలో ఉంచుకుంటున్నారని తెలిపారు. ఈ కాంప్లెక్స్‌లలో ఉన్న దుకాణాల్లో బినామీలు వ్యాపారాలు చేస్తున్నారని, అధికారులు వెంటనే ఇలాంటి వారిని గుర్తించి ఖాళీ చేయించాలని స్పష్టం చేశారు. ఖాళీ చేయించిన దుకాణాలను తిరిగి అర్హులకు కేటాయించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్‌కు రూ.340 కోట్లు కేటాయిచిందని, ఈ నిధులతో వచ్చే నెల నుంచి ఎస్సీలకు రుణాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఈడీ అర్జున్‌నాయక్, సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

టెన్నిస్‌లో గిద్దలూరు చిన్నారుల జయకేతనం



టెన్నీస్ విజేతలతో కోచ్ మురళిమోహన్‌రెడ్డి

గిద్దలూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో జరిగిన సౌత్ ఇండియా టెన్నిస్ టోర్నమెంటులో గిద్దలూరుకు చెందిన పలువురు బాలబాలికలు వివిధ విభాగాల్లో విజేతలుగా నిలిచారు. 12+ బాలుర విభాగంలో సయ్యద్ షాహిల్ విజేతగా నిలువగా 13+ బాలికల విభాగంలో ఎం.భావనదేవి రన్నర్‌గా నిలిచారు. బాలుర విభాగంలో ఎం.కుర్షిద్ వినయం సాధించారు. సోనకేశ్వర్ టోర్నమెంటులో బెస్ట్ ప్లేయర్ అవార్డు పొందాడు. గిద్దలూరు కోర్టు నుంచి 10 మంది బాలబాలికలు ఈ టోర్నమెంటులో పాల్గొనగా మిగతావారు సైతం తమ ప్రతిభ కనపరిచారు. టెన్నిస్ విజేతలను, వీరికి కోచ్‌గా వ్యవహరించిన సి.హెచ్.మురళిమోహన్‌రెడ్డిని లాన్‌టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జి.కె.మోహన్‌రెడ్డి అభినందించారు.

అంతర యూనివర్సిటీ ఖోఖోకు సెయింట్‌ఆన్స్ విద్యార్థి ఎంపిక



టి.శ్రీనివాస్

చీరాల, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి) : అంతర యూనివర్సిటీ ఖోఖో జట్టుకు జేఎన్‌టీయూ కాకినాడ తరపున ఆడేందుకు సెయింట్‌ఆన్స్ కళాశాల ఎంటెక్ విద్యార్థి టీఎస్.శ్రీనివాస్ ఎంపికయినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు మంగళవారం తెలిపారు. ఇటీవల విజయవాడలో జేఎన్‌టీయూ కాకినాడ వారు నిర్వహించిన సెలక్షన్స్‌లో శ్రీనివాస్ ఎంపికయ్యాడని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.జగదీష్‌బాబు తెలిపారు. తమిళనాడులో జరగనున్న ఇంటర్ యూనివర్శిటీ పోటీల్లో పాల్గొంటాడని పీడీ శ్రీనివాసరావు తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు దొనకొండ విద్యార్థిని..



ప్రైసీతో ఉపాధ్యాయులు

దొనకొండ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దొనకొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న ఎనుబరి ప్రైసీ జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ కె.నర్శింహరావు తెలిపారు. ఈనెల 21, 22 తేదీల్లో కర్నూలు డీఎస్ఏ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ నెట్‌బాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చటంతో నెట్‌బాల్ ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 28వ తేదీన చెన్నైలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరుపున పాల్గొంటున్నట్లు వివరించారు.


వెలుగు ఇన్‌చార్జి పీడీగా రవికుమార్

ఒంగోలు నగరం డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వెలుగు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఇన్‌చార్జి ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా తేళ్ల రవికుమార్‌ను నియమించారు. ప్రస్తుతం పీడీగా పనిచేస్తున్న వసుంధరను ప్రభుత్వం శ్రీకాళహస్తి బదిలీ చేసింది. మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్‌గా పనిచేస్తున్న రవికూమార్‌కు వెలుగు పీడీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారీయా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 26న ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

నీటికుంటలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

మద్దిపాడు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటరాజుపాలెం సమీపంలో ఉన్న బీఏకేఆర్ కళాశాల వద్ద జాతీయ రహదారికి పక్కగా ఉన్న నీటికుంటలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించి ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. మృతుని శరీరంపై ఎటువంటి దుస్తులు లేవు. ఎడమ భుజంపై పులి బొమ్మ పచ్చబొట్టు, కుడి మోచేతి కింది భాగంలో మరో పచ్చబొట్టు ఉంది.

గొడుగు బండ కింద దేవాలయం



ప్రకృతి సోయగాలతో, పక్షుల కిలకిలారావాలతో, చారిత్రక విశేషాలతో భక్తులను అలరిస్తోంది అండ్రకొండ. శ్రీరాముడిచే ప్రతిష్ఠించబడిన రామలింగేశ్వర స్వామి, పర్వతవర్ధిని అమ్మవార్లు కొలువైన పురాతన శైవక్షేత్రంగా విరాజిల్లుతోంది. వందలాది ఎకరాల ఆస్తులున్నా అభివృద్ధికి ఆమడదూరంగా నిలిచిపోయింది. దేవదాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఆలయం గుర్తులు కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఈ క్రమంలో కూచిపూడి అండ్రకొండపై ఆంధ్రజ్యోతి అందిస్తున్న ప్రత్యేక కథనం..

చారిత్రక విశేషాల నేల

అండ్రకొండ



అండ్ర రామలింగేశ్వర స్వామికి పూజలు

మర్రిపూడి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రావణ సంహారం అనంతరం శ్రీరామ చంద్రుడు బ్రాహ్మణ హత్య పాతకం తొలిగించుకునేందుకు అండ్రకొండపై సీతాదేవితో కలిసి శివలింగ ప్రతిష్ఠ చేసినట్లు పురాణ చరిత్ర తెలుపుతోంది. శివలింగం తెచ్చేందుకు వెళ్లిన హనుమంతుడు రాక ఆలస్యం కావడంతో శైకత లింగాన్ని రాములవారు ప్రతిష్ఠించారని ప్రతీతి. అందువల్ల రెండు శివలింగాలు ఇక్కడ భక్తులకు దర్శనమిస్తాయి. రాములవారు ప్రతిష్ఠించడంతో రామలింగేశ్వర స్వామిగా, పార్వతీదేవి పర్వతవర్ధినిగా భక్తులకు కొంగు బంగారమై విలసిల్లుతున్నారు. శ్రీకృష్ణ దేవరాయలు దేవాలయ కైంకర్యాల కోసం 270 ఎకరాల భూమిని భూరి విరాళంగా అందజేశారు.

పురాతన శైవ క్షేత్రంగా విరాజిల్లుతున్న పుణ్యధామం

నిర్వహణను వదిలేసిన దేవదాయ శాఖ

గొడుగు బండే దేవాలయం...

కొండ పైభాగంలో ఒక పెద్ద బండరాయి గొడుగులాగా మూడు దిక్కుల ఎటువం టి ఆధారం లేకుండా నిలిచి ఉంది. బండ కింద రామలింగేశ్వర స్వామి, అమ్మవారల ప్రతిష్ఠ జరిగింది. దీంతో గొడుగు బండే దేవాలయంగా నిలిచిపోయింది. ఆ గొడుగు బండ కింద 100 మందికిపైగా సేద తీరే అవకాశం ఉంది. ఎటువంటి ఆధారాలూ లేకుండా అంతపెద్ద రాయి నిలిచి ఉండటం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కొద్దికాలం తరువాత గ్రామస్థులు రాతి గోడను బండ చుట్టూ నిర్మించారు.

మహిమాన్వితం హనుమంతుని కోనేరు

సీతాదేవి స్నానం ఆచరించేందుకు కొండ చట్టుపైన ఆంజనేయస్వామి తన గోటితో పెద్ద రాతిబండను తీసి పక్కన పెట్టడంతో గుండ్రని కోనేరు ఏర్పడింది. 15 అడుగుల లోతులో ఉన్న కోనేటిలో నీరు సంవృద్ధిగా ఉండటం దైవ మహిమగా భక్తులు భావిస్తుంటారు. రాతిచట్టుపైన ఎంతటి వేసవి కాలమైనా, కరువు పరిస్థితులు ఎదురైనప్పటికీ నీటి ఊట తగ్గకపోవడం స్వామి మహిమగా భావిస్తారు. ఆంజనేయస్వామి గోటితో తీసిన రాయి సైతం ఆ కోనేరు పక్కనే కనిపిస్తూ ఉంటుంది. సీతాదేవి రాముల వారితో కలిసి వామన గుంతలాట ఆడినట్లు ఇక్కడి గుంతలను తెలుస్తోంది. కొండ పైభాగంలో అమ్మవారి పాదాలు సైతం రాతిపైన దర్శనమిస్తాయి. యువకులు చట్టు మీద పాకుకుంటూ వెళ్లి పాదాలకు పూజలు చేస్తుంటారు. మునులు రాత్రి వేళ స్వామి వారికి పూజలు చేస్తారని వినికిడి. తూర్పు ఈశాన్య భాగంలో లొద్దికుంట నంది ఆకారంలో ఉంటుంది. ఆ నంది ఆకారంలో గల రాతిపైన దేవ భాషలో లిపి చెక్కబడి ఉన్నట్లు స్థానికులు చెబుతుంటారు.



రాతిచట్టు మీద ఉన్న కోనేరులో పాచి నీరు

ఆస్తులున్నా అభివృద్ధికి ఆమడ దూరం

వందలాది ఎకరాల ఆస్తి ఉన్నప్పటికీ అభివృద్ధి జాడలు కొండపైన మచ్చుకైనా కనిపించవు. దేవదాయ అధికారులు ఈ కొండను సందర్శించిన దాఖలాలు లేనేలేవు. కేవలం దేవదాయ శాఖ పరిధిలో ఉన్నప్పటికి అభివృద్ధి ఊసునే అధికారులు మర్చిపోయారు. కార్తీక మాసంలో భక్తులు అధిక సంఖ్యలో కొండపైకి చేరుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. కొండపైకి వెళ్లే సోపాన మార్గం ఇరువైపుల చెట్లు అల్లుకుపోయి కొండ ఎక్కే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. పొంగళ్లు ఆరుబయటే పెట్టుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం అండ్రకొండకు వెళ్లే రహదారిని అభివృద్ధి చేస్తే పర్యాటక కేంద్రంగా కూడా భాసిల్లుతుందని స్థానికులు చెబుతున్నారు. స్థానిక శాసన సభ్యులు, రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖా మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి దేవాలయ అభివృద్ధికి చొరవ చూపించాలని భక్తులు కోరుతున్నారు.

గాంధీరోడ్డులో



షాపింగ్ సందడి

- ఊపందుకున్న ఫుట్‌పాత్ వ్యాపారాలు
- కొనుగోలుదారులతో వీధులన్నీ కిటకిట

ఒంగోలు, కార్పొరేషన్, డిసెంబరు 24 (ఆంధ్రజోతి) : అక్కడ అందమైన కుర్చీలు ఉండవు. ఏసీ గదులు కనిపించవు. కష్టమర్ల కోసం కనీసం కాఫీ తెప్పించే అవకాశం ఉండదు. కానీ మనసుదోచే ముత్యాల హారాలు ఉంటాయి. అదేనండీ... మధ్యతరగతి ప్రజల అంగడి (స్ట్రీట్‌మాల్). నగరంలో ఇంద్రధనస్సులు కుప్పలు పోసినట్లుగా రంగు రంగుల వస్త్రాలు, వస్తువులెన్నో స్వాగతం పలుకుతున్నాయి. వీధి తోరణాల్లా అత్తరు వాసనతో అందరినీ ఆకర్షిస్తున్నాయి. క్రిస్మస్ పండుగ సందర్భంగా స్టార్స్, స్వీట్‌లు, కేక్‌లు కొనగోళ్లు, ప్రత్యేకించి కొత్త దుస్తుల కొనుగోళ్లతో నగర వీధులన్నీ కళకళలాడుతున్నాయి. దుస్తుల కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి.

● ఇష్టమైన వాటి కోసం బారులు

జిల్లాలో క్రిస్మస్ సందడి సంతరించుకుంది.



పండుగ సందర్భంగా నూతన వస్త్రాలు కొనుగోలు చేసేందుకు ప్రజలు ఉవ్విళూరుతున్నారు. దీంతో ప్రముఖ వస్త్ర వ్యాపార దుకాణాలతోపాటు, ఫుట్ వ్యాపారాలు ఊపందుకున్నాయి. కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. ప్రజలకు అందుబాటు ధరలో అందించేందుకు ప్రముఖ వస్త్ర దుకాణాలు బంపర్ ఆఫర్‌లు ప్రకటిస్తుండగా, సామాన్యుడి షాపింగ్ మాల్ అయిన వీధి వ్యాపారాలు అంతే స్థాయిలో డిస్కౌంట్ ధరలతో ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. మహిళలు గాజులు, రింగ్‌లు, ఇతర అలంకరణ సామగ్రి కొనుగోలుతో బిజీబిజీగా గడుపుతుండగా, యువత రెడీమేడ్ వస్త్రాల కోసం బారులు తీరుతున్నారు. రానున్న నూతన సంవత్సరం, సంకాంత్రి పండగ సందర్భంగా వ్యాపారాలు ఊపందుకున్నాయి.



గుప్త నిధుల ముఠా అరెస్ట్

ఆశచూపి తవ్వకాల పేరుతో డబ్బు వసూలు చేసిన నిందితులు

వెల్లడించిన డీఎస్పీ నాగరాజు



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగరాజు

మార్కాపురం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పొలాల్లో గుప్త నిధులున్నాయని నమ్మబలికి ఓ వ్యక్తి వద్ద రూ.6 లక్షల నగదును కొట్టేసిన ముఠాను మార్కాపురం పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక సబ్ డివిజనల్ పోలీసు కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ నాగరాజు వివరాలు వెల్లడించారు. స్థానిక విద్యానగర్‌లో నివాసముండే ముటుకుల సుబ్రహ్మణ్యం ఓ న్యాయవాది వద్ద గుమస్తాగా పనిచేస్తున్నాడు. ఓ కేసు విషయమై పెద్దారవీడు మండలం కలనూతల గ్రామానికి చెందిన గోదా నడిపయ్యతో సుబ్రహ్మణ్యానికి పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో తమ పొలాల్లో నిధి నిక్షేపాలు ఉన్నాయని నడిపయ్య తెలిపాడు. తనకు నిధులు వెలికితీసే ముఠా కూడా తెలుసని, అందుకు రూ.10 లక్షల మేర ఖర్చవుతుందని చెప్పాడు. పెట్టుబడిపెడితే పదిరెట్లు వెనక్కి తిరిగి ఇస్తానని నమ్మకంగా చెప్పాడు. దీంతో సుబ్రహ్మణ్యం రూ.6 లక్షలను నడిపయ్య చెప్పిన విధంగా ఒడిసా రాష్ట్రానికి చెందిన ఆవుల ఝాన్సీ అనే మహిళకు ఫోన్‌పే ద్వారా పంపాడు. ఈ క్రమంలో ఆరుగురు ముఠాసభ్యులు కలిసి కలనూతల గ్రామ సమీప పొలాల్లో తవ్వకాలు చేపట్టారు. నిధులు దొరకలేదని ఇంకా డబ్బు ఇస్తే తాను తప్పకుండా నిధులను బయటికి తీయిస్తానని నడిపయ్య మళ్లీ సుబ్రహ్మణ్యాన్ని అడిగాడు. తన వద్దకు డబ్బులులేవని, ముందు ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని సుబ్రహ్మణ్యం నిలదీశాడు. దీంతో నడిపయ్యతోపాటు ముఠాలోని సభ్యులైన శ్రీకాకుళం జిల్లా పాతపట్నానికి చెందిన అట్లాడ రవి, మార్కాపురం మండలం కొండేపల్లికి చెందిన గంటా కోటిరెడ్డి, కలనూతల గ్రామానికే చెందిన నల్లబోతుల బ్రహ్మయ్య, నల్లబోతుల శ్రీను, వెంకటరావులు డబ్బులు తిరిగి ఇచ్చేదిలేదని దౌర్జన్యం చేశారు. దీనిపై సుబ్రహ్మణ్యం పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న ఎస్సై సైదుబాబు వెంటనే సీఐ సుబ్బారావు ఆదేశాల మేరకు నిందితులను పట్టుకున్నారు. మరో నిందితుడు వెంకటరావు పరారీలో ఉన్నాడు. సీఐ పి.సుబ్బారావు, టౌన్ ఎస్సైలు సైదుబాబు, డాక్టర్ రాజమోహన్‌రావు పాల్గొన్నారు.

యథాతథ స్థితిని కొనసాగించండి

- పెట్లూరులో తోపు పోరంబోకు స్థలాన్ని పరిశీలించిన ఆర్డీవో లక్ష్మీప్రసన్న
- 'మీకోసం'లో ఫిర్యాదుదారులు, గృహాలు నిర్మించుకున్న వారితో చర్చ



పెట్లూరులో స్థానికులతో మాట్లాడుతున్న ఆర్డీవో లక్ష్మీప్రసన్న

కొండపి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెట్లూరు సర్వే నంబరు 450లో ఉన్న తోపు పోరంబోకు స్థలాన్ని ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న మంగళవారం పరిశీలించారు. యథాతథ స్థితిని కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. తమ స్థలాన్ని కొందరు ఆక్రమించుకున్నారంటూ పెట్లూరుకు చెందిన కల్లూరి చెంచురామయ్య, చంద్రమౌళి, శ్రీను కుటుంబీకులు సోమవారం ఒంగోలులో నిర్వహించిన 'మీకోసం'లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. న్యాయం చేయకపోతే ఆత్మహత్యే శరణ్యమంటూ హడావుడి చేశారు. ఈనేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో పెట్లూరు వచ్చి వివాదాస్పద భూమిని పరిశీలించారు. అందులో గృహాలు నిర్మించుకున్న వారితో ఆమె మాట్లాడారు. అనంతరం చెంచురామయ్య, చంద్రమౌళి, శ్రీనుతో మాట్లాడారు. వారు ఫిర్యాదులో చేసిన ఆరోపణలపై ఆరా తీశారు. దాడి చేసింది ఎవరు అని ప్రశ్నించారు. గంజాయి, మద్యం అక్రమంగా అమ్ముతున్న వారిని చూపించాలని కోరారు. అయితే తాము అలా ఫిర్యాదు చేయలేదని అర్జీదారులు బదులిచ్చారు. తమ స్థలంపై కోర్టు స్టేటస్‌కో ఉత్తర్వులు ఉంటే కొందరు ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించుకున్నారని వారు చెప్పారు. ఈ సమయంలో తోపు పోరంబోకు స్థలంలో ఇళ్లు నిర్మించుకున్న పలువురు ఆర్డీవోతో మాట్లాడుతూ స్థలం విషయం కోర్టులో ఉంటే కల్లూరి కుటుంబీకులు రికార్డుల్లో ఎలా నమోదు చేయించుకున్నారో చెప్పాలని అడిగారు. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ స్థలం విషయంలో యథాతథ స్థితిని కొనసాగించాలని తహసీల్దార్ పి.మురళిని ఆదేశించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఆర్డీవో వెంట పామూరు సీఐ భీమానాయక్, కొండపి పోలీసులు, తహసీల్దార్ కార్యాలయ అధికారులు ఉన్నారు. అనంతరం కొండపి చేరుకున్న ఆర్డీవో.. తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులు భద్రపరిచే గదిని పరిశీలించారు. దాన్ని శుభ్రంగా ఉంచాలని వీఆర్ఏలకు సూచించారు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బందితో కలిసి ఆమె క్రిస్మస్ కేక్‌ను కట్‌చేశారు.

క్షౌరవృత్తిదారులకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి



ఎమ్మెల్యే దామచర్లకు వినతిపత్రం ఇస్తున్న సంఘ నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్షౌరవృత్తి దారులకు 150 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని పట్టణ క్షౌరశాలల సంఘం నాయకులు మంగళవారం ఒంగోలులో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నాయీబ్రాహ్మణ క్షౌర వృత్తిదారులకు జీవోనెంబరు 15 ద్వారా ఉచిత విద్యుత్‌ను ఇచ్చిందన్నారు. అయితే జీవోను తిరుపతి, విశాఖపట్నం పరిధిలో అమలుచేస్తుండగా ఏపీట్రాన్స్‌కో విజయవాడ పరిధిలో అమలు చేయడం లేదని తెలిపారు. వృత్తిపరంగా ఆర్థిక పరిస్థితి రోజురోజుకు దిగజారిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల 150 యూనిట్ల ఉచితవిద్యుత్ పథకాన్ని అమలు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే జనార్దన్ మాట్లాడుతూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారంచేసేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కె.రామకృష్ణ పాల్గొన్నారు.

రేపు రోల్ బాల్ క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17, 19 రోల్‌బాల్ క్రీడాకారుల ఎంపిక ఈనెల 26వ తేదీన మధ్యాహ్నం 3గంటలకు ఒంగోలులోని హైదరాబాద్ పబ్లిక్ స్కూలులో జరుగుతాయని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ హజీరాబేగం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలలో పాల్గొనే క్రీడాకారులు స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జెరాక్స్, జనన ధృవీకరణ పత్రం జెరాక్స్‌తోపాటు సొంత కిట్‌తో హాజరు కావాలన్నారు. వివరాలకు 9491665070 సెల్ నంబరు ద్వారా సంప్రదించాలని కోరారు.

గ్రామ సచివాలయాల వద్ద రీసర్వే రాళ్లు

తాళ్లూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రీసర్వే గ్రామాల్లో రాళ్ల ఏర్పాటు కోసం ప్రభుత్వం విడుదల చేసిన నగదులో రూ.8లక్షల 50వేల నగదు మండల సర్వేయర్, గ్రామ సర్వేయర్ల ఖాతాల్లో ఉన్నాయని తహసీల్దార్ కె.సంజీవరావు తెలిపారు. 5688 సర్వే రాళ్ల రీసర్వే గ్రామాల సచివాలయాల వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. ఈమేరకు కలెక్టర్ తమీమ్ అన్సారియాకు నివేదిక అందజేశారు. 'నిధులు రాళ్లపాలు' శీర్షికన ఈనెల 23న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కలెక్టర్ ఆదేశానుసారం జిల్లా సర్వే, భూమి రికార్డుల అధికారి విచారణకు ఆదేశించారు. దీనిపై గ్రామ సర్వేయర్లు, మండల సర్వేయర్, వీఆర్‌వోలను క్షేత్రస్థాయిలో విచారించారు. మండలంలోని రీసర్వే జరిగిన సార్వమిట్ల, దోసకాయలపాడు, శంకరనారాయణపురం, మల్కాపురం, మాధవరం, శివరాంపురం గ్రామాల్లో సర్వే ఏర్పాటుకు 6762 హద్దు రాళ్ల వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. వీటిని ఏర్పాటుచేయడానికి రూ.10లక్షల 14వేల 300 నగదును ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఆయాగ్రామాల్లో 1074 సర్వేరాళ్లను ఏర్పాటు చేయడానికి రూ.లక్షా 61 వేల 100 వెచ్చించినట్టు చెప్పారు. రూ.8 లక్షల 53వేల 200 నగదు మిగిలి ఉందని తెలిపారు. గ్రామ సచివాలయాల వద్ద మిగిలిన 5688 రాళ్లు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం రాళ్లు పాతేందుకు విడుదల చేసిన నగదులో రూ.8 లక్షల 50 వేల 300 నగదు మండల సర్వేయర్, విలేజ్ సర్వేయర్ల ఖాతాల్లో ఉన్నట్టు నిర్ధారించామని తహసీల్దార్ తెలిపారు. ఉత్తర్వులు రాగానే రాళ్ల పాతటంపై తగు చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.



మర్రెడ్డి దంపతులను సన్మానిస్తున్న మంత్రి సవిత



ప్రమాణస్వీకారం చేస్తున్న మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి

ఘనంగా మర్రెడ్డి ప్రమాణస్వీకారం

జిల్లాకు చెందిన మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి అగ్రికల్చర్ మిషన్ వైస్‌చైర్మన్‌గా మంగళవారం గుంటూరు జిల్లా తాడేపల్లిలోని సీఎస్ఆర్ కల్యాణ మండపంలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, సవిత, కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్, దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై కలెక్టర్ సీరియస్

- విచారణకు ఆదేశం
- త్రిసభ్య కమిటీ నియామకం

సింగరాయకొండ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండ గ్రామ పంచాయతీలో జరిగిన నిధుల దుర్వినియోగంపై కలెక్టర్ తమీమ్ అన్సారియా సీరియస్ అయ్యారు. విచారణకు త్రిసభ్య కమిటీని నియమించారు. పంచాయతీలో 2021 ఏప్రిల్ 1నుంచి ఇప్పటి వరకూ పెద్దఎత్తు నిధులు గోల్‌మాల్ అయినట్లు కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. స్పందించిన ఆమె విచారణ కోసం జిల్లా ఎంఈపీఎంఏ ప్రాజెక్ట్ డైరెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయ పరిపాలన అధికారి, జిల్లా ఆడిట్ అధికారి కార్యాలయ సహాయ ఆడిటర్‌తో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశారు. ఈనెల 27వ తేదీన కమిటీ సభ్యులు సింగరాయకొండ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించనున్నారు. నిధుల దుర్వినియోగంపై పూర్తిస్థాయిలో విచారించి వారంలో నివేదికను కలెక్టర్ అన్సారియాకు అందజేయనున్నారు. అవసరమైన రికార్డులను సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ పంచాయతీ సర్పంచ్, కార్యదర్శిని ఆదేశించారు.


చీమకుర్తిలో ప్రభపై కేక్ కట్ చేసి తినిపిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్


అంబేడ్కర్‌భవన్‌లో జరిగిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల, ఎంపీ మాగుంట


సంజయ్‌గాంధీ కాలనీలో..

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



క్వీన్ ఇంజనీరింగ్ కళాశాలలో..

- పాల్గొన్న ఎంపీ మాగుంట, ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్
- విద్యాసంస్థల్లోనూ ఉత్సాహంగా సంబరాలు

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏసు క్రీస్తు జన్మదినం క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని నెల రోజులపాటు జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకలు మంగళవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా పలు చోట్ల ముందస్తు క్రిస్మస్ వేడుకలను వైభవంగా నిర్వహించారు.

టీడీపీ ఆధ్వర్యంలో..

టీడీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను మంగళవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ముఖ్యఅతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీస్తు మార్గం ఆచరణీయమని, పేద ప్రజలకు ప్రేమను అందించారన్నారు. క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు నావూరి కుమార్, డాక్టర్ రాజ్‌విమల్, చుండి శ్యామ్, నాళం నరసమ్మ, పసుమర్తి హగ్గయ్య రాజ్, కార్పొరేటర్ సంద్రపాటి వర్ష్‌వర్త్, ఉపాధ్యక్షుడు కామేపల్లి శ్రీనివాసరావు, నగర అధ్యక్షుడు కొఠారి నాగేశ్వరరావు, కొమ్మూరి రవిచంద్ర పాల్గొన్నారు.

● ఒంగోలులోని క్విస్ ఫార్మసీ కాలేజీలోని ఫార్మ్-డీ నాల్గవ సంవత్సరం విద్యార్థులు ఏర్పాటు చేసిన వేడుకలను ప్రిన్సిపాల్ ఎం.కిషోర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేక్ కటింగ్‌లతో, క్రీస్తు పాటలతో విద్యార్థులు సందడి చేశారు.

● సంజయ్‌గాంధీకాలనీ యూత్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్‌ను పురస్కరించుకుని పాస్టర్ సురేష్ వాక్యోపదేశం చేసి కేక్ కట్ చేశారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు, సంఘస్తులకు ప్రేమ విందును అందించారు. కార్యక్రమంలో అత్యాల అనీల్, ఆనంద్, రవి, నిరంజన్, చింటు, కమల్, లక్కీ, హేమంత్, సంగీతరావు, సీయోను పాల్గొన్నారు.

● జక్రయ్యనగర్‌లోని ఇమ్మానుయేలు బాప్టిస్ట్ చర్చి సమీపంలో సెమీ క్రిస్మస్ సందర్భంగా పాస్టర్ ఆషేర్‌పాల్ వాక్యోపదేశం చేయగా, వైఎస్.దిగ్విజయ్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, జనసేన నాయకులు కంది రవిశంకర్, డాక్టర్ జాకబ్ సంతోష్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అనంతరం కేక్ కట్ చేసి చిన్నారులకు పంచారు. కార్యక్రమంలో నాయకులు ఇత్తడి ఖన్నా, పాలూరి వెంకటేశ్వరరెడ్డి, తూము సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో..

ఒంగోలు విద్య: స్థానిక మాంటిస్సోరి స్కూలులో సెమీక్రిస్మస్ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన ఏసు జననం నాటిక ఆకటుకుంది. గుర్రాల రాజ్‌కుమార్ వ్యాక్య సందేశం ఇచ్చారు. కరస్పాండెంట్ ప్రకాష్‌బాబు, ప్రిన్సిపాల్ నూరుద్దీన్ పాల్గొన్నారు.

● క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలోని రామానుజన్ సెమినార్ హాలులో సెమీ క్రిస్మస్‌ను పురస్కరించుకుని విద్యార్థులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహించారు. శాంటాక్లాజ్, ఏంజెల్ వేషధారణలతో అలరించారు. ఈసీఈ హెచ్‌వోడీ బుజ్జిబాబు దేవుని సందేశాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వైవీ.హనుమంతరావు, సిబ్బంది పాల్గొన్నారు. క్విస్ విద్యా సంస్థల అధినేత సూర్యకళ్యాణ్ చక్రవర్తి, వైస్‌చైర్మన్ గాయత్రి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

● ఒంగోలు కలెక్టరేట్: స్థానిక లాయర్‌పేటలోని నారాయణ సీవోఅండ్ ఒలంపియాడ్ స్కూలులో మంగళవారం సెమీక్రిస్మస్‌ను ఘనంగా నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సయ్యద్‌నాగూర్‌వలి, ఏజీఎం పెద్దిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: స్థానిక ఎంఈవో కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో ఆంజనేయులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మెడబలిమి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో..

సంతనూతలపాడు: స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో మంగళవారం సెమీక్రిస్మస్‌ను పురస్కరించకుని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సబ్‌రిజిస్ట్రార్ సీహెచ్.శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ రామక్రిష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

చీమకుర్తిలో విద్యుత్‌ప్రభపై..

చీమకుర్తి: క్రిస్మస్ సంబరాలు చీమకుర్తిలో ఉత్సాహభరితమైన వాతావరణంలో జరుగుతున్నాయి. టీడీపీ నాయకుడు యడ్లపల్లి రామబ్రహ్మం నేతృత్వంలో స్థానిక క్రిష్టియన్‌పాలెంలో విద్యుత్‌ప్రభను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా విద్యుత్ ప్రభపై ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై కేక్‌ను కట్‌చేశారు. అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు శేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నాయకులు గొల్లపూడి సుబ్బారావు, కాట్రగడ్డ రమణయ్య, కందిమళ్ల గంగాధరరావు, కర్నా ప్రసాద్, నర్రా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


నారాయణ ఒలంపియాడ్ స్కూలులో..


మద్దిపాడులో కేక్ కట్ చేస్తున్న ఎంఈవో ఆంజనేయులు

నేడు టంగుటూరులో పోతుల చెంచయ్య వర్ధంతి


పోతుల చెంచయ్య(ఫైల్)

టంగుటూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పోతుల చెంచయ్య 28వ వర్ధంతిని బుధవారం స్వగృహం వద్ద నిర్వహిస్తున్నట్లు ఆయన కుమారుడు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు పోతుల నరసింహారావు తెలిపారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. టంగుటూరులో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ఆయన వెల్లడించారు. టంగుటూరు పురసెంటర్, బస్టాండ్ సెంటర్లలోని చెంచయ్య విగ్రహాలకు నివాళి కార్యక్రమం ఉంటుందన్నారు. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ హాజరవుతారన్నారు. కొండపి, కందుకూరు నియోజకవర్గాలలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పోతుల కుటుంబ అభిమానులు హాజరుకావాలని నరసింహారావు కోరారు. ఈ సమావేశంలో పోతుల రాజేంద్రప్రసాద్, టీడీపీ నాయకులు చిడిపోతు కోటేశ్వరరావు, కామినేని కోటేశ్వరరావు, చదలవాడ వేణు, చిడిపోతు లక్ష్మయ్య, కసుకుర్తి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌జెన్ విద్యార్థినికి తైక్వాండోలో గోల్డ్‌మెడల్

- అభినందించిన మంత్రి స్వామి


లీలామైత్రిని అభినందిస్తున్న మంత్రి స్వామి

సింగరాయకొండ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలో నిర్వహించిన నేషనల్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో సింగరాయకొండలోని స్మార్ట్‌జెన్ జూనియర్ కళాశాల విద్యార్థిని లింగారెడ్డి లీలామైత్రి గోల్డ్ మెడల్ సాధించింది. మంగళవారం కళాశాల చైర్మన్ పి.శ్రీనివాసరావు ఆ విద్యార్థినిని తీసుకొని టంగుటూరు మండలం తూర్పునాయు డుపాలెంలోని స్వగృహంలో ఉన్న మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామిని కలిశారు. ఈ సందర్భంగా లీలామైత్రిని మంత్రి అభినందించారు. అనంతరం కళాశాలలో విద్యార్థినిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.గీతారాణి, ప్రిన్సిపాల్ డి.నాగేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వీల్‌చైర్‌ల పంపిణీ


వీల్‌చైర్లను అందజేస్తున్న బీవీరావు దంపతులు, అతిథులు

టంగుటూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జరుగుమల్లి మండలం నందనవనం, సింగరాయకొండ మండలం శానంపూడి గ్రామాలకు చెందిన ఆరుగురు దివ్యాంగులకు స్ఫూర్తి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం వీల్‌చైర్‌లను పంపిణీ చేశారు. స్థానిక అంబేడ్కర్‌నగర్‌లో ఈ కార్యక్రమం జరిగింది. సంస్థ గౌరవ సలహాదారు, ఇన్‌కంట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ బి.వెంకటేశ్వరరావు, ఆయన సతీమణి గ్లోరి, ఏకా ప్రభాకర్, తొట్టెంపూడి పెద ఆదినారాయణ, 14వ వార్డు సభ్యుడు నత్తల హరిబాబు, టీడీపీ నాయకులు జక్కుల శ్రీను, ఈశ్వరరావు, బొడ్డు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

సింగరాయకొండ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్‌ను పురస్కరించుకొని మదర్ ల్యాండ్ సొసైటీ ఆధ్వర్యంలో హెచ్ఐవీ బాధితులకు మంగళవారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. తొలుత సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. దిశ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ కిరణ్ పాల్గొని టీడీపీ నేతలతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం దేవీ సీఫుడ్స్ సౌజన్యంతో సమకూర్చిన నిత్యావసర సరుకుల కిట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు టి.రంగారావు, టీడీపీ నేతలు సన్నెబోయిన శ్రీనివాసులు, కూనపరెడ్డి సుబ్బారావు, మున్నా, ఏఎన్ఎంలు సుజాత, నాగమణి, సుభాషిణి, వెంకట్రావు, సునీత, లావణ్య పాల్గొన్నారు.

సర్క్యులేషన్ ప్లాన్‌లపై అభ్యంతరాల స్వీకరణ

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో రోడ్ల వెడల్పు తక్కువగా ఉండి, జన సాంద్రత, నిర్మాణ సాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో భవన నిర్మాణ అనుమతులు సులభతరంగా పొందేందుకు అవసరమైన సూచనలు, అభ్యంతరాలు, స్వీకరిస్తున్నట్లు కమిషనర్ కె.వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఇందుకు సంబంధించి సర్క్యులేషన్ ప్లాన్, వాటికి సంబంధించిన వివరాలను కార్పొరేషన్ కార్యాలయంలో నోటీస్ బోర్డులో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారుల ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని, ఈనెల 30 వ తేదీలోపు కార్యాలయంలో సూచనలు తెలియజేవచ్చని ఆయన సూచించారు.

అప్సాతో రాష్ట్ర స్థాయిలో అనుబంధానికి ఏపీటీసీఏ తీర్మానం

ఒంగోలు విద్య, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్(అప్సా)కు అనుబంధంగా జిల్లా ప్రైవేటు విద్యాసంస్థల సంఘమైన ఏపీటీసీఏ ఉండనుందని ఆ సంఘ నాయకుడు మాంటిస్సోరి ప్రకాష్ తెలిపారు. అప్సా రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సుందరరావుతో ఏపీటీసీఏ ప్రతినిధుల బృందం మంగళవారం స్థానిక మాంటిస్సోరి స్కూలులో జరిగిన సమావేశంలో ఈమేరకు తీర్మానం చేశారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన కొద్దికాలంలోనే 30కిపైగా విద్యా సంస్కరణలకు అప్సా దోహదం చేసిందని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, విద్యాశాఖ ఉన్నతాధికారుల సహకారంతో సమస్యలను పరిష్కరిస్తున్నారని అప్సా గౌరవాధ్యక్షుడు సుందరరావు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జాలిరెడ్డి, చందమామ లక్ష్మీరామిరెడ్డి, శ్రీరాములురెడ్డి, అజయ్, సీబీ.మైఖేల్, కొల్ల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధుల క్రిస్మస్ శుభాకాంక్షలు

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరీ జీవితాల్లో వెలుగులు నిండాలని, ఏసుక్రీస్తు కృప అందరికీ తోడుగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

● టంగుటూరు: కొండపి నియోజకవర్గంలోని క్రైస్తవులకు రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్‌ను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

● ఒంగోలు కలెక్టరేట్: వైసీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి జిల్లా ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు.

● మాజీమంత్రి శిద్దా రాఘవరావు జిల్లా ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఏసుక్రీస్తు చూపిన మార్గం ఆచరణీయమన్నారు.

● ఒంగోలు(క్రైం): జిల్లా ప్రజలకు, పోలీసు సిబ్బందికి ఎస్పీ ఏఆర్.దామోదర్ క్రిస్మస్ శుభాకాంక్షలను తెలిపారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో సంతోషంగా పండుగను జరుపుకోవాలన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన


వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా న్యాయాధికారి భారతి

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చైతన్య కార్డియాక్ సెంటర్, స్మార్ట్ విజన్‌కంటి హస్పటల్ సహకారంతో మంగళవారం ఒంగోలులోని బార్ అసోసియేషన్ భవన్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఫ్యామిలీ న్యాయాధికారి అమ్మన్‌రాజా, మూడవ జిల్లా న్యాయాధికారి రాములు, అడిషనల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి హేమలత, జూనియర్ సివిల్ న్యాయాధికారి ఇబ్రహీం షరీఫ్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగిశెట్టి మోహనదాసు, ప్రధాన కార్యదర్శి ఏల్చూరి సురేంద్రబాబు, జాయింట్ సెక్రటరీ ఎస్.రామిరెడ్డి, గోపాలరావు, సాంబశివరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన చంద్రబాబు

- వైసీపీ ఒంగోలు ఇన్‌చార్జి రవిబాబు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబునాయుడు వాటిని విస్మరించి ప్రజానీకంపై విద్యుత్ భారాలు మోపారని వైసీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు ఆరోపించారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ చార్జీల భారాన్ని నిరసిస్తూ ఈనెల 27వతేదీన ఒంగోలులో నిరసన, ర్యాలీలు చేపడుతున్నట్లు తెలిపారు. పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో బత్తుల బ్రహ్మానందరెడ్డి, బొట్లా సుబ్బారావు, డీఎస్.క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెయ్యలతిప్ప అక్రమార్కులపై చర్యలు

మద్దిపాడు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ రిజర్వాయర్ సమీపంలో పెయ్యలతిప్పను బెంగళూరు హైవే పేరుతో మట్టి తీసుకునేందుకు అధికారుల నుంచి అనుమతులు తీసుకుని మట్టిని, గ్రావెల్‌ను నిబంధనలకు విరుద్ధంగా తవ్వినట్లు అధికారులు గుర్తించారు. ఈమేరకు మంగళవారం జీఆర్పీ కార్య నిర్వహణ ఇంజనీరింగ్ అధికారి ఎం.రవి మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీన ఇంజనీరింగ్ అధికారులు బృందం పెయ్యిలతిప్పను పరిశీలించిందని చెప్పారు. అక్కడ యంత్రాలు, సామగ్రిని తీసుకువెళ్లినట్లు చెప్పారు. అనుమతులు లేకుండా గుండ్లకమ్మ పరివాహక ప్రాంతంలో మట్టి తవ్వకాలు చేపట్టారని, ఈమేరకు చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

శిశుగృహలో సౌకర్యాలను మెరుగు పరచాలి

ఒంగోలు నగరం డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాంనగర్‌లోని శిశు గృహ, బాలసదన్‌ను మంగళవారం రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె శిశు గృహ, బాలసదన్‌లో ఉన్న సౌకర్యల పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. శిశువులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సౌకర్యాలను మెరుగుపరచాలని ఆదేశించారు. బాలసదన్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు జరిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, సీడీపీవోలు పాల్గొన్నారు.

చిలకపాడు విద్యార్థినుల ప్రతిభ

సంతనూతలపాడు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జాతీయ వినియోగదారుల దినోత్సవం సంబంధించి జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో చిలకపాడు హైస్కూల్ విద్యార్థినులు మేఘన, సాహిత్యలు ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా జేసీ గోపాలక్రిష్ణ, డీఈవో కిరణ్‌కుమార్ చేతులమీదుగా మంగళవారం ఒంగోలులో ప్రకాశం భవన్‌లో బహుమతులు అందుకున్నారు. విద్యార్థినులను హెచ్ఎం స్వప్నరాజు అభినందించారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో నిరసన

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్.అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు తాటిపర్తి వెంకటస్వామి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీ చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లికల్, ధరణికోట లక్ష్మీనారాయణ, పేరం సత్యం, చావలి సుధాకర్, షేక్ అజీజ్, బి.సుబ్బారావు, కైలా వెంకట్రావు, జాలాది మోహనరావు, పెద్దన్న, మోటా భాస్కర్, జజ్జర ఏడుకొండలు, పిన్నిక శ్రీనివాసరావు, ఆర్.రాజశేఖర్, ఎర్రయ్య, సంపత్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

స్కూల్ బస్సు, మోపెడ్ వాహనం ఢీకొనడంతో ఘటన



వెంకటేశ్వర్లు(ఫైల్)

పెద్దదోర్నాల, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు స్కూల్ బస్సు, టీవీఎస్ మోపెడ్ వాహనం ఢీకొని రైతు మృతి చెందిన ఘటన మంగళవారం మండలంలోని పెద్దబొమ్మలాపురం బీఎంసీ కాలనీ వద్ద చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో గుమ్మా వెంకటేశ్వర్లు(55) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం... దోర్నాలలోని ఓ ప్రైవేటు స్కూలు బస్సు పెద్దబొమ్మలాపురంలోని విద్యార్థులను పాఠశాలకు తీసుకెళ్తున్న క్రమంలో బీఎంసీ కాలనీ వద్దకు రాగానే అదే సమయంలో గుమ్మా వెంకటేశ్వర్లు సమీప పొలంలో జొన్న చొప్ప కోసుకుని మోపెడ్ వాహనంపై తరలిస్తూ రోడ్డు పైకి వచ్చాడు. వేగం అదుపు తప్పి బస్సు, మోపెడ్ ఢీకొన్నాయి. దీంతో వెంకటేశ్వర్లు తారురోడ్డుపై పడడంతో తలకు తీవ్రగాయాలై సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఈ ప్రమాదంతో విద్యార్థులు భయాందోళనలకు గురయ్యారు. వెంటనే డ్రైవర్ బస్సును నిలిపివేశాడు. సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ముటుకుల వీఆర్వో గుండెపోటుతో మృతి

పుల్లలచెరువు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ముటుకుల వీఆర్వోగా పనిచేస్తున్న ఉప్పుతోళ్ల కోటేశ్వరరావు సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. మంగళవారం శతకోడులోని స్వగృహంలో ఆయన మృతదేహానికి మండల టీడీపీ నాయకులు నివాళులు అర్పించారు. ఇన్‌చార్జి తహసీల్దారు కిషోర్, టీడీపీ మండల నాయకులు పయ్యావుల ప్రసాద్, కాకర్ల కోటయ్య, మేడికొండ లక్ష్మీనారాయణ, కె. కుమార్, ఈదెమ్మ నాయుడులు నివాళులు అర్పించారు.

ముత్తరాసుపల్లి ఘర్షణలో 33 మందిపై కేసు

కొమరోలు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తరాసుపల్లిలో ఆదివారం సాయంత్రం ఇరువర్గాల ఘర్షణకు సంబంధించి 33మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వరనాయక్ చెప్పారు. ఈ ఘర్షణలో టీడీపీ, వైసీపీ వర్గీయులు రాళ్లు రువ్వుకుని గాయపడ్డారు. టీడీపీ వర్గానికి సంబంధించి వెంకటేశ్వర్లు, వారి భార్య మహేశ్వరీలకు గాయాలయ్యాయి. వైసీపీ వర్గానికి సంబంధించిన గుమ్మళ్ల గోపి, చిన్న శేఖర్, అతని భార్య లక్ష్మి, మహాలక్ష్మిలకు గాయాలయ్యాయి. గోపి ఫిర్యాదు మేరకు టీడీపీకి చెందిన వెంకటేశ్వర్లుతో పాటు మరో 13మందిపై కేసు నమోదుచేశారు. అదేవిధంగా వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు వైసీపీ నాయకులు గోపితోపాటు మరో 18మందిపై కేసులు నమోదు చేశారు.

ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనం హర్షణీయం

కంభం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మసీదులలో పని చేస్తున్న ఇమామ్‌లకు, మౌజన్‌లకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గౌరవ వేతనం మంజూరుకు ప్రత్యేక జీవో విడుదల చేయడం హర్షణీయమని తెలుగుదేశం ఎన్‌ఆర్‌ఐ ప్రచార సభ్యులు సయ్యద్ రఫీ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ఆదాయం లేని చిన్న మసీదుల్లోని ఇమామ్, మౌజన్‌ల పరిస్థితి బాగా లేదని, వారికి గౌరవ వేతనం ఇస్తే బాగుంటుందని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఇచ్చిన నివేదిక ఆధారంగా ముఖ్యమంత్రి.. ఇమామ్‌లకు 10వేలు, మౌజన్‌లకు 5వేలు గౌరవ వేతనం ఇచ్చేందుకు జీవో విడుదల చేశారని తెలిపారు. ముఖ్యమంత్రికి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఫరూఖ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ముండ్లమూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద ఉల్లగల్లు వద్ద అద్దంకి - దర్శి ప్రధాన రహదారిపై మంగళవారం ఉదయం ఒక వ్యక్తి మద్యం మత్తులో లారీ నుంచి దూకి కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. కొరిశపాడు మండలం తమ్మవరం గ్రామానికి సీహెచ్ అంజనేయులు తన స్నేహితుడితో కలసి లారీలో త్రిపురాంతకం వెళ్తూ పెదఉల్లగల్లు సమీపంలో లారీ నుంచి కిందకు పడటంతో గాయలయ్యాయి. తీవ్రంగా గాయపడిన అంజనేయులు మద్యం మత్తులో ఉన్నాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఫత్తేపురంలో పత్తాలేని పారిశుధ్యం





అసలే వర్షాకాలం.. ఆపై దోమలు విజృంభించే సమయం.. ఈ క్రమంలో గ్రామాల్లో పారిశుధ్య పనులు అంతంతమాత్రంగా ఉండడంతో ప్రజలు వ్యాధుల దాడితో అల్లాడిపోతున్నారు. తర్లుపాడు మండలంలోని నాగెళ్లముడుపు పంచాయతీలోని ఫత్తేపురంలో పారిశుధ్యం పడకేసింది. రోడ్లన్నీ మురుగుకూపాలుగా మారాయి. గ్రామానికి మంచినీటి సరఫరా చేసే పైప్‌లైన్‌కు కూడా ఎక్కడపడితే అక్కడ లీక్‌లు ఉండటంతో పారిశుధ్య సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం పక్కన మురుగునిల్వతో చిన్నారులు కూడా అవస్థపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. - తర్లుపాడు

'వెలిగొండ పూర్తి.. ప్రజలను మభ్యపెట్టిన జగన్'

టీడీపీ ప్రభుత్వమైనా ప్రాజెక్టును పూర్తి చేయాలి

కరపత్రాలను ఆవిష్కరించిన సీపీఎం నేతలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 24 ఆంధ్రజ్యోతి : ప్రాజెక్టు పూర్తికాక ముందే ప్రారంభోత్సవం అంటూ ఎన్నికల లబ్ధి కోసం గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగన్ ప్రజలను మభ్యపెట్టేందుకు కపట నాటకం ఆడారని సీపీఎం నేతలు డీకేఎం రఫీ, సోమయ్య విమర్శించారు. ప్రస్తుత టీడీపీ ప్రభుత్వమైనా వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయాలని కోరారు. ఈ విషయమై ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు లేఖ రాసిన విషయాన్ని గుర్తు చేశారు. అందుకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం స్థానిక కంభం రోడ్డులోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు సోమయ్య, రఫీలు లేఖలోని విషయాలను తెలియజేస్తూ కూటమి ప్రభుత్వంలోని ముగ్గురు మంత్రులు ప్రాజెక్టును సందర్శించి రెండేళ్లలో ప్రాజెక్టును పూర్తి చేస్తామని చేసిన ప్రకటన ప్రజలను మరోసారి మభ్యపెట్టేందుకా అని అనిపిస్తోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం జంట సొరంగాలు జాతికి అంకితం అనే శిలాఫలకం చూసి ఆశ్చర్యపోయానని రాఘవులు లేఖ ద్వారా తెలియజేశారని చెప్పారు. ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేసి వచ్చే వరద సమయానికైనా రిజర్వాయర్‌లో నీరు నింపేందుకు ప్రణాళిక రూపొందించాలని కోరారు. పనుల పర్యవేక్షణకు ప్రత్యేక నిపుణుల బృందాన్ని నియమించాలన్నారు. నిర్వాసితులకు చెల్లింపులు వెంటనే పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బాల నాగయ్య, రాజు, నన్నేసా, నిర్వాసితుల సంఘం నాయకులు పుల్లారెడ్డి, వెంకట సుబ్బయ్య, రామకృష్ణారెడ్డి, లక్ష్మీరెడ్డి, బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా ఈశ్వరమ్మ ఆరాధన



వీరబ్రహ్మేంద్ర స్వామికి నివాళి అర్పిస్తున్న సభ్యులు

గిద్దలూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీవిరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మనుమరాలైన ఈశ్వరి మహదేవి(ఈశ్వరమ్మ) 235వ ఆరాధన మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహం వద్ద ఈశ్వరిమాతకు విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు రంగాచారి, వీరబ్రహ్మం, చంద్రశేఖరాచారి, శేఖర్, యోగా గురూజీ నారాయణరెడ్డి పాల్గొన్నారు. కొంగళవీడు రోడ్డులో వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో ఈశ్వరమ్మ ఆరాధన మహోత్సవాలు వైభవంగా జరిగాయి. అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు.



తర్లుపాడు : ఈశ్వరి మహదేవి

ఘనంగా ఈశ్వరి మహాదేవి ఆరాదన

తర్లుపాడు, అక్టోబరు 24 ఆంధ్రజ్యోతి: తర్లుపాడులో వెలసియున్న శ్రీవిరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో వెలసియున్న ఈశ్వరి మహాదేవి ఆరాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు, గణపతి పూజ, పుణ్యాహవచనం, కుంకుమార్చనలు, లలిత సహస్ర పారాయణం, హోమం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని తర్లుపాడు పురవీధుల్లో అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అమ్మవారికి వార్లుపోసి కాయకర్పూరాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆరాధన మహోత్సవం సందర్భంగా భారీస్థాయిలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు కొప్పుల కాశిరెడ్డి, కొప్పుల గోపాల్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

తహసీల్దార్ చిరంజీవి

మార్కాపురం రూరల్, డిసెంబర్ 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు తమ భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ చిరంజీవి చెప్పారు. మండలంలోని వేమలకోట గ్రామంలో మంగళవారం నిర్వహించిన సదస్సుల్లో సర్వేయర్ సంజీవయ్య, టీడీపీ నాయకులు చాగంటి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఆక్రమణదారుల నుంచి ప్రభుత్వ భూమి స్వాధీనం

రెవెన్యూ సదస్సులో వచ్చిన ఫిర్యాదు మేరకు తహసీల్దార్ చిరంజీవి క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆక్రమణకు గురైన కొత్రపోలు కోటిరెడ్డి ఆధీనంలో ఉన్న సర్వే నెంబర్ 460-1బిలో 1 ఎకరా ప్రభుత్వ భూమిని, పెద్దనాగులవరం గ్రామానికి చెందిన తురకా బాలఅంకయ్య ఆధీనంలో ఉన్న 2- ఏలో 3.10 సెంట్ల ప్రభుత్వ భూములను ఎక్స్‌కవేటర్‌తో బాగు చేయించి స్వాధీనం చేసుకున్నారు. మరో రెండు ప్రాంతాలలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న దారి సమస్యలను పరిష్కరించాలని రైతుల కోరడంతో ఆ సమస్యను పరిష్కరించారు.



ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించి ఎక్స్‌కవేటర్‌తో క్లియర్ చేయిస్తున్న తహసీల్దార్

పేదలకు దుస్తులు పంపిణీ చేసిన టీడీపీ నాయకులు



గిరిజన చిన్నారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న సంస్థ సిబ్బంది

మార్కాపురం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, టీడీపీ రాష్ట్ర నాయకులు వక్కలగడ్డ మల్లికార్జున్‌ల ఆదేశాల మేరకు స్థానిక 5వ వార్డులో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. వార్డు పరిధిలో ఇంటింటికీ తిరిగి మహిళలకు చీరలను అందజేశారు. నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు బూదాల జాన్‌డేవిడ్, చల్లగాలి రాజేష్, వంగూరి జానీ, రోశయ్య, కర్ర విజయ్, సతీష్, రామారావు, మురికిపూడి రాజు, పిల్లి సుబ్బు పాల్గొన్నారు.

పాస్టర్లకు నిత్యావసర సరుకులు..

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 24 ఆంధ్రజ్యోతి : స్థానిక పూలసుబ్బయ్య కాలనీలోని హెర్మోన్ చర్చిలో క్రిస్మస్ పురస్కరించుకుని మంగళవారం పాస్టర్లకు నిత్యావసర సరుకులు అందజేశారు. జాయ్‌ఫుల్ టైడింగ్స్ మినిస్ట్రీ ఆధ్వర్యంలో డైరెక్టర్ మాకం ఓత్నియేల్ మోజెస్ 30 మంది పాస్టర్లకు నిత్యావసర సరుకులు, దుస్తులు అందించారు.

గిరిజన చిన్నారులకు దుస్తులు..

పెద్దదోర్నాల, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పనుకుమడుగు గ్రామంలో చెంచు గిరిజన చిన్నారులకు ఐఎంఎస్ సంస్థ ఆధ్వర్యంలో దుస్తులు, సబ్బులు, టూత్‌బ్రష్‌లను మంగళవారం అందజేశారు.

ఈ కార్యక్రమంలో సెల్విన్, రూతు, మెర్సీ, హహబూబ్ బాష, అనిత తదితరులు పాల్గొన్నారు.

మరియదాస్ కుటుంబానికి న్యాయం చేయాలని ధర్నా

కంభం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మరణించిన ఆర్‌సీఎం చర్చి ఫాదర్ ఎం.మరియదాస్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ కంభం ఎస్సీపాలెం మహిళలు మంగళవారం జాతీయ రహదారిపై ధర్నా చేశారు. సుమారు గంటపాటు రోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్ స్తంభించింది. కందులాపురం నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న మరియదాస్‌ను గుంటూరు వెళుతున్న కారు ఢీకొనడంతో మృతి చెందిన విషయం విదితమే. మృతుడు స్వగ్రామం దొనకొండ మండలం సిద్ధయ్యపాలెం. బుధవారం జరగబోయే క్రిస్మస్ వేడుకలకు చర్చిని అలంకరించాలని వెళుతుండగా ప్రమాదం బారినపడ్డారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం మంగళవారం ఉదయం ప్రత్యేక వాహనంలో మరియదాస్ స్వగ్రామానికి తరలిస్తూ కందులాపురం సెంటర్‌కు రాగా ఒక్కసారిగా అతని బంధువులు కుటుంబానికి నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ జాతీయ రహదారిపై బైటాయించారు.

ఎస్సై నరసింహారావు సంఘటన స్థలానికి వచ్చి ఆందోళన చేస్తున్న మహిళలతో మాట్లాడారు. ఆ కారు యజమానిని పిలిపించి జరిపిన చర్చలు ఫలించడంతో మహిళలు ఆందోళన విరమించారు.



చర్చిఫాదర్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న మహిళలు

అవీఇవీ

26న సీపీఐ బహిరంగ సభ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఈ నెల 26వ తేదీన శతాబ్ది ఉత్సవాల బహిరంగ సభ, ప్రదర్శను జయప్రదం చేయాలని నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి దేవండ్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో బహిరంగ సభల వాల్ పోస్టర్లను నాయకులతో కలసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కేవీ కృష్ణగౌడ్, ఎర్రగొండపాలెం, త్రిపురాంతకం మండల కార్యదర్శులు నక్కా తిరుపతయ్య, బాణాల రామయ్య పాల్గొన్నారు.

పోరుబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి



పోరుబాట పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రాంబాబు, వైసీపీ నాయకులు

మార్కాపురం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల బాదుడుపై వైసీపీ ఆధ్వర్యంలో ఈ నెల 27న విద్యుత్‌శాఖ కార్యాలయాల వద్ద నిర్వహించనున్న పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే రాంబాబు చెప్పారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం పోరుబాట వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రాంబాబు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యుత్ చార్జీలను తగ్గిస్తానని చెప్పి అధికారంలోకి వచ్చాక ఇష్టారీతిన పెంచడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర నాయకులు షంషీర్ అలీబేగ్ పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 24 ఆంధ్రజ్యోతి: కనిగిరిలోని వాసవి వృద్ధాశ్రమం తరఫున ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను పట్టణంలోని ఒక రెస్టారెంట్‌లో తహసీల్దార్ చిరంజీవి మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో చిన్నఓబులేసు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి శాసనాల వీరబ్రహ్మం, కౌన్సిలర్ నగేష్, వాసవి వృద్ధాశ్రమ అధ్యక్షుడు జి.కృష్ణ పాల్గొన్నారు.

నాటు సారాతో జీవితాలను నాశనం చేసుకోవద్దు



గిరిజనులకు అవగాహన కల్పిస్తున్నఎక్సైజ్ అధికారులు

పుల్లలచెరువు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతంలో గూడేల్లో నాటు సారా తయారు చేసి గిరిజనులు తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంటు సీఐ నరహరి చెప్పారు. నవోదయం 2లో భాగంగా నరజాముల తాండ, సుద్దకురువ తాండ, మెట్లబోడు తాండల్లో సారా వలన కలిగే అనర్థాలపై మంగళవారం గిరిజనులకు అవగహన కల్పించారు. ఎర్రగొండపాలెం ఎక్సైజ్ సీఐ సిహెచ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులకు చేయూత అందించాలి



అల్పాహారం అందిస్తున్న వీఆర్వో

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మానసిక దివ్యాంగులకు ప్రతి ఒక్కరూ చేయూత అందించాలని పుల్లలచెరువు మండలంలోని గంగవరం వీఆర్వో షేక్ బాషా చెప్పారు. మంగళవారం పట్టణంలోని సన్ జో మానసిక వికలాంగుల ఆశ్రమంలో సెమీక్రిస్మస్ వేడుకలను వీఆర్వో బాషా ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు. ఆశ్రమ సేవకుడు బ్రదర్ ఫ్రాన్సిస్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఆంధ్ర ఇవాంజిలికల్ లూథరన్ చర్చి తరఫున కరుణాకర్, ఆలేటి అనిల్ కుమార్, కోటి పాల్గొన్నారు.

దివ్యాంగుల హక్కుల పోరాట సమితి అధ్వర్యంలో ..

స్థానిక సన్ జోమానసిక దివ్యాంగుల ఆశ్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్మా రాజయ్య, నియోజకవర్గ అధ్యక్షుడు పోలేపల్లి పెద్దపాలంకయ్య, ప్రధాన కార్యాదర్శి కనమాల కోటేశ్వర్లు, షేక్ నాసర్‌వలి, ఎస్ వెంకటరెడ్డి, కోటి పాల్గొన్నారు.

పంటల సస్యరక్షణ చర్యలతోనే అధిక దిగుబడులు



రైతులతో మాట్లాడుతున్న ఏవో శ్రీనివాసరావు

మార్కాపురం రూరల్, డిసెంబర్ 24 (ఆంధ్రజ్యోతి) : పంటల సస్యరక్షణ చర్యలతోనే అధిక దిగుబడులు సాధ్యమని వ్యవసాయాధికారి శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని రామచంద్రాపురం, కొండేపల్లి గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు ఖైరున్, హైమావతి పాల్గొన్నారు

మిరపలో వెర్రి తెగులును నివారించుకోవాలి

పెద్ద దోర్నాల, డిసెంబరు 24 : మిరపలో వెర్రి తెగులును నివారించుకోవాలని ఏవో జవహర్‌లాల్‌నాయక్ చెప్పారు. మండలంలోని కటకానిపల్లె, రామచంద్రకోట గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ శ్వేత పాల్గొన్నారు.

ఏసు క్రీస్తు జీవితం అందరికీ ఆదర్శప్రాయం

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు చెప్పారు. బుధవారం క్రీస్తు జన్మదినం సందర్భంగా క్రైస్తవులందరికీ ఆయన క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

క్రిస్మస్ పర్వదినాన్ని సుఖసంతోషాలతో జరుపుకోవాలి

మార్కాపురం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రజలు క్రిస్మస్ పర్వదినాన్ని సుఖసంతోషాలతో జరుపుకోవాలని మంగళవారం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ప్రేమ, కరుణ ద్వారా మానవాళిలో ఆనందం నింపిన క్రీస్తు ఏసు అందరికీ ఆదర్శనీయుడని తెలిపారు.

రహదారిని కమ్మేసిన చిల్లచెట్లు తొలగింపు

దొనకొండ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాదాపురం ఎస్సీ కాలనీకి వెళ్లే రహదారికి ఇరువైపులా పెరిగిన చిల్లచెట్లను ప్రభు చారిటబుల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం తొలగించారు. కాలనీకి వెళ్లే రహదారికి ఇరువైపులా దట్టంగా చిల్లచెట్లు పెరిగిపోవడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. చిల్లచెట్లు తొలగించాలంటూ ట్రస్ట్ చైర్మన్ ఆదిమూలపు ప్రభుదాస్‌కు కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఆయన ఎక్స్‌కవేటర్‌తో చిల్లచెట్లు తొలగించి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు.

జలవనరుల శాఖ మంత్రిని కలిసిన వైస్ ఎంపీపీ

ముండ్లమూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును వైస్ ఎంపీపీ, ఉమా మహేశ్వర అగ్రహారం బీసీ సంఘం నాయకుడు వేముల జానకి రామయ్య మంగళవారం తాడేపల్లిలో కలిశారు. బీసీలకు తెలుగుదేశం పార్టీ మాత్రమే న్యాయం చేస్తుందని మంత్రి రామానాయుడు అన్నారు. మంత్రిని సన్మానించిన వారిలో రామాంజనేయులు, చుంచు వీర నారాయణ, కట్టా చిన వెంకం బొట్లు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు


గాయపడిన ఆంజనేయులు

ముండ్లమూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద ఉల్లగల్లు వద్ద అద్దంకి - దర్శి ప్రధాన రహదారి పై మంగళవారం ఉదయం ఒక వ్యక్తి మద్యం మత్తులో లారీ నుంచి దూకి కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. కొరిశపాడు మండలం తమ్మవరం గ్రామానికి సీహెచ్ అంజనేయులు తన స్నేహితుడితో కలసి లారీలో త్రిపురాంతకం వెళ్తూ పెదఉల్లగల్లు సమీపంలో లారీ నుంచి కిందకు పడటంతో గాయలయ్యాయి. తీవ్రంగా గాయపడిన ఆంజనేయులు మద్యం మత్తులో ఉన్నాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

హౌసింగ్ ఏఈగా వెంకటేశ్వరరెడ్డి

ముండ్లమూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల గృహ నిర్మాణ శాఖ ఏఈగా తూము వెంకటేశ్వరరెడ్డి నియమితులయ్యారు. తాళ్లూరు మండలం విఠలాపురం గ్రామ సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఏఈగా నియమితులయ్యారు. ఇప్పటి వరకు పనిచేసిన హనుమంతరావు తాళ్ళూరి మండలానికి బదిలీ అయ్యారు.

30లోగా బీమా చేయించుకోవాలి

పీసీపల్లి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఫసల్ బీమా నమోదును ఈనెల 30లోగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె.ప్రకాశరావు అన్నారు. మంగళవారం పీసీపల్లి రైతుసేవాకేంద్రం పరిధిలోని గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా కంది, మిరప పైర్లను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో నిరసన

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆ ర్.అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేశా రంటూ బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు తాటిపర్తి వెంకటస్వామి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ముందుగా పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీ చేశారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లికల్, ధరణికోట లక్ష్మీనారాయణ, పేరం సత్యం, చావలి సుధాకర్, షేక్ అజీజ్, బి.సుబ్బారావు, కైలా వెంకట్రావు, జాలాది మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

శిశుగృహలో సౌకర్యాలను మెరుగుపరచాలి

ఒంగోలు నగరం డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాంనగర్‌లోని శిశు గృహ, బాలసదన్‌ను మంగళవారం రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి సందర్శించారు. ఈ సందర్భంగా శిశు గృహ, బాలసదన్‌లో ఉన్న సౌకర్యల పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. శిశువులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సౌకర్యాలను మెరుగుపరచాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, సీడీపీవోలు పాల్గొన్నారు.

పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం

- దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- అధ్వానంగా తక్కెళ్లపాడు, కలగట్ల గ్రామాలు
- పట్టించుకోని అధికారులు


తక్కెళ్ళపాడు గ్రామంలోని రామాలయం పక్కన పేడదిబ్బలు

కనిగిరి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. పేడ దిబ్బలు, చెత్తకుప్పలతో వస్తున్న దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు దోమలతో కంటిమీద కునుకు లేకుండా పోతుంది. పలుగ్రామాల్లో దేవాలయాల స్థలాలు గేదెలకు ఆవాసంగా మారాయి. పశువుల కొష్టాలుగా మార్చుకున్నారు. అక్కడే పేడదిబ్బలు వేస్తుండటంతో ప్రజలు అనారోగ్యాలబారిన పడుతున్నారు. పేడదిబ్బల తొలగించేదిలేదంటూ వైసీపీ నేతలు పంచాయితీలకు దిగుతున్నారు. అధికారులు పట్టనట్టుగా వ్యవహరిస్తుండటంతో విమర్శలు వస్తున్నాయి.

దుర్భరంగా తక్కెళ్ళపాడు, కలగట్ల గ్రామాలు

మండలంలోని తక్కెళ్ళపాడు, కలగట్ల గ్రామాల్లోకి అడుగుపెట్టామంటే ముక్కు మూసుకోవాల్సి వస్తుంది. దుర్వాసన ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. తక్కెళ్లపాడు గ్రామంలో దాదాపు 150గృహాలు ఉన్నాయి. వారంతా కలసి గతంలో రామాలయంకు స్థలాన్ని కేటాయించుకుని పూజా కైంకర్యాలు నిర్వహించేవారు. ఈ స్థలం అన్యాక్రాంతమై పేడ దిబ్బలకు ఆలవంగా మారింది. దాదాపు పది కుటుంబాలకు చెందిన వారు రామాలయం స్థలంలో గేదెలను కట్టివేసి దుర్భరంగా తయారుచేశారు. సైడు కాల్వలు లేకపోవటంతో రోడ్లు కూడా పేడ, చెత్తలతో అధ్వానంగా మారాయి. రామాలయం ప్రాంగణం అధ్వానంగా మారడంతో స్వామి వారికి పూజా కైంకర్యాలు కూడా జరగడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. గేదెలను కట్టివేసే కుటుంబాలను వారి సొంత స్థలాల్లో ఏర్పాటుచేసుకోమని చెప్తే గొడవలకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక వైసీపీ నేతల అండతో తమను రాజకీయంగా ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు. ప్రభుత్వం మారినా వైసీపీ నేతల అధికార దర్పం మారలేదు. కలగట్ల గ్రామంలోనూ రోడ్లన్నీ పేడ కుప్పలు, చెత్త చెదారాలతో మట్టి రోడ్లకంటే అధ్వానంగా తయారయ్యాయి. సైడు కాల్వలు లేక ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు వాపోయారు. పదేళ్ళుగా ఎన్నోమార్లు రాజకీయ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు.

చోద్యం చూస్తున్న అధికారులు

తక్కెళ్ళపాడు గ్రామంలోని రామాలయం స్థలంలో గేదెలను కట్టేసి పేడదిబ్బలు వేయటంతో దుర్వాసన వస్తుందని పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. పేడదిబ్బల నుంచి వచ్చే దోమలు ఇళ్ళలోని ఆహారపదార్థాలపై వాలుతుండటంతో రోగాలపాలవుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని వైసీపీ నేత హుకుంతో అధికారులు తమ సమస్యను పట్టించుకోవటం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.


కలగట్ల గ్రామంలో రోడ్డుపైకి చేరిన మురుగునీరు

అధికారులు కూడా పారిశుధ్య చర్యలు పట్టించుకోవటం లేదు. వర్షాకాలంలో దోమలు ప్రబలకుండా బ్లీచింగ్, ఫాగింగ్, దోమల నివారణ ఆయిల్‌ను వేసిన పాపాన పోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రెవెన్యూ సదస్సులతో భూసమస్యల పరిష్కారం


దర్శి: తూర్పుచవటపాలెంలో అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, పాల్గొన్న తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ తదితరులు

ముండ్లమూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలు పరిష్కారమవుతాయని ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్రీకాంత్ అన్నారు. మంగళవారం పులిపాడులో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. మండలంలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను గ్రామ సభల్లో పరిష్కరిస్తామన్నారు. రెవెన్యూ రికార్డుల్లో తప్పులు, భూముల సరిహద్దుల తేడాలు వంటివి పరిష్కరిస్తున్నట్టు చెప్పారు. ఇనామ్, వాగు పోరంబోకు, కుంట పోరంబోకు లాంటి భూములు మాత్రం జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ కోటంరాజు, ఆర్‌ఐ పీవీఎస్‌ఆర్ మూర్తి, వీఆర్‌వోలు జి.కోటయ్య, బ్రహ్మతేజ, నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు గణపం వెంకటేశ్వరరెడ్డి, ఏరేసు వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ముండ్లమూరు: పులిపాడులో అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్రీకాంత్

పామూరులో 12 అర్జీలు

పామూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతు ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బీవీ రమణారావు తెలిపారు. మంగళవారం మండలంలోని అయ్యవారిపలి, కోడిగుంపల గ్రామాల్లో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా అయ్యవారిపల్లి గ్రామంలో ఏడు, కోడిగుంపలలో ఐదు అర్జీలు వచ్చినట్టు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీటీ బ్రహ్మయ్య, ఆర్‌ఐ బి.మల్లికార్జునరావు, ఎండోమెంట్ ఈవో నరసింహబాబు, విలేజ్ సర్వేయర్ మానస, వీఆర్వో మహ్మద్ రఫి, టీడీపీ గ్రామ అధ్యక్షుడు మార్నేని మాల్యాద్రి, పునుగుబాటి మాల్యాద్రి, ఎం.రామకృష్ణ, కొల్లా కిష్టయ్య, కొప్పల్లి నాగేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులకు విశేష స్పందన

దర్శి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల ద్వారా ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు సత్వరమే పరిష్కారమవుతున్నాయని కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని తూర్పుచవటపాలెంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ దీర్ఘకాలిక భూ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తున్నదన్నారు. రికార్డుల క్రమబద్ధీకరణ, ఆన్‌లైన్ తదితర సమస్యలు అక్కడికక్కడే పరిష్కారమవుతున్నాయన్నారు. ఈఅవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్, ఆర్‌ఐ పరిటాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యలను పరిష్కరించుకోవాలి

కనిగిరి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ అశోక్‌రెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని పోలవరం, కలగట్ల గ్రామాల్లో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన మాట్లాడారు. భూముల సమస్యలను రెవెన్యూ రికార్డుల ఆధారంగా పరిశీలించి రైతులకు న్యాయం చేస్తామన్నారు. నిర్దేశిత వ్యవధిలోగా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వం పేదలకు కేటాయించిన భూమిని ఆక్రమిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లోని వాగు, వంక, పోరంబోకు, అసైన్డ్, పశువుల బీడు భూములు ఆక్రమించటం నేరమన్నారు. వాటిని ఆక్రమించిన వారిపై నోటీసులు జారీ చేసి కేసులు నమోదు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు నంబుల వెంకటేశ్వర్లు, సిద్ధాంతి బారాయిమాం తదితరులు పాల్గొన్నారు.

మిర్చిని ముంచిన తెగుళ్లు

- దిగుబడులపై ప్రభావం
- పెరుగుతున్న పెట్టుబడులు
- ఆందోళన చెందుతున్నరైతులు

ముండ్లమూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మిర్చి తోటలకు తెగుళ్ల వ్యాపించాయి. బొబ్బర, నల్లి, కొమ్మ కుళ్ళు తెగులు వ్యాప్తి చెందడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తోటలు నాటిన దగ్గర నుంచి ఇప్పటివరకు ఎటువంటి తెగుళ్ళు ఆశించలేదు. తోటలు ఏపుగా పెరిగి కాపు కూడా ఆశాజనకకంగా ఉంది. ఈ ఏడాది బాగా దిగుబడి వస్తుందని రైతులు భావిస్తున్నారు. అయితే, వీరి ఆశలు అడియాశలవుతున్నాయి. ఒక్కసారిగా మూడు నాలుగు రకాల తెగుళ్ళ వ్యాపించాయి. బొబ్బర తెగులు చెట్టంతా చుట్టుకుపోతుంది. కుళ్ళు తెగులుతో కొమ్మలు ఎండిపోతున్నాయి. ఎన్ని మందులు పిచికారీ చేసినా అదుపులోకి రాకపోవడంతోపాటు అదనంగా ఖర్చు తడిసిమోపెడవుతుంది.

ముండ్లమూరు మండలంలో ఈఏడాది ఖరీఫ్, రబీ కలుపుకొని 2950 ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. ఇప్పటికే ఎకరాకు లక్ష రూపాయలు మేర పెట్టుబడి పెట్టారు. పంట చేతికి వస్తుందనుకొనే సమయానికి తెగుళ్ల ముసురుకోవడంతో దిగుబడి గణనీయంగా తగ్గే అవకాశాలు ఏర్పడ్డాయి. మండలంలో అత్యధికంగా ఉమామహేశ్వర అగ్రహారం, తమ్మలూరు, పూరిమెట్ల, నాయుడుపాలెం, నూజెండ్లపల్లి, సుంకరవారిపాలెం, శంకరాపురం గ్రామాల్లో మిరప తోటలను అత్యధికంగా సాగు చేశారు. పసుపుగల్లు, ముండ్లమూరులలో కొంతమేర సాగు చేశారు. ఎక్కువ మంది రైతులు తేజ రకం సాగు చేశారు. సరాసరి క్వింటా ఎకరానికి 30 నుంచి 40 క్వింటాళ్ళ వరకు వస్తుందని రైతులు ఎంతో ఆశతో ఉన్నారు. ఒక్కసారిగా తెగుళ్ళ వ్యాపించడంతో దిగుబడులు గణనీయంగా తగ్గే అవకాశాలు ఉన్నాయని ఆందోళన చెందుతున్నారు.



తెగుళ్లతో కోలుకోలేని దెబ్బ

కాసా అంజిరెడ్డి, తమ్మలూరు

ఈ ఏడాది ఐదు ఎకరాల్లో మిర్చి సాగు చేశాను. రూ.5 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టాను. తోటలు ఏపుగా పెరడంతో దిగుబడి బాగా వస్తుందని ఆశ పడ్డాను. పది రోజుల్లోనే తారు మారైంది. బొబ్బర, కొమ్మ కుళ్ళు తెగులు, నల్లి తెగులు మిర్చి రైతులను నడ్డి విరిచాయి. పెట్టుబడి కూడా వస్తుందో రాదోననే భయంగా ఉంది.



అదుపులోకిరాని తెగుళ్లు

- సంకెల నారాయణరెడ్డి, అగ్రహారం

ఈ ఏడాది ఖరీఫ్‌లో మూడు ఎకరాల్లో మిర్చి సాగు చేశాను. ఇప్పటికే రూ.3 లక్షలకుపైగా పెట్టుబడి పెట్టాను. తోటలు ఆశాజనకంగా ఉండటంతో ఇబ్బంది లేదనుకున్నాను. వారం రోజుల నుంచి తెగుళ్ళ సోకి తోటల ఎదుగుదల ఆగిపోయింది. తెగుళ్లను అదుపు చేసేందుకు అదనంగా మందులు కొనుగోలుచేసి పిచికారి చేస్తున్నాం. ఏమాత్రం అదుపులోకి రావడంలేదు.


మిర్చికి సోకిన నల్లి తెగులు

రాష్ట్ర అగ్రికల్చర్ వైస్‌చైర్మన్ మర్రెడ్డిని సన్మానించిన టీడీపీ నాయకులు


మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు

ముండ్లమూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అగ్రికల్చర్ మిషన్ వైస్‌చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిని టీడీపీ మండల నాయకులు ఘనంగా సన్మానించారు. వైస్‌చైర్మన్‌గా నియమితులైన పూరిమెట్ల గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రమాణ స్వీకారం మంగళవారం తాడేపల్లిలో జరిగింది. ఈసందర్భంగా మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పెద్దఎత్తున వాహనాల్లో తరలివెళ్ళి ప్రమాణ స్వీకార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయనను భారీ గజమాలలతో, దుశ్శాలువాలతో సన్మానించి మెమొంటోలు అందజేశారు.

కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, మోదేపల్లి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ కోడెగ మస్తాన్ రావు, మాజీ జడ్పీటీసీ కొక్కెర నాగరాజు, వరగాని పౌలు, ఎంపీటీసీ సభ్యులు చింతపల్లి వెంకటేశ్వరరావు, పాలపర్తి సుబ్బారావు, ఎరబోలు చంద్రశేఖరరెడ్డి, వైస్ ఎంపీపీ వేముల జానకి రామయ్య, సర్పంచ్ కూరపాటి నారాయణ స్వామి, మాజీ సర్పంచ్‌లు ఇందూరి పిచ్చిరెడ్డి, సుంకర రాఘవరెడ్డి, డాక్టర్ పాశం వెంకటేశ్వరరావు, కొర్రపాటి శ్రీనివాసరావు, నీటి వినియోగ దారుల సంఘం అధ్యక్షులు ఉన్నం పరిపూర్ణయ్య, నిడిగంటి నారాయణ, చొప్పరపు నాగేశ్వరరావు, నర్సారెడ్డి, మండలపు తిరుపతి రావు, బిజ్జం వెంకట సుబ్బారెడ్డి, గూడాల సాంబశివారెడ్డి, కట్టా చిన వెంకం బొట్లుతో పాటు వివిధ గ్రామాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మర్రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన ఏలూరి

పామూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ అగ్రికల్చర్ మిషన్ వైస్‌చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన తెలుగురైతు రాష్ట్ర అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిని ఆసంఘం ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు ఏలూరి వెంకటేశ్వర్లు అభినందించారు. మంగళవారం తాడేపల్లిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

జలవనరుల శాఖ మంత్రిని కలసిన వైస్ ఎంపీపీ

ముండ్లమూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును వైస్ ఎంపీపీ, ఉమా మహేశ్వర అగ్రహారం బీసీ సంఘం నాయకుడు వేముల జానకి రామయ్య మంగళవారం తాడేపల్లిలో కలిశారు. బీసీలకు తెలుగుదేశం పార్టీ మాత్రమే న్యాయం చేస్తుందని మంత్రి రామానాయుడు అన్నారు. మంత్రిని సన్మానించిన వారిలో రామాంజనే యులు, చుంచు వీర నారాయణ, కట్టా చిన వెంకంబొట్లు తదితరులు ఉన్నారు.


చినఉల్లగల్లులోని తెలుగు బాపిస్ట్ చర్చి

క్రిస్మస్ పండుగకు ముస్తాబైన చర్చిలు

ముండ్లమూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని మండలంలోని పలుగ్రామాల్లో ఉన్న చర్చిలు ముస్తాబయ్యాయి. విద్యుత్ దీపాలంకరణలతో తీర్చిదిద్దారు. మండలంలోని చినఉల్లగల్లులో తెలుగు బాపిస్ట్ చర్చి, రమణారెడ్డిపాలెంలో వెలాంగిని మాత చర్చిలతో పాటు ముండ్లమూరు, శంకరాపురం, పోలవరం, పసుపుగల్లు, ఈదర, మారెళ్ళ, పులిపాడు, కెల్లంపల్లి గ్రామాల్లో చర్చిలు ముస్తాబయ్యాయి. క్రిస్మస్‌కు బయట ప్రాంతాల్లో ఉన్నవారు స్వగ్రామాలకు చేరుకోవటంతో పండుగ వాతావరణం సంతరించుకుంది.

పామూరు: పట్టణంలోని సీఎస్‌పురం రోడ్డులో గల తెలుగు బాప్టిస్టు ప్రార్థనా మందిరంలో క్రిస్మస్ వేడుకలకు ఏర్పాట్లుచేశారు. మందిరంలో క్రీస్తు జననాన్ని స్వాగతిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా మందిరాన్ని రంగురంగుల దీపాలతో విద్యుత్ అలంకరణ చేసి ఏసు పుట్టిన పశువుల పాక నమూనాను తయారుచేశారు. బుధవారం జరిగే క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధం చేసినట్లు చర్చి కమిటీ సభ్యులు తెలిపారు.

అలాగే, పట్టణంలోని సెయింట్‌మార్క్స్ హైస్కూల్, మండలంలోని బొట్ల గూడూరు అంగన్‌వాడీ సెంటర్ పరిధిలోని బొంపెద్దుపాడు, కంభాలదిన్నె అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా కొవ్వొత్తులను వెలిగించి క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కె.దివ్య, సీహెచ్ విజయ, ఇ.భాగ్యలక్ష్మి, ధియా, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి ఉన్నతస్థాయికి చేరుకోవాలి

తాళ్లూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సరస్వతీ విద్యాసంస్థల చైర్మన్ ఏవీ రమణారెడ్డి అన్నారు. స్థానిక శ్రీసరస్వతీ హైస్కూల్ వార్షికోత్సవ, క్రీడాసంబరాలు-24 కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని నింపేందుకు మూడురోజులుగా క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముందుగా చైర్మన్ రమణారెడ్డి, పద్మజ దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో హెచ్‌ఎం వి.శ్రీరామమూర్తి, ఉపాధ్యాయులు వెంకటరత్నం, వెంకారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందుల వాడకం తగ్గించాలి


రైతులకు ఆముదం విత్తనాలను ఉచితంగా అందజేస్తున్న అధికారులు

దొనకొండ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పురుగు మందులను పరిమితంగా వాడాలని దర్శి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి.రమేష్ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని రుద్రసముద్రంలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు ఒకేసారి పురుగు తగ్గాలనే ఉద్దేశంతో ఎక్కువ తీవ్రత కల్గిన మందులను వాడుతున్నారన్నారు. పురుగులు వాటిని తట్టుకునే స్థాయిని పెంచుకోవడంతో తర్వాత సీజన్‌లో గతంలో వాడినవాటి కంటే ఎక్కువ తీవ్రత ఉన్న మందులను వాడాల్సివస్తుందన్నారు. పురుగు దశలను బట్టి మందులను ఉపయోగించాలన్నారు. ఆముదం, కంది పంటలను పరిశీలించి సస్యరక్షణ చర్యలను వివరిం చారు. ఈ సందర్భంగా ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రం కింద ఆముదం ఐసీ హెచ్-05 విత్తనాలను రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త టి.వెంకటేశ్వరరెడ్డి, మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ, వ్యవసాయ సహాయకులు షేక్ నాసర్‌వలి, రైతులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడిని తల్లికి అప్పగించిన పోలీసులు

పామూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి వెళ్లిపోయిన విద్యార్థి క్షేమంగా తల్లి చెంతకు చేర్చడంలో హోంగార్డు కృషిని ఎస్పీ దామోదర్ అభినందించినట్లు సీఐ ఎం.భీమానాయక్ తెలిపారు. పామూరులో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి స్కూల్‌కు సక్రమంగా వెళ్లడం లేదని తల్లి మందలించింది. సోమవారం పామూరు నుంచి ఒంగోలుకు బస్సులో వచ్చి సాయంత్రం 4 గంటల సమయంలో రైల్వేస్టేషన్‌కు దిగాలుగా నడుచుకుంటూ వెళుతున్నాడు. ఈక్రమంలో మెజిస్ట్రేట్ బంగ్లా వద్ద విధులు నిర్వహిస్తున్న హోంగార్డు జి.మదన్‌కుమార్ విద్యార్థి గురించి ఆరాతీసి పామూరు పోలీసులకు సమాచారం అందించారు. అతడిని ఒంగోలు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. సీఐ భీమానాయక్ బాలుడిని పామూరు స్టేషన్‌కు తీసుకొచ్చారు. తల్లిని పిలిపించి కౌన్సెలింగ్ చేసి బాలుడిని అప్పగించినట్లు ఎస్‌ఐ కిశోర్‌బాబు తెలిపారు.

పంట కోత ప్రయోగాలతో బహుళ ప్రయోజనాలు

తాళ్లూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పంట కోత ప్రయోగాలతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని దర్శి వ్యవసాయశాఖ ఏడీఏ కె.బాలాజీనాయక్ అన్నారు. మండలంలోని లక్కవరం, తూర్పుగంగవరం, నాగంబొట్లపాలెం గ్రామాల్లో మంగళవారం జరిగిన పొలంపిలుస్తోంది కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా పంట కోత ప్రయోగాల ద్వారా వచ్చిన వివరాలను పరిశీలించారు. ఈ వివరాలను గణాంక శాఖకు పంపుతున్నట్లు తెలిపారు. వీటి ఆధారంగా ఎగుమతులు, దిగుమతులు, ధరల స్థిరీకరణ, నియంత్రణ వంటి అంశాలు ఆధారపడి ఉంటాయని తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు, ఆత్మ ఏటీఎం కె.రామిరెడ్డి, వీఏఏలు భార్గవి, వీరాంజనేయులు, సుమ, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈశ్వరీదేవి ఆరాధన


కుంకుమార్చన పూజల్లో పాల్గొన్న భక్తులు

పామూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విరాట్‌నగర్ కాలనీలోగల పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో వెలసియున్న శక్తి స్వరూపిణి ఈశ్వరి మహాదేవి 235వ ఆరాధన మహోత్సవ వేడుకలను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ఎర్ర చీరెలు ధరించిన పలువురు మహిళా భక్తులు మేళతాళాలతో సారె చీరను సమర్పించారు. అనంతరం సాముహిక కుంకుమార్చన పూజలు చేశారు. ఈసందర్భంగా ఈశ్వరి మాతకు విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు సొస్సం నాగేంద్రచారి, సుధీర్ దంపతులు రూ.40వేల విలువ గలిగిన వెండి కిరీటాన్ని దేవస్థాన నిర్వాహకులకు అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు వై.ప్రసాదరెడ్డి షేక్ ఖాజారహంతుల్లా, మన్నం రమణయ్య, దేవస్థాన గౌరవాధ్యక్షుడు వి.రామాచారి, అధ్యక్షుడు ఎం.దొరసానాచారి, ఎస్.ముఖేష్‌చారి, రవి, శ్రీశైలం, ఎస్.చంద్రశేఖర్, గోవిందయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఫిరంగిపురంలోని చర్చిలో ప్రార్థనలు చేస్తున్న బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య



విద్యుత్ దీపాలతో బాపట్ల పట్టణంలోని విద్యానగర్ ఆంధ్ర ఇవాంజెలికల్ లూథరన్ చర్చి



బాపట్ల పట్టణంలో విద్యుత్ దీపాలతో అలంకరించిన సీబీజడ్ చర్చి

..హ్యాపీ క్రిస్మస్

అర్ధరాత్రి పూజలతో వేడుకలు ప్రారంభం

బాలయేసు జననాన్ని స్వాగతిస్తూ ప్రార్థనలు

రంగురంగుల విద్యుత్ దీపాలతో కాంతులీనుతోన్న చర్చిలు

చర్చిల్లో కేకులు కట్ చేసి.. క్యాండిల్స్ వెలిగించి.. మిఠాయిల పంపిణీ

బాపట్ల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రంగురంగుల విద్యుత్ దీపాలతో చర్చిలు కాంతులీనుతుండగా.. నూతన వస్త్రాలు ధరించి చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా సందడి చేస్తుండగా.. క్రిస్మస్ వేడుకలు మంగళవారం అర్ధరాత్రి పూజలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్ధరాత్రి పట్టణ, గ్రామాల కూడళ్లలో క్రీస్తు జననాన్ని స్వాగతిస్తూ క్రైస్తవులు ఆనందోత్సాహాలతో బాణాసంచా కాల్చి ఉత్సవాలు జరుపుకున్నారు. హ్యాపీ క్రిస్మస్.. హ్యాపీ క్రిస్మస్ అంటూ ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బాలయేసు జననాన్ని స్వాగతిస్తూ భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో క్రిస్మస్ సందడి వాతావరణం నెలకొంది. అన్ని గ్రామాలు, పట్టణాల్లో చర్చిలను రంగురంగుల విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. అర్ధరాత్రి సరిగ్గా 12 గంటలకు బాణాసంచా కాల్చి.. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి క్రైస్తవులు ఉత్సవాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా చర్చిలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. అత్యంత భారీ నక్షత్రాలు వీధుల్లో విద్యుత్ కాంతులతో వెలుగులీనాయి. అదే సమయంలో గుంటూరు మేత్రాసన బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య ఫిరంగిపురంలోని ఆలయంలో అర్ధరాత్రి ప్రత్యేక పూజలతో క్రిస్మస్ వేడుకలను ప్రారంభించారు. అనంతరం భక్తులకు దైవ సందేశం ఇచ్చారు. లోక శాంతి, పాప పరిహారం, సర్వమానవాళి రక్షణ కోసమే క్రీస్తు మనిషి రూపంలో జన్మించారని తన సందేశంలో పేర్కొన్నారు. బాపట్లలోని క్రిస్టియన్‌పేట సాల్వేషన్ ఆర్మీ చర్చి, విద్యానగర్‌లోని ఆంధ్ర ఇవాంజికల్ లూథరన్ చర్చి, సీబీజడ్ చర్చి విద్యుత్ దీపాలతో అలంకరించారు. కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాల్లోని చర్చిలను క్రిస్మస్ వేడుకలకు సిద్ధం చేశారు. రేపల్లెలో బ్రిటీష్‌కాలంలో నిర్మితమైన లూథరన్ చర్చిలో వారం రోజులుగా జరుగుతున్న ప్రార్థనలు మంగళవారం కూడా కొనసాగాయి. ఇసుకపల్లిలోని ఇండియన్ రూరల్ ఇవాంజలికల్ చర్చితో పాటు చీరాల, అద్దంకి, పర్చూరు తదితర ప్రాంతాల్లోని చర్చిల్లో అర్ధరాత్రి ప్రార్థనలు జరిగాయి. సర్వమానవాళి సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో తులతూగాలని ఆయా పూజల్లో గురువులు, పాస్టర్లు ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. క్రీస్తు ప్రబోధించిన దయ, క్షమ, ప్రేమ, కరుణ, వంటి బోధనలను ప్రతి ఒక్కరు ఆచరించాలని సందేశమిచ్చారు.

ఆరుబయట పూజలకు వర్షం అడ్డంకి

క్రిస్మస్ సందర్భంగా ఏటా అర్ధరాత్రి జరిగే పూజలకు పెద్ద సంఖ్యలో భక్తు లు హాజరవుతారు. దీంతో చర్చిల్లో భక్తులు పట్టే అవకాశం ఉండదు. అందువల్ల అర్ధరాత్రి పూజలను ఆరుబయట నిర్వహించడం ఆనవాయితీ. అయితే పలు ప్రాంతాల్లో అర్ధరాత్రి కూడా వర్షం కురవడంతో ఆరుబయట పూజలకు అడ్డంకిగా మారింది.



బాపట్ల : చిన్నారుల నృత్య ప్రదర్శన

వాయుగండం



నగరం మండలం ధూళిపూడి గ్రామంలో తడిచి ముద్దయిన ధాన్యాన్ని చూపెడుతున్న రైతు

- కోతకోయని చేలన్నీ నేల మట్టం
- పంటలపై వాయుగుండం ప్రభావం
- తడిచిన ధాన్యం.. పొలాల్లోనే ఓదెలు
- హార్బర్‌లో 3వ నంబరు ప్రమాద హెచ్చరిక
- వరుస తుఫాన్లతో బెంబేలెత్తుతున్న అన్నదాతలు

జిల్లా అంతటా జల్లులు

వరుస వాయుగుండాలు.. వణికిస్తున్నాయి. అన్నదాతలను వాయుగండాలు వీడటంలేదు. ధాన్యం చేతికొచ్చే డిసెంబరు నెలలో వరుసగా ఏర్పడుతున్న అల్పపీడనాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో నాలుగు రోజులుగా వాతావరణం పూర్తిగా మారి వర్షం దోబూచులాడుతూ వచ్చింది. సోమవారం ఆకాశం మేఘాలతో కమ్ముకున్నా పెద్దగా ఇబ్బంది ఉండదన్న భరోసాతో కొందరు రైతులు కోతలు కోశారు. మరికొందరు యంత్రాల సాయంతో కోసి ధాన్యాన్ని ఆరబోసుకుంటున్నారు. వాయుగుండం కారణంగా మంగళవారం వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. తెల్లవారుజాము నుంచి కొన్ని ప్రాంతాల్లో మధ్యాహ్నం నుంచి కొన్ని ప్రాంతాల్లో ఈదురు గాలులతో పాటు చిరుజల్లుల నుంచి ఓ మోస్తరుగా వర్షాలు పడ్డాయి. ఆరు గాలం శ్రమించిన పంట చేతికందేలోపు అకాల వర్షం నష్ట పరుస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముమ్మరంగా నూర్పిళ్లు జరగాల్సిన సమయంలో వర్షం అడ్డంకిగా మారింది.



రేపల్లె : జాతీయ రహదారిపై ఆరబెట్టుకున్న వరిధాన్యంపై పట్టాలు కప్పుకున్న రైతులు



బాపట్ల మండల పరిధిలోని నందిరాజుతోట హైవేపై ఆరబోసిన ధాన్యాన్ని బస్తాల్లోకి నింపుతున్న రైతులు



బాపట్ల: ధాన్యం తడవకుండా పట్టలు కప్పిన అన్నదాతలు

(ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్)

జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఉదయం నుంచే చిరుజల్లులు కురవడంతో పాటు దట్టంగా ముసురు కమ్మేసింది. ఇదే తరహా పరిస్థితులు మరో మూడు రోజులు ఉండనున్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఈ నెల 27వ తేదీ వరకు కోతలు వద్దని రైతులకు అధికారులు సూచిస్తున్నారు. తుఫాన్ ప్రభావం వల్ల రైతులు ఆందోళనకు గురవుతున్నారు. నోటి దాక వచ్చిన పంట అకాల వర్షంతో అపార నష్టం జరుగుతుందని రైతులు భయాందోళనలకు గురవుతున్నారు. రెండు రోజులుగా ముసురు కప్పేసి, అడపాదడపా వరుణుడు ప్రతాపం చూపుతుండటంతో యంత్రాలతో కోతకోసి, ఆరబెట్టిన రైతులకూ నష్టం తప్పలేదు. పట్టాలు ఉన్నవారు ధాన్యంపై కప్పుకుంటున్నారు. అవి దొరకని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అకాల వర్షంతో పంట నీట మునగడమే కాకుండా ఓదెలపై నీరు నిలిచి ధాన్యం కుళ్లి పోయే పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పల్నాడు, గుంటూరు జిల్లా పరిధిలో కూడా మంగళవారం ముసురు పట్టి అక్కడక్కడ వర్షాలు పడ్డాయి. డెల్టా ప్రాంతంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కారణంగా చాలాప్రాంతాల్లో పైరు నేలవాలింది. వాయుగుండం కారణంగా యంత్రాలతో కోసిన ధాన్యాన్ని రోడ్లు, పొలాల్లో ఆరబెట్టగా వర్షానికి కొంతమేర తడిసిపోయింది. ఇప్పటికే పొలాల్లోని పనలు తడిసి మొలకలు రావడం, పైరు నేలవాలడం, ధాన్యం రంగుమారడం వంటివి రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. తేమ శాతం కోసం ధాన్యాన్ని ఆరబెట్టుకునే విషయంలో రైతుల కష్టాలు గడచిన నాలుగు వారాలుగా కొనసాగుతూనే ఉన్నాయి. వర్ష హెచ్చరికల నేపథ్యంలో తడిగా ఉండగానే కుప్పలు వేస్తున్నారు. జల్లులకు తోడు ఎడతెగని ముసురు అన్నదాతలను భయపెడుతోంది. జల్లులతో అల్పపీడన ప్రభావం వీడితే కొద్ది నష్టంతో బయటపడతామని, అలాకాకుండా రాబోయే రెండు రోజుల్లో ఓ మోస్తరు వర్షం పడినా పొలాల్లో నీళ్ల నిలబడతాయని, దీని వల్ల ధాన్యం రంగుమారడంతో పాటు దిగుబడుల్లో కూడా గణనీయంగా తేడా కనబడుతుందని అన్నదాతలు వాపోతున్నారు.

దిగుబడులు

(మిగతా 6వ పేజీలో)



బాపట్ల : పిన్నిబోయిన వారిపాలెంలో కోసి పొలం మీద ఉన్న వరిపైరు

డెల్టాను వీడని గండం

కృష్ణా పశ్చిమ డెల్టాపై వరుణుడి ప్రకోపం తగ్గలేదు. వరుస వాయుగుండాలతో గండం వెంటాడుతూనే ఉంది. డెల్టాలో 60 శాతం వరి కోతలు పూర్తయితే, 40 శాతం పైరు దశలోనే ఉంది. కోతలు ఇప్పటికే పూర్తి చేసినవారు గత వర్షాలకు నష్టపోయారు. మిగిలిన చేలల్లో పైరు నేలవాలి రంగుమారగా, ప్రస్తుత వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. డెల్టాలో 5.71 లక్షల ఎకరాలు సాగవుతుంటే, దానిలో బాపట్ల జిల్లాలో అత్యధికంగా 3,79,997 ఎకరాలు, గుంటూరు జిల్లా పరిధిలో 1,84,190 ఎకరాలు, ప్రకాశం జిల్లా పరిధిలో 7,164 ఎకరాలు ఉంది. వీటిలో గుంటూరు జిల్లా కిందున్న కాల్వల ఎగువ భూముల్లోని వరి పంట చాలావరకు గట్టెక్కింది. తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల, కొల్లిపర, పెదకాకాని, తెనాలి, పొన్నూరు మండలాల్లో చాలావరకు కోతలు చివరి దశలో ఉన్నాయి. ఇంకా పొన్నూరు మండలంలోనే కొంత ఎక్కువ కోత కొయ్యాల్సి ఉంది. బాపట్ల జిల్లా పరిధిలోని వేమూరు, అమృతలూరు, చుండూరు, కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో చాలావరకు కోతలు పూర్తయ్యాయి. ఇక్కడ మొక్కజొన్న కూడా విత్తు నాటేశారు. రేపల్లె, పి.వి. పాలెం, నగరం, నిజాంపట్నం, కర్లపాలెం, బాపట్ల, కాకుమాను తదితర మండలాల్లో కోతలు సగం పూర్తయ్యాయి. జంపని, మూల్పూరు, అమృతలూరు, చెరుకుపల్లి ప్రాంతాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిచిపోయింది. రేపల్లెనగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల్లో 10 వేల ఎకరాలపైనే పైరు కోయగా అదంగా పొలాల్లో ఓదెలుగా ఉంది. సోమవారం రాత్రి కురిసిన భారీవర్షంతో ఓదెలన్నీ తడిచి ముద్దయ్యాయి. బాపట్ల జిల్లాలో ఇప్పటికే దాదాపు 20,000 ఎకరాల్లో పైరు నేలవాలిందని, రంగు మారడం ఖాయమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 3,000 ఎకరాల్లో కోతలు కోయగా పంట పొలం మీద ఉంది. ఈ జల్లులు ఇంతటి వీడితే కొద్ది నష్టంతో బయటపడతామని, అలాకాకుండా వర్షం కొనసాగితే మునిగిపోతామని కన్నీటి పర్యంతమవుతున్నారు.

ఫిర్యాదుల పరిష్కారంపై ...

అవగాహన అవసరం

కారణాలు చూపకుండా తిరస్కరణతో పునరావృతం

సదస్సులో కలెక్టర్ వెంకటమురళి



ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థపై అధికారులు అవగాహన కలిగిఉండాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంపై అవగాహనకు సంబంధించి మంగళవారం కలెక్టరేట్‌లోని ఈసీ హాలులో అధికారులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో వచ్చిన అర్జీలు, జిల్లా గిరిజన సంక్షేమశాఖ, విభిన్న ప్రతిభావంతుల సమస్యలపై వచ్చే అర్జీలు, ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చే అర్జీలను పీజీఆర్ఎస్ పోర్టల్‌లో నమోదు చేస్తారన్నారు. జిల్లాలో 29 శాఖల ఫిర్యాదుల పరిష్కారాలకు సంబంధించి అధికారులకు లాగిన్స్‌కు అవకాశం ఉందన్నారు. జిల్లా అధికారులు ప్రజా ఫిర్యాదులను పరిష్కరించడంలో అలసత్వం వహిస్తున్నారని, సరైన కారణాలు చూపకుండా తిరస్కరిస్తున్నారన్నారు. దీంతో అవి పునరావృతం అవుతున్నాయని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ఆడిటింగ్, పెండింగ్, ఫోన్‌కాల్స్, ప్రజల సంతృప్తి, అసంతృప్తిపై తీసుకోవాల్సిన చర్యలు గురించి పవర్‌ప్రజంటేషన్ ద్వారా అధికారులకు వివరించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార దిశలో జిల్లా మొదటి స్థానంలో ఉండేందుకు అధికారులందరూ చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. జిల్లాలో 33 శాఖలకు సంబంధించిన ప్రధాన పనితీరు సూచికలను సరిచేసుకోవాలన్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన ఫిర్యాదులు, పరిష్కార స్వభావంపై కలెక్టర్ అధికారులను ప్రశ్నించారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో పాగా

- వైసీపీ హయాంలోనే అసైన్డ్ భూమి కబ్జా
- చదును చేసి ఆక్రమణకు సిద్ధమైన భూబకాసురులు



అసైన్డ్‌భూమిలో ఇంటి నిర్మాణం, సాగులో ఉన్న పూలమొక్కలు

బాపట్ల రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బాపట్ల మండలం పడమర బాపట్ల పంచాయతీ వైఎస్సార్‌నగర్ గ్రామశివారులో ప్రభుత్వ లేఅవుట్, అసైన్డ్‌భూములపై భూబకాసురులు కన్నేశారు. సర్వే నెంబరు 204, 207, 208లోని సుమారు 80 సెంట్ల అసైన్డ్‌భూమిని పేదలకు ఇచ్చేందుకు లేఅవుట్‌ను గతంలో ఏర్పాటు చేశారు. కొన్నినెలలు క్రితం వైసీపీ హయాంలోనే ఈ లేఅవుట్‌పై కొందరు భూబకాసురులు కన్నేశారు. ఆక్రమించాలని కొందరు ప్రయత్నించగా అప్పటి వీఆర్వో అడ్డగించి వారిపై కేసును నమోదు చేయించారు. అయితే మళ్లీ కొన్ని రోజులు క్రితం ఇదే లేఅవుట్‌ను కబ్జా చేయాలనే ఉద్దేశంతో ట్రాక్టర్ల ద్వారా చదును చేపించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడే సర్వే నెంబరు 204లో ఓ వ్యక్తి అక్రమంగా ఇంటి నిర్మాణం చేపట్టడంతోపాటు 20సెంట్లకు పైగా ఆక్రమించి పూలమొక్కలు సాగు చేపట్టాడు. అయినా అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం మారినా ఆక్రమణదారులపై చర్యలు తీసుకోకపోవడంతో కబ్జాదారులు మరింతగా రెచ్చిపోతున్నారు. రోజురోజుకు అసైన్డ్‌భూమి లేఅవుట్‌లో ఆక్రమణలు పెరిగిపోతున్నాయి.

ఉపాధి కూలీలకు తీపి కబురు

- ఇకపై కనీస వేతనం రూ.300
- నిరంతరం తనిఖీలు, పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీ

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు ఎన్డీయే ప్రభుత్వం తీపి కబురు తెలిపింది. ఇకపై ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయటంతో పాటు కూలీల కనీస వేనాన్ని రూ 263 నుంచి రూ.300కి పెంచి ఇవ్వటానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఈ విభాగం బోగస్ మస్టర్లకు అడ్డుకట్ట వేయటంతో పాటు, పని వేళ్లల్లో మార్పులు చేసి కూలీలకు గిట్టుబాటు వేతనం అందించేందుకు పర్యవేక్షణ చేయనుంది. ఈ విభాగానికి డ్వామాలో కీలకంగా జిల్లా విజిలెన్స్ అధికారిని నియమించింది.



బాపట్ల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) :మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం కూలీలు ప్రస్తుతం నాలుగు గంటలు పాటు పని చేస్తున్నారు. అదనంగా మరో గంట పెంచేలా చూడాలని ప్రభుత్వం సూచించింది. ఉపాధి సిబ్బంది, ఏపీడీలు, ఏపీవోలు, ఎంపీడీవోలు నిత్యం మస్టర్లు తనిఖీ చేయాలి. ఈ తరహా చర్యలతో కూలీలకు సగటున మూడు వందల రూపాయల వేతనం లభిస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మొత్తం అందాలంటే ఏయే పనులు ఎంత సమయంలో చేయాల్సి ఉంటుందనే అంశాల పై జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన వేతన పర్యవేక్షణ విభాగం పర్యవేక్షిస్తుంది.

బోగస్ మస్టర్లకు అడ్డుకట్ట..

ఉపాధి పనుల్లో ఇప్పటికే బోగస్ మస్టర్ల బోగోతం నడుస్తుంది. కూలీలు పనికి రాక పోయినా హాజరైనట్లు కొందరు సిబ్బంది మస్టర్లు వేసి వేతనాలు స్వాహా చేస్తున్నారు. వేతన దినాలు దుర్వినియోగం కావటంతో పాటు పనులకు హాజరైన కూలీలకు పూర్తిగా వేతనం అందటం లేదు. అక్రమాలు అరికట్టడానికి జిల్లా స్థాయిలో పర్యవేక్షించే జిల్లా విజి లెన్స్ అధికారి సమన్వయంచేస్తారు.



ఒంగోలులో కురుస్తున్న వాన

జిల్లాపై అల్పపీడన ప్రభావం

» తూర్పు ప్రాంతంలో ముసురుపట్టి జల్లులు
» అవస్థలు పడుతున్న ప్రజానీకం
» క్రిస్మస్ కొనుగోళ్లపైనా ప్రభావం
» పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన

ఒంగోలు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం జిల్లాపై కనిపిస్తోంది. ప్రత్యేకించి తూర్పు ప్రాంతంలో మంగళవారం ఉదయం నుంచి ముసురుపట్టింది. రోజంతా తెరపి లేకుండా ఏదో ఒక స్థాయిలో జల్లులు పడుతుంటంతోపాటు చలి తీవ్రత కూడా పెరిగింది. తుఫాన్ సమయంలో ఉండే వాతావరణం ఏర్పడి జల్లులు పడుతుండటంతో జనజీవనానికి తీవ్ర అసౌకర్యం ఏర్పడింది. ఉదయం నుంచి ఒంగోలుతోపాటు టంగుటూరు, సింగరాయకొండ, కొండపి, మద్దిపాడు, కొత్తపట్నం, సంతనూతలపాడు, చీమకుర్తి, నాగులుప్పలపాడు, పొదిలి, తాళ్లూరు తదితర మండలాల్లోని పలుగ్రామాల్లో ముసురుపట్టి జల్లులు పడుతుండటంతో ప్రజలు బయటకు రాలేకపోయారు. ప్రత్యేకించి స్కూళ్లు, కార్యాలయాలకు వెళ్లేవారు, వీధి వ్యాపారులు ఎక్కువగా ఇబ్బందిపడగా క్రిస్మస్ కొనుగోళ్లపైనా తీవ్ర ప్రభావం కనిపించింది. బుధవారం క్రిస్మస్ పర్వదినం కాగా సాధారణంగా ముందు రోజున పెద్దఎత్తున వస్త్రాలు, స్వీట్లు, చెప్పులు, క్రిస్మస్ అలంకరణ వస్తువులు కొనుగోలు చేస్తారు. ప్రధాన పట్టణాలలో ఈ తరహా వ్యాపార సంస్థలు కిటకిటలాడుతుంటాయి.

వణికిపోతున్న రైతులు

అయితే తెరపి లేకుండా కురుస్తున్న జల్లులతో జనం రోడ్లపై తిరిగేందుకు వీలుకాలేదు. కాగా అల్పపీడన ప్రభావంతో జిల్లాలో బుధ, గురువారాల్లో కూడా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ప్రధాన పంటలన్నింటిపైనా వర్షాలు, ఆ తరహా వాతావరణంతో తెగుళ్లు, పురుగులు ఉధృతి పెరిగి నష్టపోతున్నారు. సాధారణంగా ఈ సమయంలో తెల్లవారుజామున మంచు కురవడం తప్ప వర్షాలు పడవు. అలాంటిది ముసురుపట్టి జల్లులు పడుతుండటంతో పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పలుప్రాంతాల్లో ఇటీవల వేసిన లేత పొగ తోటలు, శనగ మొలకలు ఉరకెత్తి దెబ్బతినే పరిస్థితి ఉండగా, కోతకు వచ్చిన మిర్చి, వరి ఇతర పంటలకు నష్టం జరిగే అవకాశం ఉంది.

డ్వామాలో శీనారెడ్డి భారీ దోపిడీ

» విచారణ కమిటీ ఎదుట ప్రధాన ఫిర్యాదుదారు ఈదర మోహన్
» పలు ఆరోపణలపై అంశాల వారీ వివరణ
» కొనసాగుతున్న త్రిసభ్య కమిటీ విచారణ
» సోషల్ ఆడిట్ పరిస్థితిపైనా దృష్టి

ఒంగోలు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : డ్వామా పీడీగా కె.శీనారెడ్డి పనిచేసిన కాలంలో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు జరిగాయని, తద్వారా భారీగా ప్రజాధనాన్ని శీనారెడ్డి దోపిడీ చేశారని పీడీసీసీ బ్యాంకు మాజీ ఛైర్మన్ ఈదర మోహన్ ఆరోపించారు. ఆ మేరకు శీనారెడ్డిపై వచ్చిన ఫిర్యాదులపై కలెక్టర్ ఆదేశాలతో విచారణ నిర్వహిస్తున్న డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలోని త్రిసభ్య కమిటీ ఎదుట పలు అంశాలపై వివరణ ఇచ్చారు. కాగా శీనారెడ్డి అక్రమాలపై విచారణ చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలతో కలెక్టర్ అన్సారియా నియమించిన త్రిసభ్య కమిటీని నియమించిన విషయం తెలిసిందే. డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు, జిల్లా ఆడిట్ అధికారి నారాయణరెడ్డి, సెర్ప్ సీఈవో శ్రీమన్నారాయణలతో కూడిన కమిటీ గత కొద్దిరోజులుగా డ్వామాలో విచారణ చేస్తోంది. మంగళవారం కూడా విచారణ కొనసాగింది. డ్వామా పీడీ కార్యాలయంలో మంగళవారం వారు జిల్లాలో శీనారెడ్డి పీడీగా పనిచేసిన కాలంలో జరిగిన ఉపాధి హామీ పథకంలో చోటుచేసుకున్న అవకతవకలపై అధికారులు దృష్టిపెట్టారు. సామాజిక తనిఖీలు, మండలాల్లో జరిగిన ప్రజావేదికలు ఆ సందర్భంగా సోషల్ ఆడిట్ బృందాలు అవకతవకలు జరిగినట్లు గుర్తించిన మొత్తాలు, వాటిని ప్రజావేదికల్లో పీడీ హోదాలో పాల్గొన్న శీనారెడ్డి తగ్గించడం, అనంతరం ఆయా సిబ్బందిని వ్యక్తిగత విచారణ పేరుతో పిలిచి రికవరీలు లేకుండా చేయడం, తదితర అంశాలకు సంబంధించి విజిలెన్స్ విభాగం ఫైళ్లను పరిశీలించారు.

అందరికీ నోటీసులు

భారీగా అక్రమాలు జరిగాయన్న ఫిర్యాదులు ఉన్న కనిగిరి, దోర్నాల, ముండ్లమూరు, కొండపి మండలాలకు సంబంధించిన ఫైళ్లపై విజిలెన్స్ అధికారిణి ఝాన్సీరాణి, ఆ విభాగంలో కీలకమైన ఉద్యోగి సురేష్‌లను అడిగి తెలుసుకున్నారు. తదనంతరం ఇతర విభాగాల వారీ ఫైళ్లను పరిశీలించనున్నారు. ఇదిలాఉండగా ఆరోపణలు ఎదుర్కొంటున్న శీనారెడ్డిని వచ్చేనెల 2న విచారణకు హాజరుకావాలని నోటీసులు ఇచ్చిన త్రిసభ్య కమిటీ ఆలోపు ఆయా ఫైళ్ల పరిశీలనతోపాటు ఫిర్యాదుచేసిన వ్యక్తులను కూడా విచారించాలని నిర్ణయించారు. తదనుగుణంగా ప్రధాన ఫిర్యాదుదారునిగా ఉన్న పీడీసీసీ బ్యాంకు మాజీ ఛైర్మన్ ఈదర మోహన్‌బాబును పిలిచి విచారించారు. ఆయన ప్రభుత్వ పెద్దలకు చేసిన ఫిర్యాదులలో కొన్నింటిపై వివరాలను అడిగారు. కాగా తాను పేర్కొన్న ఫిర్యాదులన్నీ వాస్తవాలే అని సంబంధిత ఫైళ్ను పరిశీలిస్తే స్పష్టంగా ఆ విషయం బయటపడుతుందని ఆ సందర్భంగా అధికారుల కమిటీ దృష్టికి మోహన్ తీసుకెళ్లినట్లు సమాచారం. నాటి వైసీపీ ప్రభుత్వంలో కీలకమైన వారితో అంటకాగుతూ ఇష్టారీతిలో వ్యవహరించి అడ్డుగోలుగా డ్వామాలో శీనారెడ్డి అవినీతికి పాల్పడ్డాడని తద్వారా ప్రజధానాన్ని భారీగా దోపిడీ చేశాడని వారి దృష్టికి తీసుకెళ్లారు. తాను చేసిన ఫిర్యాదుపై అంశాల వారీగా వివరణలు ఇచ్చిన ఆయన అధికారుల సూచనల మేరకు రాతపూర్వకంగా కూడా స్టేట్‌మెంట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. డ్వామా పీడీగా పనిచేసిన కాలంలో శీనారెడ్డి సంపాదించిన అవినీతి సొమ్ముతో కొనుగోలు చేసిన భూములు, భవనాలు ఇతరత్రా ఆస్తుల విషయంపై కూడా వారికి వివరాలు చెప్పినట్లు తెలిసింది.

వాయు'గండం'

(5వ పేజీ తరువాయి)

అంతంతమాత్రంగా ఉన్న పరిస్థితుల్లో వరుస అల్పపీడనాలు తమను కుదేలు చేయడమే కాకుండా కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. కొన్నిచోట్ల పూర్తిగా ఆరిపోయిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించడంలో ఆలస్యం కావడంతో గోతాలకెత్తి పట్టాలు కప్పిన బస్తాలు కూడా కింది నుంచి నీటి చెమ్మ చేరడంతో తడిచాయని రైతులు తెలిపారు. ఖరీఫ్ సాగు నుంచి గట్టెక్కి, రబీ కింద మొక్కజొన్న, మినుము విత్తనాలు ఈ రెండు రోజుల్లో వేసిన రైతులకూ నష్టం తప్పలేదు. వర్షంతో విత్తు కుళ్లిపోతోందని రైతుల ఆవేదన చెందుతున్నారు. అల్పపీడనం ప్రభావంతో రానున్న 24 గంటల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చేసిన ప్రకటన రైతుల కంటిపై కునుకు లేకుండా చేస్తోంది. కొన్ని పొలాల్లో కోతలు కోసి వరి ఓదెల మీద ఉన్నాయి. వాతావరణంలో మార్పులతో ఒక్కసారిగా కూలీలకు డిమాండ్ పెరిగి రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కవారంరోజుల పాటు వర్షం పడకుండా ఉంటే రైతులు పూర్తిగా కోలుకుంటారని తెలుపుతున్నారు. పల్నాడు జిల్లాలో భారీ వర్షాలతో పత్తి పంట పూర్తిగా కుళ్లి నష్టపోయామని ధాన్యం కొంతమేర సంతృప్తి చెందుతుందనే దశలో అకాల వర్షం నష్ట పరుస్తుందని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

నాలుగో రోజూ.. మూడో నంబరు హెచ్చరిక

వాయుగుండం ప్రభావంతో నిజాంపట్నం హార్బర్‌లో మూడో నంబరు ప్రమాద హెచ్చరికను ఎగురవేశారు. నాలుగు రోజుల క్రితం ఈ హెచ్చరికను ఎగురవేసినప్పుడు వాతావరణం ప్రశాంతంగా ఉంది. ఎండ కూడా ఉండటంతో వాయుగుండం ఉండదని అంతా భావించారు. అయితే వాతావరణ శాఖ ముందే హెచ్చరించినట్లు మంగళవారానికి వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. సముద్రంలో వేటకు వెళ్లిన పడవలు ఒడ్డుకు చేరిపోయాచి. తుఫాన్ ప్రభావంతో సముద్రంలో అలల తీవ్రత ఎక్కువగా ఉంటుందని చిన్నబోట్లు వారు వేటకు వెళ్లరాదని అధికారులు ఆదేశాలు జారీచేశారు.

అనుమతులు పొందండి రాజమార్గంలో నడవండి

» ల్యాండ్, శ్యాండ్, వైన్, మైన్, రిసార్ట్‌లకు సంబంధించి ఎవరికైనా ఒక్కటే మాట
» అక్రమార్కులకు క్లాస్ పీకిన ఎమ్మెల్యే కొండయ్య
» అభివృద్ధి, సంక్షేమంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని స్పష్టీకరణ
» ఆంధ్రజ్యోతి వరుస కథనాలపై స్పందన



రామాపురం బీచ్‌లో యువకుల మరణవార్త తెలుసుకున్న క్రమంలో హోం మంత్రి అనిత, ఎమ్మెల్యే కొండయ్య (ఫైల్)

కొందరు నిబంధనలకు విరుద్ధంగా వేస్తున్న అడుగులు పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా ఉన్నాయని, ల్యాండ్, శ్యాండ్, వైన్, మైన్ లకు సంబంధించి ఎవరైనా సరే నిర్ణీత అనుమతులు పొంది.. రాజమార్గంలో నడవాలని, లేకుంటే నేనే ముందుండి సంబంధిత అధికారులు చర్యలు చేపట్టేలా చేస్తానని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య హెచ్చరించారు. అభివృద్ధి, సంక్షేమంతో ప్రజల కు మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

చీరాల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రజ్యోతిలో ఈ నెల 21వ తేదీన తీరంలో వేడుకలకు రంగం సిద్ధం, 23వ తేదీన మాఫియా మిలాఖత్, 24వ తేదీన అనధికారిక లేఅవుట్లు .. ఇసుక దందా పేరుతో ప్రచురితమైన కథనాలపై ఎమ్మెల్యే కొండయ్య స్పందించారు. క్షేత్రస్థాయిలో వాస్తవాలను తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఆ క్రమంలో మంగళవారం సంబంధీకులకు క్లాస్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అంతిమంగా ప్రజాప్రయోజనాలే లక్ష్యమని, అందుకు భిన్నంగా ఎవరు ప్రవర్తించినా ఆపై తీసుకునే నిర్ణయాలు కటువుగా ఉంటాయని కొండయ్య హెచ్చరించారు. ఇసుక, ఖనిజ తవ్వకాలు, రవాణా, అనధికారిక అలేవుట్లు, బెల్ట్ షాపులు తదితర అంశాలకు సంబంధించి నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు సాగించేవారికి తనదైన శైలిలో హెచ్చరికలు జారీ చేశారు. ప్రభుత్వ పరంగా ఇసుక రవాణాకు అనుమతులు తెచ్చుకోవాలని, ఈ విషయంలో ఆటంకం ఏర్పడితే ప్రభుత్వపరంగా సహకరిస్తామన్నారు. పార్టీకి చెడ్డపేరు తెచ్చేలా కాకుండా ప్రజల క్షేమం కోసం రాజమార్గంలో నడవాలని సూచించడం హాట్‌టాపిక్‌గా మారింది.



ఎమ్మెల్యే చర్యలతో వాడరేవు సముద్రతీరంలో గల్లంతైన యువకుడిని కాపాడిన గజ ఈతగాళ్లు (ఫైల్)

మనం కూడా నిబంధనలు పాటిద్దాం

రిసార్ట్స్ ప్రాంగణంలో అయినా, తీరంలో అయినా నూతన సంవత్సర వేడుకలకు సంబంధించి మనం కూడా నిబంధనలు పాటిస్తే అందరికీ మంచిది. లేదంటే ఏదన్నా అపశ్రుతులు తలెత్తితే క్షమార్హులం కాదనే కోణంలో రిసార్ట్స్ నిర్వాహకులు పలువురు భావిస్తున్నారు. గతంలో రామాపురం, వాడరేవు తీరప్రాంతాల్లో విహారానికి వచ్చిన పలువురు సుముద్రస్నానాల సమయంలో మృత్యువాత పడి అది కాస్త విషాదంగా మారిన విషయాన్ని ఎవరూ మరువలేనిది. దానిపై ఎమ్మెల్యే కొండయ్యపై సీరియస్‌గా స్పందించారు. పలు నిర్ణయాలు చేశారు. ఆ విషయంలో ఆయన పలు నిందులు ఎదుర్కొన్నారు. ఎమ్మెల్యే సూచనలు, చర్యల ఫలితంగా ప్రమాదాలకు అడ్డుకట్ట పడింది. పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు, రక్షణ కల్పించే దిశగా రిసార్ట్స్ నిర్వాహకులు ముందుకొచ్చేవరకు కొండయ్య నిబద్ధతతో నిలిచారు. ఈ క్రమంలో రిసార్ట్‌ల నిర్వాహకులు అసోసియేషన్ ద్వారా సమకూర్చుకున్న నిధులతో గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. సెర్ఫ్ టవర్లు, లైఫ్ జాకెట్లు, హెచ్చరిక జెండాలు, తదితరాలకు సంబంధించి అన్ని వనరులను సమకూర్చారు. ఈ క్రమంలో వాడరేవు తీరంలో యువకుడు సముద్రంలో మునిగిపోగా గజ ఈతగాళ్లు కాపాడారు. ఆ సమయంలో ఎమ్మెల్యే కొండయ్య నిర్ణయంలో ప్రజలు, పర్యాటకులు, గతంలో నిందులు వేసిన వాళ్లు అభినందనలు తెలిపారు.

ప్రస్తుతం నూతన సంవత్సర వేడుకలకు కూడా నిబంధనల మేరకు అనుమతులు పొంది ఎక్కడా అపశ్రుతులు దొర్లకుండా చూసేందుకు ముందస్తు ఆలోచన చేయడం శుభపరిణామని పలువురు భావిస్తున్నారు.

మమ అనిపించొద్దు

గతంలో రిసార్ట్‌ల నిర్వాహకులలో సింహభాగం అనుమతుల కోసం దరఖాస్తు చేశారు. అయితే డిసెంబరు 31కి వారికి ఎలాంటి అనుమతులు అటు పోలీస్, ఇటు ఎక్సైజ్ శాఖల నుంచి మంజూరు చేయరని, అయితే దరఖాస్తు ప్రాసెస్‌లో ఉందని చెప్పి వేడుక పేరుతో మినీ రేవ్ పార్టీలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని పలువురు గుర్తు చేస్తున్నారు. ఈసారి అలా మమ అనిపించకుండా నిబంధనల మేరకు అనుమతులు పొంది నూతన సంవత్సర వేడుకలను సజావుగా, ఎలాంటి అపశ్రుతులకు తావు లేకుండా నిర్వహించేలా అధికారులు చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రక్షాళన జరిగేనా?

» వైసీపీ హయాంలో వైద్యశాఖలో అన్ని అడ్డగోలు వ్యవహారాలే
» పోస్టుల నియామకాల నుంచి ఉద్యోగుల బదిలీల వరకు అక్రమాలే
» తప్పుడు డిప్యుటేషన్లు, వైద్యశాలల తనిఖీల పేరుతో వ్యవహారాలు
» అంతటా దళారులదే ఇష్టారాజ్యం
» నేడు డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ



ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలో వైద్యశాఖ ప్రతిష్ఠ మసకబారింది. ఒకటి కాదు రెండు కాదు అనేక అక్రమాలకు నిలయంగా మారింది. అసలు ఆ శాఖ అంటేనే జనం హడలెత్తిపోయే పరిస్థితి ఏర్పడింది. వైద్యశాఖలో ఏ పని కావాలన్నా చేతులు తడపాల్సిందే. ఇక ఉద్యోగ నియామకాలు అంటే పండుగే. ఏ ఉద్యోగం ఎవరికి ఇస్తారో కూడా తెలియని పరిస్థితి. అర్హులను కాదని పోస్టులను అనర్హులకు ఇచ్చిన ఘటనలు కోకొల్లలు. వైసీపీ ప్రభుత్వ హయాంలో విడుదల చేసిన నోటిఫికేషన్లలో వైద్యశాఖలో చోటుచేసుకున్న అవకతవకలు అంతాఇంతా కాదు.. కరోనా విపత్కర సమయంలో చేపట్టిన పలురకాల నియామకాల్లో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఆ వ్యవహారంపై ఏకంగా త్రిసభ్య కమిటీని విచారణకు నియమించారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆ త్రిసభ్య కమిటీ విచారణలో ఉద్యోగ నియామకాల్లో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయని నివేదికలు ఇచ్చినా ప ట్టించుకున్న పరిస్థితి లేదు.

బదిలీలలో భారీగా అవకతవకలు

మరోవైపు ఉద్యోగుల బదిలీల సమయంలో తమకు చేతులు తడిపిన వారికి అనుకూలమైన ప్రాంతాలకు బదిలీలు చేయగా, అర్హత ఉన్న వారిని సుదూర ప్రాంతాలకు వేసిన ఘటనలు ఉన్నాయి. ఇక ఉద్యోగుల అక్రమ డిప్యుటేషన్లు సరేసరి. ఏ ఉద్యోగిని ఎక్కడి నుంచి ఎక్కడకు పంపుతారో కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది. ఈ అక్రమ డిప్యుటేషన్లలో భారీగా చేతులు మారినట్లు ఆరోపణలు వచ్చినా పట్టించుకున్న వారు లేరు. ఈ డిప్యుటేషన్లు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా జరిగాయంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక ప్రైవేటు వైద్యశాలల అనుమతుల విషయంలోనూ అడ్డగోలు వ్యవహారాలు జరిగాయి. ఒక డాక్టర్ అందుకోసం తన డాక్టర్ వృత్తినే పక్కన పెట్టి కార్యాలయంలో తిష్ట వేసి వ్యవహారాలు నడిపిన ఉదంతాలు అనేకం ఉన్నాయి. మరోవైపు వైద్యశాఖ కార్యాలయంలోనే కొంతమంది ఉద్యోగులు దళారుల అవతారం ఎత్తారు. కార్యాలయానికి వివిధ పనుల కోసం వచ్చే వారితో చర్చలు జరిపి వారి పనులు చేయిస్తామని డబ్బులు వసూలు చేసిన ఘటనలు కూడా ఉన్నాయి.

పాలన కత్తి మీద సామే

ఇలా గత ఐదేళ్ల కాలంలో వైద్యశాఖ అనేక అవినీతి, అక్రమాలకు అడ్డాగా మారింది. ఈ నేపథ్యంలో జిల్లాకు వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా నియమితులైన డాక్టర్ వెంకటేశ్వర్లుకు పరిపాలన కత్తి మీద సాము లాగా తయారైంది. శాఖకు పోయిన పరువును నిలబెట్టాలంటే ప్రక్షాళన దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని అద్దంకిలో పనిచేసిన వెంకటేశ్వర్లుకు అధికారిగా మంచి గుర్తింపు ఉంది. ఆ కారణంగానే ఆయనను జిల్లా వైద్యశాఖాధికారిగా నియమించారు. డీఎంహెచ్‌వోగా వెంకటేశ్వర్లు బుధవారం ఉదయం పది గంటలకు బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆయనకు కార్యాలయంలో జరుగుతున్న అనేక అంశాలపై ఇప్పటికే ఒక అవగాహనకు వచ్చినట్లు సమాచారం. వైద్యశాఖ కార్యాలయ పరిస్థితితో పాటు అందులో పనిచేసే ఉద్యోగుల వ్యవహారాలు కూడా ఆయన దృష్టిలో ఉన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో వైద్యశాఖ పరువు, ప్రతిష్ఠలను ఇనుమడింపజేసే దిశగా నూతన డీఎంహెచ్‌వో అడుగులు వేసే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



అభివృద్ధిపై చర్చిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే మాగుంట, జనార్దన్

ఒంగోలు అభివృద్ధిపై దృష్టి

» ప్రభుత్వ భవనాలతో పాటు పలు అంశాలపై చర్చ
» కలెక్టర్‌తో భేటీ అయిన ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని ప్రభుత్వ కార్యాలయ భవనాలపై ప్రజాప్రతినిధులు దృష్టిసారించారు. నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్స్ కార్పొరేషన్ (ఎన్‌బీసీసీ) అధికారులతో కలిసి మంగళవారం కలెక్టరేట్‌లో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్‌లు కలెక్టర్ తమీమ్ అన్సారియాతో భేటీ అయ్యారు. శిథిలావస్థలో ఉన్న ప్రకాశం భవనంతోపాటు పాత రిమ్స్, ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయంతోపాటు ఊరచెరువు అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఒంగోలు నగరంలో ఖాళీస్థలాలపై కమిషనర్ వెంకటేశ్వరరావు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఎన్‌బీసీసీ అధికారి రాజారాంకు వివరించారు. ఒంగోలు నగరంలో రీ డెవలప్‌మెంట్ కోసం తీసుకోవాల్సిన పలు అంశాలను ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే జనార్దన్‌లు వివరించారు. ఒంగోలు నగరంలో రీడెవలప్‌మెంట్ కోసం తీసుకోవాల్సిన పలు అంశాలను వివరించారు. అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన పలు అంశాలను వివరించి అందుకు తీసుకోవాల్సిన అంశాలను ఎన్‌బీసీసీ అధికారికి ఎంపీ, ఎమ్మెల్యేలు వివరించారు. ప్రభుత్వ భవనాలతోపాటు కార్పొరేషన్‌లో ఖాళీగా ఉన్న స్థలాలను అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటామని ఎన్‌డీసీసీ అధికారి రాజారాం తెలిపారు. అనంతరం వారు ఒంగోలు నగరంలోని ఖాళీస్థలాలను పరిశీలించారు.

భక్తిశ్రద్ధలతో ఈశ్వరీదేవి ఆరాధన



కుంకుమార్చన పూజలో పాల్గొన్న భక్తులు

పామూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విరాట్‌నగర్ కాలనీలో గల పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో వెలసియున్న శక్తిస్వరూపిణి ఈశ్వరి మహాదేవి 235వ ఆరాధన మహోత్సవ వేడుకలను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ఎర్ర చీరెలు ధరించిన పలువురు మహిళా భక్తులు మేళతాళాలతో సారె చీరను సమర్పించారు. అనంతరం సాముహిక కుంకుమార్చన పూజలు చేశారు. ఈసందర్భంగా ఈశ్వరి మాతకు విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు సొస్సం నాగేంద్రచారి, సుధీర్ దంపతులు రూ.40వేల విలువ గలిగిన వెండి కిరీటాన్ని దేవస్థాన నిర్వాహకులకు అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు వై.ప్రసాదరెడ్డి షేక్ ఖాజారహంతుల్లా, మన్నం రమణయ్య, దేవస్థాన గౌరవాధ్యక్షుడు వి.రామాచారి, అధ్యక్షుడు ఎం.దొరసానాచారి, ఎన్.ముఖేష్‌చారి, రవి, శ్రీశైలం, ఎస్.చంద్రశేఖర్, గోవిందయ్య, తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత జాబితా నుంచి తొలగిస్తాం

» ఆస్తుల క్రయవిక్రయాలకు ఇబ్బంది లేకుండా చూస్తాం
» తహసీల్దార్ నరసింహం
» 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

మర్రిపూడి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మర్రిపూడి గ్రామాన్ని నిషేధిత భూముల జాబితా నుంచి తొలగిస్తామని తహసీల్దార్ జ్వాలా నరసింహం తెలిపారు. అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. 'ఆస్తులున్నా.. అమ్ముకోలేరు' శీర్షికన మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. 2015లో జరిగిన మీభూమి గ్రామసభలో మర్రిపూడి గ్రామాన్ని దేవదాయశాఖ పరిధిలో చేర్చడంతో అప్పటి నుంచి ఆస్తుల క్రయవిక్రయాలు నిలిచిపోయాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యంలో వచ్చిన సమగ్ర కథనంపై ఉన్నతాధికారులు స్పందించారు. అటు దేవదాయ, ఇటు రెవెన్యూ శాఖలకు చెందిన క్షేత్రస్థాయి అధికారుల నుంచి సమాచారం తీసుకున్నారు. వారి ఆదేశాల మేరకు దేవదాయశాఖ కార్యనిర్వాహణాధికారి దేవదాయ భూమిగా పొరపాటున గ్రామాన్ని చేర్చారని, 40 సెంట్ల స్థలంలోనే వేణుగోపాలస్వామి, రామలింగేశ్వరస్వామి ఆలయాలు ఉన్నాయని తహసీల్దార్‌కు నివేదించారు. సబ్‌డివిజన్ చేసి మిగిలిన గ్రామకంఠం భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. గ్రామ రెవెన్యూ అధికారి, సర్వేయర్‌లు కూడా రెవెన్యూ రికార్డుల ప్రకారం 547 సర్వే నంబరులోని 43.25 ఎకరాలు గ్రామకంఠంగా నమోదై ఉందని నివేదిక ఇచ్చారు. ఈనేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశం మేరకు రెవెన్యూ సదస్సులో మర్రిపూడిలోని భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తామని తహసీల్దార్ స్పష్టం చేశారు. ఆస్తుల క్రయవిక్రయాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

నేడు హ్యాపీ క్రిస్మస్



క్రిస్మస్ సందర్భంగా పసువుల పాకలో ఏర్పాటు చేసిన బాల ఏసు

ఒంగోలు, కార్పొరేషన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రక్షకుడు, దయామయుడు ఏసు ప్రభువు జన్మదినం సందర్భంగా వేడుకలకు ప్రార్థనా మందిరాలు ముస్తాబయ్యాయి. అలాగే గ్రామాల నుంచి పట్టణాల వరకు అంతటా సందడి కనిపిస్తోంది. క్రిస్మస్‌తోపాటు, న్యూఇయర్ శుభాకాంక్షలు తెలియజేసే ఫ్లెక్సీలు, స్టార్స్, క్రిస్మస్ ట్రీలు పెద్దఎత్తున ఏర్పాటుచేశారు. ఏసుక్రీస్తు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ యువత రాత్రివేళ ఇళ్లను సందర్శించి క్యాండిల్ అందజేసి శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఇక పిల్లలు, పెద్దలు, షాపింగ్‌లలో మునిగిపోయారు. దీంతో ఫుట్‌పాత్ వ్యాపారాలు ఊపందుకోగా, పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ కిక్కిరిసిపోతున్నాయి. పండుగ నేపథ్యంలో చరిత్ర కలిగిన చర్చీలకు రంగులు వేశారు. విద్యుత్ దీపాలతో అలంకరణలు చేశారు. జిల్లాలోని ఒంగోలు జువెట్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చి, మిషన్ కాంపౌండ్‌లోని క్లౌ మెమోరియల్ చర్చి, కనిగిరి దుర్గం బాప్టిస్ట్ చర్చి, మార్కాపురం తెలుగు బాప్టిస్ట్ చర్చి, పొదిలి సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలతోపాటు, ఆర్‌సీఎం చర్చీలు, పెంతెకోస్తు, ఎష్కోలు, క్రీస్తు సంఘం తదితర చర్చీలలో అర్ధరాత్రి నుంచి ప్రత్యేక ప్రార్థనలు జరగనున్నాయి.



క్రిస్మస్ సందర్భంగా కొనుగోలుదారులతో రద్దీగా ఉన్న దుకాణసముదాయాలు

వర్షాలతో రైతుల్లో ఆందోళన

» చేతికి వచ్చిన వరి, మొక్కజొన్న, జూట్ పంటలు నష్టపోతాయని దిగులు

అద్దంకి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : చేతికి వచ్చిన పంటలు వర్షార్పణం అవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. అద్దంకి, బల్లికురవ, సంతమాగులూరు మండలాలలో సాగర్ ఆయకట్టుతో పాటు బోరు బావుల కింద ముందుగా సాగు చేసిన వరి పంట కోత దశలో ఉంది. ఇప్పటికే కొంతమంది రైతులు వరి కోతలు కోయగా, మరి కొందరు వరి కోసేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో తుఫాన్ ప్రభావంతో గాలులు వీస్తే వరి నేలవాలి రాలిపోతాయని ఆందోళన చెందుతున్నారు. కొంత మంది రైతులు వరి సాగు లాభదాయకంగా ఉండటం లేదన్న ఉద్దేశ్యంతో సాగర్ ఆయకట్టులో సైతం మొక్కజొన్న సాగు చేశారు. మొక్కజొన్న కూడా కోత దశ కు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పలు చోట్ల సాగు చేసిన జూట్ కూడా కోత దశలో ఉంది. ఇలా పంటలు ఇంటికి వచ్చే తరుణంలో వరుస తుఫాన్‌లతో వర్షాలు పడుతుండడంతో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు.

వానలతో అలజడి

బల్లికురవ : అల్పపీడన ప్రభావంతో మంగళవారం ఉదయం నుంచి వాతావరణలో మార్పులు వచ్చి వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బల్లికురవ మండలంలోని పలు గ్రామాలలో మొక్కజొన్న, జూట్, వరి పంటలు కోత దశలో ఉన్నాయి. రైతులు పంట నూర్పిళ్లు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. వారం రోజుల నుంచి వాతావరణంలో మార్పులు వచ్చి చెదురు మదురు వర్షాలు పడుతుండడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. మంగళవారం ఉదయం నుంచి పలు గ్రామాలలో ఎడతెరపి లేకుండా చిన్న పాటి వర్షం పడడంతో పంట నూర్పిడి చేస్తున్న రైతులు బెంబేలెత్తి పోతున్నారు. భారీ వర్షాలు పడితే పంట చేతికి రాదని వారు ఆందోళనలో ఉన్నారు. పలు గ్రామాలలో కొందరు రైతులు పంటలను నూర్పిడి చేసి కల్లాల్లో పంటలను ఉంచారు. వాటిని రక్షించుకునేందుకు పట్టలను కప్పి ఉంచారు. ఇప్పుడు వర్షాలు పడితే రైతులకు తీవ్ర నష్టాలు తప్పవు అని పలువురు రైతులు తెలిపారు.

పంటలను పరిశీలించిన అధికారులు


పంటలను పరిశీలిస్తున్న అధికారులు, శాస్త్రవేత్తలు


కలవకూరులో కోతకు వచ్చిన వరి


గుంటుపల్లిలో పంట నూర్పిడి చేసి తడవకుండా పట్టలను కప్పిన రైతులు

చీరాలటౌన్ : అల్పపీడనంతో రెండు రోజులుగా చీరాల పరిధిలోని ఎడతెరిపి లేకుండా చిరుజల్లులు కురుస్తున్నాయి. ఈక్రమంలో వ్యవసాయాధికారులు కోతకు వచ్చిన వరి పంటను మరో నాలుగు రోజులపాటు వాయిదా వేసుకోవాలని సూచించారు. మంగళవారం బాపట్ల ఏరువాక కేంద్ర బృందం శాస్త్రవేత్తలు డా.మురళీధర్ నాయక్, జిల్లా వనరుల కేంద్రం అక్తర్ హుస్సేన్‌లతో కలిసి ఏవో సుమతి తోటవారిపాలెం, వాడరేవు, సాల్మన్ సెంటర్, దేవాంగపురి ప్రాంతాల్లోని వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. గురువారం వరకు వర్షపాతం నమోదయి ఉన్నట్లు చెప్పారు. దీంతోనే రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రక్షణ చర్యలపై జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఆయా ప్రాంతాల వీఏఏలు, రమ్య, బాత్‌షేబా, ప్రసన్న, రమేష్, పశు సవంవర్థక శాఖ సిబ్బంది సాయి కుమార్, అశ్విని, రమేష్, రైతులు పాల్గొన్నారు.

> **కోతలు వాయిదా వేసుకోవాలి**
>
> రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని అద్దంకి వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. 26వ తేదీ వరకు తుఫాన్ ప్రభావం ఉన్నందున రెండురోజుల పాటు వాయిదా వేసుకోవాలన్నారు. పొలాలలో నీరు నిలువ కుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.
>
> - కొర్రపాటి వెంకటకృష్ణ, వ్యవసాయాధికారి, అద్దంకి

అన్నదాతల్లో ముసురు గుబులు

పర్చూరు : ముసురు అన్నదాతల గుండెల్లో గుబులు రేపుతోంది. మరో ప్రక్క భారీ వానల హెచ్చరికల నేపథ్యంలో రైతులు బెంబేలెత్తుతున్నారు. మంగళవారం వేకువ జామునుంచే చిరుజల్లులు కురుస్తుండడంతో రైతులు ఆందోలన చెందుతున్నారు. భారీ వర్షం కురిస్తే వేల ఎకరాల్లో సాగుచేసుకున్న వైట్‌బర్లీ పరిస్థితి ఇబ్బంది కరంగా మారనుంది. భారీ వర్షం కురిస్తే వైట్ బర్లీ ఆకులపై ఉన్న మడ్డికారిపోయి నాణ్యత దెబ్బతింటుందని సాగుదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వైట్‌బర్లీ ఆకుకొట్టే పనులు సాగుతున్నాయి. ఇలాంటి దశలో భారీ వర్షం కురిస్తే తీవ్రంగా నష్టపోవాల్సిన పరస్థితి ఉంది. పర్చూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని పర్చూరు, కారంచేడు, యద్దనపూడి, ఇంకొల్లు మండలాల్లో వైట్ బర్లీ, మిర్చి, శనగ పంటలను రైతులు సాగు చేసుకోగా అందులో అగ్రభాగం రైతులు వైట్ బర్లీ పొగాకును సాగుచేశారు. దక్షిణ కోస్తా, ఆంధ్రా ప్రాంతాల్లో భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు చెప్తుండడంతో రైతులు పాలుపోని పరిస్థితిలో ఉన్నారు.

అధికంగా కురిస్తే నష్టమే

పంగులూరు : ఎడతెరపి లేకుండా పడుతున్న జల్లులు రైతును కలవర పెడుతున్నాయి. వానలు అధికంగా కురిస్తే పంటలకు నష్టమని అధికారులు చెప్తున్నారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పొగాకు, మొక్కజొన్న, శనగ, వరి ఎంతో ఆశా జనకంగా ఉందని రైతులు ఆనందంతో ఉన్నారు. మండలంలోని పలు గ్రామాలలో సుమారు 4 వేల ఎకరాలలో సాగులో ఉన్న పొగాకు సగానికి పైగా ఆకు వలిచే దశలో ఉంది. 3 వేల ఎకరాలలో సాగవుతున్న శనగ మొలక దశ నుంచి 40 రోజుల పైరుగా ఉండగా, మొక్కజొన్న 3,650 ఎకరాలలో సాగు చేస్తున్నట్లు అధికారిక లెక్కలు. 11 వందల ఎకరాలలో వరి సాగులో ఉంది. కంకి ఏర్పడి గింజ పోసుకునే దశలో ఉందని వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి తెలిపారు. చిరు జల్లులతో నష్టం ఉండదని, ఒకవేళ రెండు సెంటీమీటర్లకు మించి పడితే నష్టం తప్పదని అధికారులు చెప్తున్నారు.


పర్చూరు ప్రాంతంలో సాగులో ఉన్న వైట్ బర్లీ పొగాకు


క్రిస్మస్ ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే కొండయ్య

క్రీస్తు శాంతి సందేశం అనుసరణీయం

చీరాల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : క్రీస్తు శాంతి సందేశం సర్వమానవాళికి అనుసరణీయమని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని ఈపురుపాలెం, తోటవారిపాలెం గ్రామాల్లో మంగళవారం స్థానికులు నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే కొండయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రేమ, దయ, త్యాగాలకు ప్రతీకగా క్రీస్తు నిలిచారన్నారు. అనంతరం కేక్‌లను కట్ చేసి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రజలకు మంత్రి గొట్టిపాటి క్రిస్మస్ శుభాకాంక్షలు

అద్దంకి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మానవాళిని సన్మార్గం వైపు నడిపించేలా క్రీస్తు మార్గనిర్దేశం చేశారని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా క్రైస్తవులకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా క్రిస్మస్‌ను ఘనంగా జరుపుకుంటారన్నారు. నిస్సహాయులపై కరుణ, సాటి వారిపై ప్రేమ, క్షమ, సహనం దాతృత్వం, త్యాగం తన జీవితం ద్వారా మానవాళికి ఏసు ప్రభువు అందించిన మహోన్నత సందేశాలన్నారు. క్రిస్మస్‌ను క్రైస్తవులు కుటుంబ సభ్యులతో సంతోషంగా జరుపుకోవాలని మంత్రి రవికుమార్ ఆకాక్షించారు.

పర్చూరు : ప్రేమ, దయ, శాంతికి క్రీస్తు మార్గదర్శి అని ప్రభువు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుకోవాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. మంగళవారం ఆయన ప్రజలందరికీ క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ అందరికీ శాంతి, సౌభాగ్యాలు నింపాలని, సీఎం చంద్రబాబుతోనే క్రిస్టియన్ల సంక్షేమం సాధ్యమన్నారు.

చీరాల : నియోజకవర్గ ప్రజలందరికీ మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ మంగళవారం ప్రకటనలో క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అందరూ సుఖ,సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

సీసీ రోడ్డుపై వ్యర్థాల కుప్పలు

రైతులకు తప్పని తిప్పలు

అద్దంకి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : లక్షల రూపాయల వ్యయం చేసి సీసీ రోడ్డు నిర్మాణం చేస్తే కొందరి స్వార్థంతో సీసీ రోడ్డు అంతా వ్యర్థాల కుప్పలతో నింపే స్తున్నారు. అద్దంకి పట్టణం సమీపంలో దర్శి రోడ్డు నుం చి గుండ్లకమ్మనదిలో ఊటబావులు, నరసింహపురం రెవె న్యూ పరిధిలోని భూములకు వెళ్లేందుకు, ఎస్సీ శ్మశా నవాటిక వరకు ఆరేళ్ల కిందట సీసీ రోడ్డును వేశారు. ఇటీవల కాలంలో అద్దంకి పట్టణంలో పాత ఇళ్ల తొలగింపు, ఖాళీ స్థలాలు చదును చేసే క్రమంలో వచ్చే వ్య ర్థాలను రోడ్డు మార్జిన్‌లలో పడవేస్తున్నారు. ఈ క్రమంలో గుండ్లకమ్మనదిలోకి వెళ్లే సీసీ రోడ్డు పైనే పోస్తుండడంతో రాకపోకలకు కూడా ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడింది. సీసీ రోడ్డు మొత్తం వ్యర్థాల కుప్పలను పోయడంతో కనీసం సీసీ రోడ్డు అనవాళ్లు కూడా కనపించకుం డా పోయాయి. వాహన చోదకులు గత్యంతరం లేక రోడ్డు మార్జిన్‌లో దిగిపోతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్డు, మార్జిన్‌లలో వ్యర్థాలు, చెత్తా చెదారం పోసే ట్రాక్టర్‌ల యజమానులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ రవీంద్ర దృష్టికి తీసుకు పోగా సీసీ రోడ్డుపై ఉన్న వ్యర్థాలను వెంటనే తొలగించేలా చర్యలు చేపడ తామని, వ్యర్థాలను రోడ్లపై పోసే ట్రాక్టర్‌లను గుర్తించి చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.


అద్దంకి-దర్శి రోడ్డు నుంచి గుండ్లకమ్మ ఊటబావులకు వెళ్లే సీసీ రోడ్డుపై ఉన్న వ్యర్థాలు

కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలి

చెరుకూరు(పర్చూరు), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని ఏడీఏ ఎస్.మోహనరావు కోరారు. మంగళవారం మండలంలోని చెరుకూరు గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ వరి సాగు రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధరను కల్పించి దళారీలు, ప్రైవేటు వ్యాపారుల నుంచి నష్టపోకుండా ఉండేదుకు వరి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో ధాన్యాన్ని అమ్ముకొని గిట్టుబాటు ధరలను పొందాలన్నారు. బస్తాకు 75 కేజీలకు ప్రభుత్వం రూ.1740 చొప్పున చెల్లిస్తున్నట్లు తెలిపారు. గన్నీ బ్యాగులు, హమాలీ, రవాణా ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందన్నారు. అమ్మి న ధాన్యానికి 48 గంటల్లోగా రైతు ఖాతాల్లోకి డబ్బులు జమ అవుతాయని ఏడీఏ తెలిపారు. డీసీఎంఎస్ టెక్నికల్ అసిస్టెంట్ మహేష్ మాట్లాడుతూ తేమ శాతం 17లోపు ఉండేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఏవో రామ్మోహన్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు దాసరి ఉషారాణి, పార్టీ నాయకులు, వ్యవసాయ స్పిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


చెరుకూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

ఓటర్ల జాబితాను పరిశీలించిన ఎన్నికల పరిశీలకులు

చీరాలటౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఎలక్షన్ పరిశీలకులు సూర్యకుమారి మంగళవారం చీరాలకు ఆకస్మికంగా వచ్చారు. ఈసందర్భంగా ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు ఆధ్వర్యంలో చీరాల మునిసిపల్ పరిధిలోని గంజిపాలెం సచివాలయంలో సమావేశం నిర్వహించారు. మార్పులు, చేర్పులు, ఇటీవల నమోదైన తొలగింపులకు సంబంధించిన చీరాల నియోజకవర్గ ఒటర్ల జాబితాను పరిశీలించారు. వాటిపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే సంబంధిత రికార్డులను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపీకృష్ణ, వేటపాలెం తహసీల్దార్ పార్వతి, మునిసిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, ఐసీడీసీ ప్రతినిధి ఉమా, బీఎల్‌వోలు, ఆయా కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.


ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకురాలు సూర్యకుమారి

రైతులు అప్రమత్తంగా ఉండాలి

అద్దంకిటౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ఈనెల 26వ తేదీ వరకు ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. మంగళవారం మండలంలోని పేరాయపాలెం, మోదేపల్లి గ్రామాలల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ వరి పంట కోత దశలో ఉన్నందున రైతులు పొలంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. రెండు రోజుల పాటు వరి కోతలు కోయవద్దని తెలిపారు. రబీలో సాగు చేసిన వరికి ఈ నెల 31వ తేదీలోపు పంటల బీమా చేయించుకోవాలని, ఎకరాకు రూ.126 చెల్లించాలన్నారు. బ్యాంక్‌లో రుణం తీసుకున్న రైతులు బ్యాంక్ అధికారులను కలిసి బీ మా చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి ఎస్.దీప్తి, వీఏఏ దుర్గరావు, రైతులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏవో వెంకటకృష్ణ

భూముల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

యద్దనపైడి (మార్టూరు) : రైతులు మూడేళ్లకు ఒకసారి భూసార పరీక్షలు చేయించుకుంటూ భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వ్యవసాయ అధికారి మేరమ్మ అన్నారు. మంగళవారం యద్దనపూడి మండలంలోని యద్దనపూడి, యనమదల గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాలలో మేరమ్మ రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు చౌడు భూములను జిప్సంతో బాగు చేసుకోవాలన్నారు. అవసరం మేరకు ఎరువులను వాడితే భూములు ఆరోగ్యంగా, పంటల ఉత్పత్తులు పెరిగేవిధంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాసరావు, నరేంద్ర, వినయ్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

కత్తెర పురుగు నివారణ చర్యలు చేపట్టండి

పంగులూరు : మొక్కజొన్న పైరుకు ఆశించిన కత్తెర పురుగు నివారణకు రైతులు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని రేణంగివరం, కశ్యాపురం గ్రామాలలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం చేపట్టారు. మొక్కజొన్న, శనగ సాగు చేసిన రైతులు రైతు సేవాకేంద్రాలలో తగిన ధ్రువీకరణ పత్రం తీసుకుని డిసెంబరు 31లోగా మొక్కజొన్నకు ఎకరాకు రూ.105, శనగకు ఎకరాకు 84 రూపాయలు బ్యాంకులలో చెల్లించి పంట బీమాను చేయించాలన్నారు. వరి సాగు చేసిన రైతులు ఎకరాకు రూ.126 మీ సేవాకేంద్రాలలో చెల్లించి పంట భీమా చేయాలని కోరారు. కార్యక్రమంలో మార్కెటింగ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చీరాల : అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న జల్లులు పైర్లకు జీవం పోస్తున్నాయని సాగుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు పడిన జల్లులతో నష్టం కన్నా లాభం అధికంగా ఉంటుందని చెప్తున్నారు. మాగాణి, మెట్ల పైర్లు రెండింటికి ఉపయోగ కంగానే ఉంటుందంటున్నారు.


పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న సంఘ సభ్యులు, భక్తులు

భక్తిశ్రద్ధలతో ఈశ్వరిదేవి ఆరాధన

అద్దంకిటౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణ వి శ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని కాకానిపాలెంలోని శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారి దేవాలయంలో జగన్మాత ఈశ్వరి మహాదేవి అమ్మవారి 235 అరాధన, గురుపూజ మహోత్సవం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితులు బి.రామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఉదయం 6 గంటల నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈశ్వరిదేవి అమ్మవారు బ్రహ్మంగారు రాసిన కాలజ్ఞానాన్ని అత్యధికంగా ప్రచారం చేశారని, దాని ద్వారా సామాజిక రుగ్మతలను రూపుమాపుటకు ఎంతగానో కృషి చేశారని, అమ్మవారు కూడా సజీవ సమాధి అయ్యారని ఈ సందర్భంగా భక్తులకు తెలియజేశారు. తదుపరి భక్తులకు పులిహోర పొంగలిని ప్రసాదంగా అందించారు. కార్యక్రమంలో సంఘ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసచారి, పట్టణ అధ్యక్షుడు పొన్నపల్లి బ్రహ్మానందం, బీజేపీ నాయకుడు ఉండవల్లి కృష్ణారావు, రవికుమార్, వీ రబ్రహ్మచారి, శ్రీనివాసచారి, అంజనేయరాజు, రమేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వక్తృత్వ పోటీలో పంగులూరు విద్యార్థికి తృతీయ స్థానం


జాన్‌బాబు

పంగులూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి వక్తృత్వ పోటీలో కొండమంజులూరు ఉన్నత పాఠశాల విద్యార్థి కప్పెర జాన్‌బాబు తృతీయ బహుమతిని కైవసం చేసుకున్నాడు. 24వ తేదీన విజయవాడ నందిని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన రాష్ట్ర స్థాయి వక్తృత్వ పోటీలో కప్పెర జాన్‌బాబు పాల్గొన్నాడు. వినియోగదారుల వ్యవహారాలు, ఆహార పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో వినియోగదారు న్యాయపాలనకు వర్చువల్ విచారణ, డిజిటల్ సౌలభ్యం అనే అంశంపై మంగళవారం విజయవాడలో రాష్ట్ర స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో పాల్గొన్న కొండమంజులూరు ఉన్నత పాఠశాల తొమ్మిదవ తరగతి విద్యార్థి కప్పెర జాన్‌బాబు మూడవ స్థానం దక్కించుకుని ఆశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా మెడల్‌తో పాటు రూ.3వేల నగదు బహుమతిని అందుకున్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన జాన్‌బాబును జిల్లా విద్యాధికారి పురుషోత్తం, సైన్స్ అధికారి సాదిక్‌లు అభినందించారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ప్రతిభ చాటి పాఠశాలకు పేరుతెచ్చిన జాన్‌బాబు, పవన్‌కృష్ణను మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ గోలి సంధ్యారాణి, హెచ్ఎం అణిత, గ్రామ పెద్దలు చింతల సహదేవుడు, విద్యాదాత బొప్పుడి నాగేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

నిరుద్యోగ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడిగా నరేంద్ర


కుమార్

పంగులూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నవ్యాంధ్రప్రదేశ్ అద్దంకి నియోజకవర్గ అధ్యక్షుడిగా ముప్పవరం గ్రామానికి చెందిన దుడ్డు నరేంద్ర నియమితులయ్యారు. నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.కుమార్ నరేంద్రను నియమిస్తూ నియామకపత్రం అందచేశారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయ, బోధనేతర సిబ్బంది సమస్యల పరిష్కారానికి, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసేందుకు సంఘం కృషి చేస్తుందని నరేంద్ర తెలిపారు.

కనక నాగవరపమ్మ అమ్మవారి హుండీల లెక్కింపు

వేటపాలెం(చీరాల), డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని శ్రీ కనక నాగవరపమ్మ అమ్మవారి హుండీలో ఈ ఏడాది జూన్ 22 నుంచి డిసెంబరు 24వ తేదీ వరకు వచ్చిన హుండీల ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వేణుగోపాలరావు పర్యవేక్షణలో జరిగి లెక్కింపులో హుండీ ఆదాయం రూ.2,04,269 వచ్చినట్లు ఆలయ ఈవో పోతిని శ్రీనివాసరావు తెలిపారు. లెక్కింపులో సంతరావూరు గ్రామస్థులు ఏ.సురేష్, జి. సుబ్బారావు, చప్పిడివారిపాలెం గ్రామస్థులు సీహెచ్ వెంకట్రావు సిబ్బంది పాల్గొన్నారు.

సారా తయారు చేస్తే కఠిన చర్యలు

ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు

చీరాలటౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సారా తాయారీని నిలిపివేయకుంటే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో చీరాల పరిధిలోని రామనగర్ ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా సారా తయారీ స్థావరాన్ని గుర్తించి తయారీకు సిద్ధం గా ఉంచిన 400 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేశారు. ఘటనపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సారా తయారు చేస్తే చర్యలు తప్పవన్నారు. అతనివెంట ఎక్సైజ్, ప్రొహిబిషన్ సిబ్బంది ఉన్నారు.

భగవద్గీత గ్రంథాలతో ప్రచారం

యద్దనపూడి (మార్టూరు), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలం సూరవరపుపల్లి గ్రామంలో మంగళవారం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక నరసరావుపేట కమిటీ సభ్యులు భగవద్గీత గ్రంథాలతో ప్రచారం నిర్వహించారు. కమిటీ సభ్యులు ముఖ్యంగా మహిళలు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. అనంతరం అనంతవరం, వింజనంపాడు గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఘడియం పెద్దిరెడ్డి, రమేష్, భాస్కర్, వెంకటేశ్వర్లు, అశోక్, పలువురు మహిళలు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కరెంట్ స్తంభం

మార్టూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కరెంటు స్తంభం ప్రమాదకరంగా ఉంది. దాని కింది భాగంలో సిమెంటు పూర్తిగా మాయమై లోపలి ఇనుప చువ్వలు బయటపడి ఉండడంతో స్థానికులు భయపడుతున్నారు. మార్టూరులో జడ్‌పీ హైస్కూల్ పక్కన సిమెంట్ రోడ్డులో మురుగుకాల్వలో ఉన్న విద్యుత్ స్తంభం పరిస్థితి ఇది. వాస్తవంగా ఈ రోడ్డులో రోజూ 20 స్కూల్ బస్సులు నడుస్తుంటాయి. నాలుగు ప్రైవేటు స్కూళ్లు ఉండడంతో వాటికి చెందిన స్కూల్ బస్సులు రోజూ ఈ రోడ్డులోనే రాకపోకలు సాగిస్తుంటాయి. మురుగు కాల్వలో ఉన్న కరెంటు స్తంభం అడుగు భాగం తుప్పు పట్టింది. అది ఏక్షణమైనా విరిగిపడే అవకాశం ఉంది. ప్రమాదవశాత్తు స్తంభం పడే క్షణంలో స్కూల్ బస్సులు వెళ్తే ఏం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇదిలావుండగా సమీప ఇళ్లల్లో విద్యుత్ సమస్య ఏర్పడితే ఈ స్తంభంపైకి ఎక్కి మరమ్మతులు చేయాలంటే సిబ్బంది భయపడుతున్నారు. ఈ స్తంభంతో ఎవరికీ ప్రమాదం జరుగకుండా ఉండేందుకు వెంటనే పంచాయతీ, విద్యుత్ శాఖ అధికారులు స్పందించి స్తంభాన్ని తొలగించి కొత్తదాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డు పక్కనే శిథిలావస్థలో ఉన్న స్తంభం

ఎరువుల సమస్యలా...?

కాల్ సెంటర్‌కు ఫోన్ చేయండి

నెల్లూరు(వ్యవసాయం), డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతులు ఎరువుల కోసం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ ఆనంద్ ఆదేశాలతో జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో కాల్‌సెంటరును ఏర్పాటు చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి పీ సత్య వాణి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎరువుల దుకాణాల్లోనూ, సొసైటీల్లోనూ యూరియాను నిర్ణయించిన ధర కంటే ఎక్కువకు అమ్ముతున్నా, అలాగే నిల్వలు ఉండి పంపిణీ చేయకపోయినా కాల్ సెంటర్ నంబర్లు 83310 57182, 83310 57218, 83310 57184, 83310 58204, 83310 57258లకు ఫిర్యాదు చేయాలని ఆమె పేర్కొన్నారు.

2024.. జిల్లా రాజకీయాలపై చెరగని ముద్ర వేసింది. కొత్త ముఖాలను రాజకీయ అందలం ఎక్కించింది. రాజకీయ వలసలను ప్రోత్సహించింది. ఐదేళ్లపాటు అధికారం చలాయించిన నాయకులను అడ్రస్ లేకుండా చేసింది. రాజకీయ భవిష్యత్తు కోసం సైకిల్ ఎక్కిన వారికి పదవులను అదించింది. ఇద్దరికి అమాత్య యోగం కల్పించింది. నమ్మిన పార్టీ కోసం శ్రమించిన నాయకులను నామినేటెడ్ పదవులతో సత్కరించింది. విలువలకు తిలోదకాలిచ్చి గతంలో ఎప్పుడూ లేని విధంగా పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించింది. అధికారం తమ శాశ్వత హక్కుగా భావించి రాచరికాన్ని తలపించేలా పాలన సాగించిన వైసీపీ నాయకుల జాతకాలను తలకిందులు చేసింది. సంపూర్ణ ఆధిక్యంతో నవశకానికి నాంది పలికింది.



అటు.. ఇటుగా అధికారం

- నేతల గతులు మార్చిన ఏడాది

- కొత్త ముఖాలకు రాజకీయం అందలం
- నామినేటెడ్ పదవుల్లో పలువురికి సముచిత స్థానం
- వైసీపీ నేతలకు కోలుకోలేని దెబ్బ

తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమికి (ఎన్డీఏ) రాజకీయంగా 2024 కొత్త జీవం పోసింది. కందుకూరు సహా ఉమ్మడి నెల్లూరు జిల్లా చరిత్రలో తొలిసారిగా పదికి పది అసెంబ్లీ, ఒక ఎంపీ స్థానాన్ని కూటమి గెలుచుకుంది. కాంగ్రెస్, ఆ తరువాత వైసీపీకి కంచుకోట లాంటి జిల్లాలో తెలుగుదేశం పార్టీ అన్ని స్థానాలను గెలుచుకోవడం సరికొత్త రికార్డుగా నిలిచింది.

కొత్త ముఖాలకు రాజకీయ యోగం

కేవలం రెండు మూడు కుటుంబాలు రాజకీయాలను శాసించే జిల్లాలో తొలిసారిగా కొత్త ముఖాలకు అందలం దక్కింది. కందుకూరు నుంచి ఇంటూరి నాగేశ్వరరావు, ఉదయగిరి నుంచి కాకర్ల సురేష్, కావలి నుంచి దగుమాటి వెంకటకృష్ణారెడ్డి (కావ్య కృష్ణరెడ్డి), కోవూరు నుంచి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు తొలిసారిగా అసెంబ్లీకి పోటీ చేసి గెలుపొందారు. వ్యాపారులుగా పారిశ్రామికవేత్తలుగా స్థిర పడిన వీరు రాజకీయ తెర పైకి రావడం, ఎమ్మెల్యేలు కావడం విశేషం. జిల్లాలో మొత్తం 8 అసెంబ్లీ స్థానాలు ఉండగా అందులో నలుగురు తొలిసారిగా అసెంబ్లీ ఎన్నికల బరిలో దిగి విజయం సాధించిన వారే. ఇక నెల్లూరు ఎంపీగా గెలిచిన వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి సైతం ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ పడటం ఇదే తొలిసారి. మొత్తమ్మీద అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో గెలిచిన దాదాపు 50 శాతం మందికి ఈ ఏడాది రాజకీయంగా కొత్త జీవితం ప్రసాదించింది.

ఇద్దరికి అమాత్యయోగం

ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో తొలి క్యాబినెట్‌లో జిల్లాలో ఇద్దరికి అవకాశం లభించడం ఒక విశేషంగానే చెప్పుకోవాలి. నెల్లూరు నగర ఎమ్మెల్యే పొంగూరు నారాయణ రాష్ట్ర పురపాలక శాఖ మంత్రిగా, ఆత్మకూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రిగా కొలువుదీరారు.

విధేయులకు పట్టం

నామినేటెడ్ పదవుల్లో సైతం జిల్లాకు సముచిత స్థానం దక్కింది. పార్టీ కోసం ఎమ్మెల్యే టికెట్లు త్యాగం చేసిన అబ్దుల్ అజీజ్‌కు రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ పదవి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి నుడా చైర్మన్, పోలంరెడ్డి దినేష్‌రెడ్డికి రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ పదవి దక్కింది. అలాగే టీడీపీ నేతలు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డికి సివిల్‌సప్లయ్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా, ఆనం వెంకటరమణారెడ్డికి ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ బోర్డు కో-వైస్‌చైర్మన్‌గా, జనసేన పార్టీ జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్‌కుమార్‌కు రాష్ట్ర టిడ్కో చైర్మన్‌గా, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డికి ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ పదవి దక్కింది. తొలివిడత నామినేటెడ్ పదవుల కేటాయింపులోనే నెల్లూరు జిల్లాకు చెందిన ఏడుగురు నాయకులకు గుర్తింపు కలిగిన కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లుగా అవకాశం కల్పించడం జిల్లా చరిత్రలో తొలిసారి కావడం విశేషం.



అజయ్‌కుమార్



సురేష్‌రెడ్డి

జనసేన, బీజేపీలకు కొత్త జీవం

2024వ సంవత్సరం నెల్లూరు జిల్లా పరిధిలో జనసేన, బీజేపీలకు కొత్త జీవం పోసింది. అంతకముందు జిల్లాలో ఈ రెండు పార్టీల ప్రభావం చాలా తక్కువనే చెప్పాలి. జనసేన పార్టీకి క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణమే లేకపోయినా, ప్రజా క్షేత్రంలో బీజేపీకి అంతంత మాత్రంగానే ఉన్నా, తెలుగుదేశం పార్టీలో జట్టు కట్టడం జిల్లా పరిధిలో ఆ పార్టీలకు బాగా కలిసొచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జిల్లా పరిధిలోనూ ఈ రెండు పార్టీలకు ప్రజల్లో, అధికార యంత్రాంగంలో గుర్తింపు పెరిగింది. రాజకీయ కార్యక్రమాలకే కాకుండా నామినేటెడ్ పదవుల్లోనూ ఈ పార్టీల నాయకులకు భాగస్వామ్యం లభించింది. తొలివిడత నామినేటెడ్ పోస్టుల కేటాయింపులో జనసేన, బీజేపీ నాయకులకు కీలకమైన టిడ్కో, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పదవులు దక్కాయి. చివరికి సాగునీటి సంఘ ఎన్నికల్లోనూ ఆ పార్టీల నేతలకు 10 శాతం సీట్లు కేటాయించారు.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

అడ్రస్ లేని వైసీపీ

కూటమి పార్టీలకు 2024 తీపిని పంచితే ఐదేళ్లపాటు అధికారం చెలాయించిన వైసీపీకి మాత్రం చేదును కాదు ఏకంగా గరళాన్నే పంచిపెట్టింది. అధికారం తమ శాశ్వత హక్కుగా భావించి రాజరికాన్ని తలపించేలా పాలన చేసిన వైసీపీ నాయకులను అడ్రస్ లేకుండా చేసింది. కావలిని సామ్రాజ్యంగా భావించి విపక్షాలపై విరుచుకుపడి, పలువురు బలవన్మరణాలకు కారకుడిగా ఆరోపణలు మోసిన రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డిని కావలి ప్రజలు దారుణంగా దెబ్బతీశారు. ఈ ఓటమి భారాన్ని తట్టుకోలేక ఆయన ప్రస్తుతం అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. అయినదానికి కానిదానికి తొడలు చరిచి మీసం మెలేసిన మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ పక్కరాష్ట్రంలో విశ్రాంతి తీసుకొంటున్నారు. అంతే స్థాయిలో చెలరేగిపోయిన నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి హైదరాబాద్‌కు చేరిపోయారు. ఇక ఆత్మకూరులో మేకపాటి కుటుంబానికీ పరాభవం తప్పలేదు. దేశం అంతటికి ఒక రాజ్యాంగం అయితే సర్వేపల్లికి మాత్రం ప్రత్యేక రాజ్యాంగంగా అధికారం చెలాయించిన కాకాణి గోవర్ధన్‌రెడ్డికి ఘోర పరాజయం అనివార్యం అయ్యింది. జగన్ తరువాత జగన్ అంతటివాడిగా (నెం.2) చెలామణి అయిన విజయసాయిరెడ్డినీ జిల్లావాసులు కోలుకోలేని దెబ్బతీశారు. కూటమి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డికి భారీ మెజారిటీ ఇచ్చి విజయసాయి ఇమేజ్‌కి సున్నాచుట్టారు. మొదటి ఆరు నెలల్లో జిల్లా అంతా తమదే అన్నట్లు ధీమాగా కనిపించిన వైసీపీ నాయకులు ఏడాది ముగిసే సరికి ప్రజలకు కనిపించకుండా అజ్ఞాతంలోకి వెళ్లిపోయేలా చేయడం 2024వ సంవత్సరం ప్రత్యేకత.



‘ఉపాధి’కి ప్రత్యేక ప్రణాళిక..

15 శాతం వృద్ధిరేటు

- ఆ లక్ష్యంతోనే పని చేస్తున్నాం
- ఇక సాగులో రైతులకు ఇబ్బందులు రానీయం
- కలెక్టర్ ఆనంద్ వెల్లడి



ఉపాధి హామీ పథకం అమలు పై ప్రత్యేక ప్రణాళిక రూపొందించు కొని ముందుకెళుతున్నాం. పేదలకు ఉపాధి అవకాశాలు మెరుగు పరచడంతోపాటు తద్వారా మెటీరి యల్ కాంపోనెంట్‌ను జనరేట్ చేస్తున్నాం. ఈ కాంపోనెంట్‌తో గ్రామాల్లో విస్తృతంగా సీసీ రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నాం. ఇక స్వర్ణాంధ్ర విజన్ 2047ను రూపొం దించుకున్నాం. దానిని పక్కాగా అమలు చేసి 2029లోపు 15 శాతం వృద్ధిరేటు సాధించే విధంగా చర్యలు చేపట్టాం.’ అని కలెక్టర్ ఓ ఆనంద్ వివరించారు. ‘ఈ ఏడాది పూర్తి ఆయక ట్టులో పంటల సాగు జరుగుతోంది. ప్రాజెక్టుల్లో నీరు పుష్కలంగా ఉండటంతో చివరి ఎకరా వరకూ నీరు అందిస్తున్నాం. ఎక్కడా రైతులకు ఇబ్బందులు రానీయం. అనధికారికంగా యూరియాను నిల్వ చేస్తున్న వ్యాపారులపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. ఎరువుల దుకాణాల్లో తనిఖీలకు వివిధ శాఖలతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తున్నాం.’ అని వెల్లడించారు. జిల్లా అభివృద్ధికి చేపట్టిన పలు ప్రణాళికలు, వాటి అమలుకు తీసుకుం టున్న చర్యలను కలెక్టర్ ‘ఆంధ్రజ్యోతి’కి వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

- వివరాలు 6లో

ఈ ఏడాది ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

సమానత్వమే క్రీస్తుతత్వం!

- నేడు క్రిస్మస్
- జిల్లా అంతటా వేడుకలు
- ముస్తాబయిన ప్రార్థనామందిరాలు

శాంతిని, సమానత్వాన్ని చాటిన ప్రేమమూర్తి క్రీస్తు పుట్టినరోజు సంబరాలకు సర్వం సిద్ధమైంది. బుధవారం జిల్లా అంతటా క్రిస్మస్ వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే కొన్ని రోజులుగా క్యారల్స్‌తో ఏసు బోధనలు ప్రచారం చేస్తున్న క్రైస్తవులు మంగళవారం ప్రార్థనల్లో గడిపారు. అర్ధరాత్రి బాల ఏసుకు ఆహ్వానం పలుకుతూ సంబరాలు జరుపుకున్నారు. క్రిస్మస్ కోసం అన్ని చర్చిలు, ప్రార్థనా మందిరాలను శోభాయమానంగా తీర్చిదిద్దారు.



బాలయేసును చూపుతున్న బిషప్ ఎండీ ప్రకాశం

అంబరాన్నంటిన సంబరం

నగరంలోని బిషప్ హౌస్‌లో మంగళవారం అర్ధరాత్రి క్రిస్మస్ వేడుకలు అంబరాన్ని అంటాయి. ఈ సంబరాలలో బిషప్ హౌస్‌లో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. చర్చి పాదర్‌లు బైబిల్ చదువు తుండగా, సువార్త గాయకులు క్రీసు నామస్మరణలను వీనులవిందుగా ఆలపించడంతో భక్తులు మైమరిచిపోయారు. క్రీస్తు జనన సమయం లో జరిగిన ఆనాటి ఘటనలను గుర్తు చేస్తూ ఈ వేడు కలు జరిగాయి. అర్ధ రాత్రి సమయంలో బాల యేసు జనన ఘట్టం విశేషంగా ఆకట్టు కుంది. భక్తులకు బాల ఏసును చూపిం చి దైవ కన్యక లుగా ఉన్న యువతు లతో కలిసి ఆ ప్రాంగ ణంలో ఊరేగింపుగా తీసుకు వచ్చి పశువుల పాకలో ఉంచి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం బిషప్ ఎండీ ప్రకాశం మాట్లాడుతూ క్రీస్తు ప్రభువు శాంతి లోకకల్యాణం కోసం శిలువపై తన రక్తధారలు కురిపించిన మహనీయుడని తెలిపారు. క్రీస్తు చూపిన ప్రేమ, దయ, పరోపకారం, శాంతి, సామరస్యాలతో భారతదేశం, ప్రపంచం వర్ధిల్లా లని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీల నాయకులు, నగర ప్రముఖులు పాల్గొని క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.



- వివరాలు 6లో

‘కాకాణి’ అనుచరుడికి

రిమాండ్

- జైలుకు వెంకటశేషయ్య తరలింపు

వెంకటాచలం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగం ఆశ చూపి ఓ మహిళపై లైంగికదాడి కేసులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ముఖ్య అనుచరుడు, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్యకు న్యాయస్థానం 14 రోజుల పాటు రిమాండ్ విధించింది. వెంకటాచలం పంచాయతీ దొడ్డరాజుపాలెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి విద్యుత్ శాఖలో లైన్‌మన్‌గా పనిచేస్తూ కుటుంబ కలహాల నేపథ్యంలో 2021లో ఆత్మహత్య చేసుకున్నాడు. తన భర్త ఉద్యోగం తనకు ఇప్పిస్తానంటూ ఆశ చూపించి, తనపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు బాధితురాలి ఫిర్యాదు మేరకు వెంకటశేషయ్యను పోలీసులు సోమవారం అరెస్టు చేసిన విషయం తెలిసిందే. రాత్రంతా నెల్లూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో గడిపిన వెంకట శేషయ్యకు మంగళవారం ఉదయాన్నే వైద్యులతో వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం న్యాయమూర్తి ఎదుట ఆయన్ను హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించారు. దీంతో పోలీసులు వెంకటశేషయ్యను జైలుకు తరలించారు. అయితే ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎంతో ఉత్కంఠ నెలకొంది. వెంకటాచలం పంచాయతీలో ఉన్న బాధితురాలి అత్తమామ ఇంట్లో పోలీసులు సోదాలు నిర్వహించి కేసుకు సంబంధించిన పలు ధ్రువీకరణ పత్రాలను స్వాధీనం చేసుకుని న్యాయమూర్తి ఎదుట ఉంచారు. న్యాయస్థానంలో ఎంతో ఉత్కంఠభరితంగా వాదనలు జరగ్గా న్యాయమూర్తి జనవరి 6వ తేదీ వరకు రిమాండ్ విధించారు. వాదనలు జరిగే వరకు కోర్టు ప్రాంగణంలోనే వైసీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఉన్నారు.

ఉన్నతాధికారులు రాని

సమావేశాలు ఎందుకు!?

- ఇలాగైతే సమస్యలు పరిష్కారం అవుతాయా!?
- జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో సభ్యుల ఆగ్రహం

నెల్లూరు (జడ్పీ), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ స్టాండింగ్ సమావేశాలకు ఉన్నతాధికారుల రాకపోతే సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని, ఇక సమావేశాలు నిర్వహించడం దేనికని జడ్పీ స్టాండింగ్ కమిటీ సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం నగరంలోని జడ్పీ కార్యాలయంలో జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఆరు జడ్పీ స్థాయీ సమావేశాలు నిర్వహించి ఇరిగేషన్, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్య, ఆరోగ్యం, స్త్రీ శిశు సంక్షేమం, సాంఘిక సంక్షేమ శాఖలపై సభ్యులు సమీక్షించారు. ఇరిగేషన్, వ్యవసాయ, మత్స్య తదితర శాఖల ఉన్నతాధికారులు సమావేశానికి హాజరు కాకపోవటంపై సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులే రాకపోతే సమావేశాలు నిర్వహించి ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. కోర్టు విధుల కోసం తమ ఉన్నతాధికారులు వెళ్లారని ఆయా శాఖల అధికారులు వివరణ ఇచ్చుకున్నారు.

‘ఇరిగేషన్’ తీరు బాగోలేదు!

ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఇరిగేషన్ అధికారుల తీరు దారుణంగా ఉందని దుయ్యబట్టారు. నగరంలోని జాఫర్‌సాహేబ్ కాలువ పక్కన వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తే దానిపై దుకాణాలు పెడుతున్నారని దీనిపై తాను ఇరిగేషన్ శాఖాధికారులను ప్రశ్నిస్తే సమాధానం రాలేదన్నారు. దీంతో ఆ శాఖ ఈఈ అక్కడ నుంచి ఎస్ఈకి ఫోన్ చేసి ఎమ్మెల్సీతో మాట్లాడించారు. దుకాణాల ఏర్పాటుపై పూర్తి నివేదికను ఈ వారంలోనే అందిస్తామని ఎమ్మెల్సీకి తెలిపారు.

రోడ్లు బాగు చేయించండి

జడ్పీటీసీ సభ్యులు మల్లు సుధాకర్‌రెడ్డి, గనపం బాలకృష్ణారెడ్డి, వెంకట్రావు, రాఘవులు తదితరులు మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని వాటి మరమతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. దీనిపై పంచాయతీ రాజ్ ఎస్ఈ అశోక్ కుమార్ మాట్లాడుతూ పల్లెపండుగ ద్వారా రూ.70 కోట్ల పనులు జరుగుతున్నాయని, వర్షాల వల్ల పనుల్లో ఆలస్యం జరుగుతోందన్నారు. జనవరి కల్లా అన్ని పనులు పూర్తి చేసే లక్ష్యంతో ఉన్నట్లు చెప్పారు. అలాగే పాఠశాల్లో ఉన్న ఆర్వో ప్లాంట్లు సక్రమంగా పనిచేయడం లేదని పలువురు జడ్పీ సభ్యులు తెలపటంతో చైర్‌పర్సన్ అరుణమ్మ మాట్లాడుతూ ఆర్వోప్లాంట్ల నిర్వహణకు అధిక ప్రాధన్యత ఇవ్వాలని సూచించారు. అలాగే చిన్న చెరుకూరు జడ్పీ పాఠశాల్లో నూతన ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలన్నారు.




జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్ అరుణమ్మ, సీఈవో విద్యారమ, ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి తదితరులు

బిల్లులు మంజూరు చేయండి

కావలి జడ్పీటీసీ సభ్యుడు రాఘవులు మాట్లాడుతూ గతంలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లీనిక్ భవనాలు నిర్మించగా, వాటి బిల్లులు మంజూరు చేయలేదన్నారు. దీనిపై పంచాయతీ రాజ్ ఎస్ఈ వివరణ ఇస్తూ ఎంబుక్‌లను అప్‌లోడ్ చేయించి బిల్లులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మర్రిపాడు జడ్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ సోమశిల ఉత్తర కాలువ పనులకు సంబంధించి రైతులకు నష్ట పరిహారం ఇప్పటివరకు చెల్లించ లేదని, అలాగే పశువుల డాక్టర్ల పోస్టుల భర్తీలో మెట్ట ప్రాంతాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే జయశ్రీ, జడ్పీ సీఈవో విద్యారమ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

‘విజయదీపిక’ ఆవిష్కరణ

జిల్లాలోని జడ్పీ పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులకు ప్రతి ఏడాది అందిస్తున్న విజయదీపిక స్టడీ మేటిరియల్‌ను జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యాసంవత్సరంలో 15,597 మంది విద్యార్థులు టెన్త్ పరీక్ష రాయనున్నారని, వారంతా మంచి ఫలితాలు సాధించేందుకే ఈ స్టడీ మెటీరియల్ అందిస్తున్నట్లు చెప్పారు.



విద్యుద్దీప వెలుగుల్లో శాంతాక్లాజ్


నెల్లూరు : బిషప్ చర్చిలో విద్యుత్ అలంకరణ

- నేడు క్రిస్మస్
- జిల్లా అంతటా వేడుకలు
- ముస్తాబయిన ప్రార్థనామందిరాలు

సమానత్వమే క్రీస్తుతత్వం!





దివిలో మహిమాన్వితం.. భువిలో ఆనంద భరితం కలిగించేలా క్రైస్తవులకు కాంతి - శాంతి ప్రసాదించిన మంగళస్వరూపుడైన బాలయేసు పుట్టిన రోజే క్రిస్మస్. ఈ పండుగను సప్తపండుగల సమ్మేళనంగా క్రైస్తవులు జరుపుకొంటారు. వేల సంవత్సరాలుగా ఆ మహనీయుని బోధనలు మానవాళికి సన్మార్గం చూపుతున్నాయి. పాపు భారం మోసేందుకు పశువుల పాకలో ఆయన జన్మించిన రోజును ఏటా క్రైస్తవులు క్రిస్మస్ పర్వదినంగా జరుపుకుంటారు. ప్రతి ఇల్లు, చర్చిలపై స్టార్స్‌ను ఏర్పాటు చేసి క్రీస్తు రాకకు ఆహ్వానం పలికారు. జిల్లాలో దాదాపు 4వేలకుపైగా చర్చిలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. లోక రక్షకుడు భూమిపై దేవుని కుమారుడిగా అవతరించిన నాటి సంఘటనలను క్రైస్తవ సోదరులు స్మరించుకుంటూ వివిధ కార్యక్రమాలు, క్యారల్స్, సువార్త గీతాలు, బైబిల్ అధ్యయనం, నాటకాలు వంటి కార్యక్రమాలలో క్రైస్తవ కుటుంబాలు పాల్గొన్నాయి. నగరంలోని బిషప్ హౌస్‌లోని రోమన్‌కాథలిక్ చర్చి, తెలుగు బాప్టిస్టు చర్చి, లోన్‌స్టార్ చర్చి, డౌనీహాల్, లండన్ చర్చిలతోపాటు అన్ని ప్రార్థనా మందిరాలు విద్యుద్దీపాలతో శోభిల్లుతున్నాయి. పేదల సంతోషం కోసం అన్నదానాలు, వస్త్రదానాలు చేయనున్నారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

దేశం అభివృద్ధి పథంలో నడవాలి



క్రీస్తు ప్రబోధించిన శాంతి, క్షమ, పరోపకారం సేవలతో జిల్లా ప్రజలతా కలిసిమెలసి ఉండాలి. ఒకరినొకరు స్నేహభావంతో సహకరించుకోవాలి. క్రీస్తు దయతో దేశం పాడి పంటలు, శాంతిసౌభాగ్యాలతో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని నిరంతరం క్రైస్తవులు క్రీస్తును ప్రార్థిస్తున్నారు. అందరికీ క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు.

- నెల్లూరు బిషప్ డాక్టర్ ఎం.డి.ప్రకాశం

నక్షత్రం.. ఓ సందేశం!

ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్.. క్రైస్తవులకు ఒక ముఖ్యమైన పర్వదినం. ఆ పర్వదినాన్ని పురస్కరించుకుని క్రైస్తవుల ఇంట విద్యుత్ వెలుగులతో పాటు ఒక నక్షత్రాన్ని తప్పనిసరిగా ఏర్పాటు చేస్తుంటారు. దేవుడు, మనుషులకు మధ్య ఉన్న సంబంధాన్ని నక్షత్రం తెలియజేస్తుందని వారి ప్రగాఢ విశ్వాసం. నక్షత్రంలో రెండు త్రిభుజాలు ఉంటాయి. పైకి ఉండే త్రిభుజం దేవుడిని, కిందకు ఉండే నక్షత్రం మానవుడిని సూచిస్తుంది. ఈ రెండు త్రిభుజాలు కలిగిన నక్షత్రం వారి నడుమ ఉన్న సంబంధాలకు సంకేతమని క్రైస్తవుల ప్రగాఢ విశ్వాసం. నక్షత్రాల ఆరు మూలలను గమనిస్తే ఇందులో కనిపించే ప్రతి మూలం ఒక విషయాన్ని తెలియజేస్తుందని క్రైస్తవులు చెబుతున్నారు. పైమూల దేవుడిగా, రెండోది సృష్టిగా, మూడోది ప్రత్యక్షతగా, నాల్గవది విమోచనగా, ఐదవది ఇశ్రాయేలుగా, ఆరవది అన్యులుగా తెలియజేస్తుందని పేర్కొంటున్నారు. దేవుడు మానవాళి కోసం లోకానికి వచ్చారని, ప్రత్యక్షంగా వారి పాపాలను విమోచన కల్పించేదని, ఇశ్రయేలుకు, అన్యులకు రక్షణ కల్పించాడని వారి నమ్మకం. నక్షత్రంలో ఉండే 12 గీతాలు 12 ఇశ్రాయేలుల గోత్రాలను తెలియజేస్తుందని క్రైస్తవులు చెబుతున్నారు. జిల్లాలోని క్రైస్తవులు నక్షత్రాలను కొనుగోలు చేసి ఏటా క్రిస్మస్ రోజున ఇంటి ఆవరణలో సర్వాంగ సుందరంగా అలంకరించుకుంటారు. ఇంటి ఆవరణలు, ప్రార్థన మందిరాల్లో ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీలకు కూడా ఈ నక్షత్రాలను అలంకరించడం ఆనవాయితీ.



టీడీపీ కార్యాలయంలోనూ సంబరాలు

నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం క్రిస్మస్ ముందస్తు సంబరాలు నిర్వహించారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ అజీజ్ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి అందరికీ పంచారు. దేవుడిని అనుసరిస్తే అంధకారం నుంచి బయటపడతామని అన్ని మత గ్రంథాలు చెబుతున్నాయని అన్నారు. ఊరందూరు సురేంద్రబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చిన్నారుల నృత్యాలు, దేవుని పాటలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, డేవిడ్ పాస్టర్, నాయకులు పీఎల్‌రావు, మామిడాల మధు, పెంచల నాయుడు, సాబీర్‌ఖాన్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 60 మంది పాస్టర్లకు క్రిస్మస్ కానుకగా డిన్నర్ సెట్లను బహూకరించారు.


క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న అబ్దుల్ అజీజ్, నాయకులు తదితరులు

మంత్రి, ఎంపీ, కలెక్టర్ శుభాకాంక్షలు


రాష్ట్ర, జిల్లా ప్రజలకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రీస్తు జీవనం అందరికీ ఆదర్శప్రాయమని, ఆ కరుణామయుని ఆశీస్సులు, దీవెనలు ప్రజలకు ఉండాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలు, టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలకు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఓ ప్రకటనలో క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. కష్టంలోనే విజ్ఞానం వికసిస్తుందన్న సందేశాన్ని ఇచ్చి క్రీస్తు అందరినీ సన్మార్గం వైపు నడిపించారని తెలిపారు. కాగా, జిల్లా ప్రజలకు కలెక్టర్ ఓ ఆనంద్, జాయింట్ కలెక్టర్ కే కార్తీక్, ఎస్పీ జీ. కృష్ణకాంత్ వేర్వేరుగా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్‌ను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.



నెల్లూరులో 'రత్నం' విద్యార్థుల వేషధారణ

ఉదయగిరిలో 139 ఏళ్లనాటి చర్చి

ఉదయగిరి (ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ పాలనకు చిహ్నంగా.. ఎందరో విశ్వాసులకు ప్రార్థనా నిలయంగానూ.. ప్రార్థించిన విశ్వాసుల హృదయాలకు శాంతి, కరుణ, జాలి అందించే కేంద్రంగానూ భాసిల్లుతోంది.. ఉదయగిరిలోని బర్డిట్ మెమోరియల్ బాప్టిస్టు చర్చి. ఈ ప్రాంతంలోకెల్లా ఇదే పెద్ద చర్చి కావడంతో వందల సంఖ్యలో భక్తులు వస్తారు. ఉదయగిరి గ్రామంగా రూపుదిద్దుకుంటున్న రోజుల్లోనే వంద ఎకరాల విశాల ప్రాంగణంలో బ్రిటీష్‌వారు ఈ చర్చిని నిర్మించారు. ఉదయగిరిలో ఇటీవల పలు చర్చిలు నిర్మించినా పురాతన చర్చి కావడంతో ఇక్కడ జరిగే క్రిస్మస్ వేడుకలకు భక్తులు అధికసంఖ్యలో హాజరవుతారు.


బర్డిట్ దొర నిర్మించిన చర్చి

● ఘన చరిత్ర

బర్డిట్ మెమోరియల్ బాప్టిస్టు చర్చిది 139 ఏళ్ల ఘన చరిత్ర. 1881లో స్టేయిట్ దొర ఉదయగిరిలో చర్చి నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. అప్పట్లో విద్యా, మత వ్యాప్తి కోసం అమెరికాకు చెందిన డౌనీ అనే దౌత్యవేత్త జేఎఫ్ బర్డిట్‌ను ఒంగోలు నుంచి ఉదయగిరికి బదిలీ చేశారు. 1884లో ఉదయగిరి బర్డిట్ దొర మిషన్ బంగ్లా పని ప్రారంభించారు. 1886లో పనులను పూర్తి చేశారు. అప్పట్నుంచి బర్డిట్ మెమోరియల్ చర్చి వాడుకలోకి వచ్చింది. ఇదేకాక పొదిలి, దొనకొండ, కావలి, ఒంగోలులో కూడా ఆయన చర్చిలు నిర్మించారు. అప్పట్నుంచి ఉదయగిరి బాప్టిస్టు చర్చికి అమెరికా, ఇండి యన్లు 20 మంది పాస్టర్లు పని చేశారు. అప్పట్లో 49 మంది బాప్టిస్టు పుచ్చుకొన్నారు. స్టేయిట్, బర్డిట్ దొరల కుమార్తె, కుమారుడుల సమాధులు సైతం చర్చి ఆవరణలో ఉన్నాయి. ఈ చర్చికి ప్రస్తుతం పరిమి సుధీర్‌కుమార్ పాస్టర్‌గా పని చేస్తున్నారు.

● చర్చిల ముస్తాబు

బుధవారం క్రిస్మస్‌ను పురస్కరించుకొని బర్డిట్ మెమోరియల్ బాప్టిస్టు చర్చితోపాటు మండలంలోని గండిపాళెం, అప్పసముద్రం, వెంగళరావు నగర్, గుడినరవ, కృష్ణంపల్లి, సర్వరాబాదు, అయ్యవారిపల్లి, పుల్లాయపల్లి, ఉదయగిరి, దాసరి పల్లి ఆర్లపడియ తదితర గ్రామాల్లోని చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించడంతో పూలతో సుందరంగా తీర్చిదిద్దారు.

'ఉపాధి'కి ప్రత్యేక ప్రణాళిక..

15 శాతం వృద్ధిరేటు

- ఆ లక్ష్యంతోనే పని చేస్తున్నాం
- మెటీరియల్ కాంపోనెంట్‌తో సీసీ రోడ్ల నిర్మాణం
- 2029 నాటికి జిల్లా వృద్ధిరేటును పెంచుతాం
- ఇక సాగులో రైతులకు ఇబ్బందులు రానీయం
- ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నాం
- వివిధ శాఖలతో తనిఖీ బృందాల ఏర్పాటు
- కలెక్టర్ ఆనంద్ వెల్లడి



'గతేడాదితో పోలిస్తే ఈసారి సాగు విస్తీర్ణం పెరగడంతో ఎరువుల వినియోగం కూడా ఎక్కువైంది. గతేడాది డిసెంబరులో 9 వేల మెట్రిక్ టన్నుల యూరియాను వినియోగించగా ప్రస్తుతం ఇప్పటికే 12 వేల మెట్రిక్ టన్నుల వినియోగం జరిగింది. రానున్న జనవరిలో ఈ వినియోగం మరింత పెరగనుంది. ఇందుకు అనుగుణంగా యూరియా నిల్వలను అందుబాటులో ఉంచాం. అవసరం అని చెప్పగానే అక్కడకు యూరియాను పంపుతున్నాం. యూరియాను విక్రయించిన సమయంలో రైతుల బయోమెట్రిక్‌ను అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. అప్పుడే ఎక్కడ ఎంత యూరియా వినియోగిస్తున్నారు. ఇంకా ఎంత అవసరమో తెలుస్తుంది. అయితే కొన్నిచోట్ల డీలర్లు ఈ బయోమెట్రిక్‌ను అప్‌డేట్ చేయకపోతుండటంతో జిల్లాలో యూరియా నిల్వలు ఉన్నట్లు రికార్డుల్లో కనిపిస్తోంది. ఈ కారణంగా జిల్లాకు యూరియా కేటాయింపుల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కొందరు డీలర్లు అనధికారికంగా యూరియాను నిల్వ చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. అలాగే అధిక ధరలకు విక్రయించడం, కాంప్లెక్స్ ఎరువులు కొంటేనే యూరియా ఇస్తామంటూ కండీషన్లు పెడుతున్నట్లు కూడా మా దృష్టికి వచ్చింది. ఈ సమస్యలన్నీ పరిష్కరించేందుకు వ్యవసాయ శాఖతోపాటు విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ వంటి ఇతర శాఖల అధికారులు ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించేలా ఆలోచన చేస్తున్నాం. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా జరుగుతున్న తనిఖీల్లో పలు దుకాణాల్లో డీవియేషన్లు గుర్తించాం. సుమారు రూ.కోటికిపైగా పెనాల్టీ కూడా విధించాం.

ప్రత్యేక ప్రణాళికతో 'ఉపాధి'

ఉపాధి హామీ పథకంపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ఈ ఏడాది ఎన్నికలు జరగడంతో ఆ సమయంలో కూలీల సంఖ్య కొంత తగ్గింది. అయితే జూలై నుంచి రోజువారీ కూలీల సంఖ్యను పెంచాం. గతేడాది 1.20 కోట్ల పనిదినాలు జరగ్గా ఈ ఏడాది కూడా అదే లక్ష్యాన్ని నిర్ధేశించుకొని ఇప్పటికే 80 లక్షల పనిదినాల వరకు పూర్తి చేశాం. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ కావడంతో పనిదినాలు తగ్గాయి. కానీ ఫిబ్రవరి, మార్చి నెలల్లో రోజువారీ పనిదినాలు పెంచి లక్ష్యాన్ని చేరుకుంటాం. ఇప్పటి వరకూ జరిగిన పనిదినాల ఆధారంగా జనరేట్ అయిన మెటీరియల్ కాంపోనెంట్‌తో గ్రామీణ ప్రాంతాల్లో సుమారు 150 కి.మీ పొడవున సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాం. ఇప్పటికే 50 కి.మీకుపైగా సీసీ రోడ్లు పూర్తయ్యాయి. కొన్ని చోట్ల గ్రావెల్ కొరత ఉందని పంచాయతీరాజ్ ఇంజనీర్లు చెప్పగానే ఇబ్బంది తొలగించాలని తహసీల్దార్లకు ఆదేశాలు ఇచ్చాం. మార్చిలోపు ఈ రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తాం. వచ్చే ఏడాది 1.40 కోట్ల పనిదినాలను లక్ష్యంగా పెట్టుకుంటాం. తద్వారా వచ్చే మెటీరియల్ కాంపోనెంట్‌తో రానున్న ఏడాదిలో మరిన్ని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపడతాం.

15 శాతం వృద్ధిరేటు లక్ష్యం

ప్రభుత్వ ఆలోచన ప్రకారం స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా జిల్లా అభివృద్ధి ప్రణాళికను రూపొందించాం. అభివృద్ధికి ఏ శాఖలో ఎటువంటి చర్యలు తీసుకోవాలన్నదానిపై డాక్యుమెంట్ తయారు చేశాం. అందుకు అనుగుణంగా 2029 నాటికి జిల్లా వృద్ధిరేటును 15 శాతం పెంచడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. ప్రస్తుత జీడీడీపీ రూ.61,664 కోట్ల నుంచి రూ.1,31,180 కోట్లకు చేరే విధంగా ముందుకెళుతున్నాం. రానున్న ఐదేళ్లలో 73,116 హెక్టార్ల భూమిని సాగులోకి తీసుకొచ్చేందుకు లక్ష్యంగా పెట్టుకున్నాం. పప్పు పంటల విస్తీర్ణాన్ని 12,740 హెక్టార్ల నుంచి 22,499 హెక్టార్లకు పెంచేందుకు ప్రణాళిక రూపొందించాం. మెగా, మైక్రో, స్మాల్ ఇండస్ట్రియల్ సంఖ్యను 11,992 నుంచి 24,004కు పెంచడం, అలానే పోర్ట్ ఆధారిత పరిశ్రమల కోసం భూ బ్యాంక్‌ను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాం. వంద శాతం అక్షరాస్యత లక్ష్యంతో రానున్న ఏడాది కాలంలో 1.50 లక్షల మందికి శిక్షణ ఇవ్వనున్నాం' అని కలెక్టర్ ఆనంద్ వెల్లడించారు.

- నెల్లూరు, ఆంధ్రజ్యోతి

యూరియా కొరత లేకుండా చూడండి

- మంత్రి, కమిషనర్‌ను కోరిన సోమిరెడ్డి

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈ ఏడాది రబీ సాగు విస్తీర్ణం పెరిగిందని, యూరియా కొరత లేకుండా చూడాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావులను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోరారు. మంగళవారం అమరావతిలో వారిని కలిసి యూరియా అవసరాలపై చర్చించారు. ప్రస్తుతం 15 వేల టన్నుల యూరియా జిల్లాకు అవసర ముందని, తక్షణమే సరఫరా అయ్యేలా చూడాలని కోరారు. తన విజ్ఞప్తికి మంత్రి, కమిషనర్ సానుకూలంగా స్పందించారని, యూరియా సరఫరాకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని సోమిరెడ్డి తెలిపారు.

టెన్త్ ఫీజు చెల్లింపునకు 'తత్కాల్'

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి) : వచ్చే మార్చిలో జరగనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలకు ఇప్పటి వరకు ఫీజు చెల్లించని విద్యార్థులు తత్కాల్ పథకం కింద ఈనెల 27 నుంచి జనవరి 10వతేదీ లోపల ఫీజు చెల్లించవచ్చని డీఈవో డాక్టర్ బాలాజీరావు ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని జనరల్, ప్రైవేట్ విద్యార్థులు 'తత్కాల్' కింద రూ.వెయ్యి అపరాధ రుసుముతో ఫీజు చెల్లించి పరీక్షలకు హాజరు కావచ్చన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు సౌర విద్యుత్

- 'ఉచితం' స్థానంలో ఏర్పాటుకు కసరత్తు
- కాలనీల్లో అధికారుల సర్వే
- వినియోగదారుల నమోదు ప్రారంభం

నెల్లూరు (జడ్పీ), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉచిత విద్యుత్ పొందుతున్న ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు సౌర విద్యుత్ సౌకర్యం కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. దీనిపై అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది.

'ఉచితం' భారం తగ్గేలా...

నిరుపేద ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందిస్తూ వస్తోంది. జిల్లాలో దాదాపుగా 2లక్షలకు పైగా ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు విద్యుత్ కనెక్షన్లు ఉండగా, అందులో 200 యూని ట్లలోపు వాడకం కలిగినవి 1.25లక్షలు ఉన్నాయి. వారందరికీ ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందిస్తోంది. అయితే సోలార్ విద్యుత్తు అందుబాటులో ఉండడం, దీనికి కేంద్ర ప్రభుత్వం కొంతమేర సబ్సిడీ ఇస్తుండటంతో 'ఉచితం' లబ్ధిదారులకు సౌర విద్యుత్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం యోచిస్తోంది. సోలార్ కరెంటును ప్రోత్సహించడమేకాక ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వంపై పడుతున్న భారాన్ని తగ్గించేందుకు ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు సౌరవిద్యుత్ ఏర్పాటు చేసుకునేలా చూడాలని విద్యుత్‌శాఖను ఆదేశించింది.



బ్యాంకు రుణాల ద్వారా...

సాధారణంగా 200 యూనిట్ల విద్యుత్ వాడకానికి 2 కిలో వాట్ల సౌర విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. దీనికి రూ.1.80లక్షలు ఖర్చవుతుండగా అందులో రూ.50వేలు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీగా ఇస్తోంది. మిగతా సొమ్మును బ్యాంకుల ద్వారా వినియోగదారుడికి రుణం రూపంలో అందించి ఆ మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించేలా చర్యలు జరుగుతున్నాయని అధికారులు చెబుతున్నారు. దీంతో నెలవారీ ప్రభుత్వంపై పడే ఆర్థిక భారం కంటే సౌర విద్యుత్ వ్యవస్థ ఏర్పాటుకు అయ్యే ఖర్చు ఇబ్బందికరం కాదని అధికారులు చెబుతున్నారు. ఇందుకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ వినియోగదా రుల రిజిస్ట్రేషన్ చేయించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో అధికారులు సర్వే చేస్తూ వినియోగదారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించారు. ఇళ్లపైనే సోలార్ పలకలు ఏర్పాటు చేయాల్సి ఉండగా, కాలనీల్లో చిన్న ఇళ్లకు ఆ అవకాశం లేకపోతే ఎవరికీ ఇబ్బందిలేని ఖాళీస్థలాల్లో సోలార్ పలకలు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు.

బాగున్న రహదారిని పాడు చేశారు..!



ఉదయగిరి మండలంలోని గుడినరవ గ్రామ రహదారి వైసీపీ ప్రభుత్వ నిర్వాహ కంతో బురద మయంగా మారింది. దీంతో గ్రామ స్థులకు అవస్థలు తప్పడంలేదు. గత వైసీపీ ప్రభు త్వంలో ప్రధాన రహదారి నుంచి గ్రామం లోని పాఠశాల వరకు సిమెంట్‌రోడ్డు మంజూ రైంది. కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణానికి ఎక్స్‌కవేటర్‌తో బాగున్న రహదారి ధ్వంసం చేశాడు. అనంతరం చోటుచేసుకొన్న పరిణామాలతో ఆ రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. అప్పటి నుంచి ఆ రోడ్డు చిరుజల్లులకే బురదమయంగా మారుతోంది. రహదారికి మరమ్మతులు చేపట్టాలని పాలకులకు, అధికారులకు గ్రామస్థులు మొరపెట్టుకున్నా ఎవరూ స్పందించ లేదు. కూటమి ప్రభుత్వమైనా సిమెంట్‌రోడ్డు మంజూరు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)

క్రీస్తు రాక కోసం చర్చిల ముస్తాబు

- వాడవాడలా క్రిస్మస్ కాంతులు
- వేడుకలకు సిద్ధమైన క్రైస్తవులు

ఆత్మకూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్‌ను పురస్కరించుకుని నియోజకవర్గంలోని చర్చిలు క్రిస్మస్ వేడుకలు నిర్వహించేందుకు సంఘకాపరులు, పెద్దలు ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని క్రిస్టియన్‌పేట సెంటినరీ తెలుగుబాప్టిస్టు చర్చి, సెంటల్ తెలుగు బాప్టిస్టు చర్చి, సియోన్ ప్రార్థనమందిరాల్లో క్రిస్మస్ ట్రీలను ఏర్పాటు చేసి, చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. వెన్నవాడ, కరటంపాడు, వెంకట్రావుపల్లి, బీ.చిరువెళ్లలో ప్రార్థనలు చేసేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పట్టణంలోని ఎల్ఆర్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ప్రీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు షకీల, సుప్రజ మాట్లాడారు. ఏసుక్రీస్తు జననం, ఆయన లోకరక్షకుడిగా మారిన విశేషాలను విద్యార్థులకు వివరించారు.

● సంగం: వంగల్లు, దువ్వూరు, మక్తాపురం, అన్నారెడ్డిపాళెం, తరుణవాయి, మర్రిపాడు, సంగం గ్రామాల్లోని చర్చిలు ముస్తాబు చేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. క్రైస్తవులు ఆనవాయితీ ప్రకారం చర్చిల ముందు, ఇళ్ల ముంగిట్లో స్టార్‌లను ఎగురవేశారు.

● ఉదయగిరి: అన్ని గ్రామాల చర్చిలకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అందజేసిన మిఠాయిల బాక్సులను మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న మంగళవారం టీడీపీ నాయకులతో కలిసి చర్చి నిర్వాహకులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ బుధవారం బర్డిట్ మెమోరియల్ బాప్టిస్టు చర్చిలో నిర్వహించే ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నరసింహులు, నల్లిపోగు రాజా, ఖాన్‌సా పాల్గొన్నారు.

● సీతారామపురం: సీతారామపురం హరిజనవాడ, సింగారెడ్డిపల్లి, బసినేనిపల్లి, మారంరెడ్డిపల్లి, సోంపల్లి, గుండుపల్లిలో విద్యుత్ దీపాలతో అలంకరించారు.

● వింజమూరు: మానవ జీవితంలో ప్రతి ఒక్కరూ ఐక్యత, ప్రేమ, దయతో నిజాయతీగా జీవించడమే క్రీస్తు బోధనల సారాంశమని విశ్రాంతి డీఎంహెచ్‌వో డాక్టర్ కే మాశిలామణి పేర్కొన్నారు. మంగళ వారం కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ ప్రాంగణంలో నియోజక వర్గంలోని చర్చిలకు స్వీట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లా డుతూ కాకర్ల ట్రస్ట్ సభ్యులు మూడేళ్ల నుంచి నియోజ కవర్గంలోని ప్రతి చర్చికి స్వీట్లు పంచే కార్యక్రమంలో తాను భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం డాక్టర్ మాశిలామణిని మహేష్, మధురెడ్డి, శాలువాతో సత్కరించి స్వీట్ బాక్సులు పంపిణీ చేశారు.

● కావలి టౌన్: పట్టణంలోని చర్చీల్లో ఏర్పాట్లు సర్వం సిద్ధమయ్యాయి. ఏరియా వైద్యశాల వెనుక ఉన్న తెలుగు బాప్టిస్ట్ చర్చీ, కచ్చేరిమిట్ట ది తెలుగు బాప్టిస్ట్ చర్చి, సొసైటీ కాలనీలోని సత్యసువార్తిక మందిరం, హేరోబు ప్రార్థనా మందిరం, తుఫాన్‌నగర్ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు తగు ఏర్పాట్లు చేశారు. విద్యుత్ దీపాలంకరణలో మెరిసిపోతున్నాయి. రాత్రిపూట చర్చీల్లో ప్రార్థన, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

● కలిగిరి: మండలకేంద్రంతో పాటు నాగసముద్రం, తెల్లపాడు, పెదకొండూరు చర్చీలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. పాస్టర్ల ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక ప్రార్థనల అనంతరం పేదలకు బట్టలు పంపిణీ చేయనున్నట్లు క్రైస్తవసోదరులు తెలిపారు.

● కావలి టౌన్: స్థానిక కో ఆపరేటివ్ కాలనీలోని నలందా పాఠశాలలో ప్రీక్రిస్మస్ వేడుకలు అలరించాయి. పాఠశాల డైరెక్టర్ ఎండీ.వసీం పర్యవేక్షణలో జరిగిన వేడుకల్లో ముఖ్య అతిథిగా రెవరెండ్ జయపాల్ పాల్గొన్నారు. వసీం, జయపాల్‌లు చిన్నా రులతో కలిసి కేక్ కట్‌చేసి తినిపించారు. జయపాల్ మాట్లాడుతూ త్యాగానికి ప్రేమకు క్రీస్తు ప్రతిరూపమని, ప్రతిఒక్కరూ కష్టాల్లోని పేదలకు సాయం చేయాలన్నారు. చిన్నారుల వేషాధారణలో అలరించారు.

● కందుకూరు:నియోజక వర్గంలోని క్రైస్తవ సోదర సోదరీమణులకు మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీలు తూమాటి మాధవరావు, కంచర్ల శ్రీకాంత్ చౌదరి, మాజీఎమ్మెల్యేలు మానుగుంట మహీధర రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పామూరురోడ్డులోని బీఆర్ ఆక్స్‌ఫర్డ్ ఉన్నత పాఠశాలలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యా సంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు పాల్గొన్నారు. నాగార్జున పబ్లిక్ స్కూల్‌లో ముందస్తు వేడుకలు నిర్వహించారు.

● వలేటివారిపాలెం: శింగమనేనిపల్లె ఎస్సీ కాలనీ నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మట్లూరి నతానియేలు, అత్తోటి వెంకటేశ్వర్లు, బత్తిన మాల్యాద్రి, గోచిపాతల మోషే, కసుకుర్తి నవరత్నం, దువ్వూరి రమేష్, గౌడపేరు ప్రసాద్‌రావు, గౌడ పేరు అనీల్‌బాబు, కట్టా శ్రీనివాసులు పాల్గొన్నారు. అలాగే కొండసముద్రం-2 అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ సునీత పాల్గొన్నారు. శిరీషా, శిరోమణి పాల్గొన్నారు.


సంగం మండలం వంగల్లులో ముస్తాబైన చర్చి


కావలి: విద్యుత్ దీపాలంకరణలో మెరిసిపోతున్న తెలుగు బాప్టిస్టు చర్చి


కందుకూరు: ఆక్స్‌ఫర్డ్ చిన్నారుల సంబరం


కావలి: నలందా పాఠశాల వేడుకల్లో చిన్నారులు


ఆత్మకూరు : ప్రీ క్రిస్మస్ వేడుకల్లో అలరించిన అంగన్‌వాడీ చిన్నారులు


ఉదయగిరి : చర్చి నిర్వాహకులకు మిఠాయిలు అందజేస్తున్న మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న


సీతారామపురం: ముస్తాబైన సీతారామపురం చర్చి

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- లలిత, మండల వ్యవసాయ అధికారి



ఇంటర్వ్యూ...

కావలి రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి):రైతు సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యంగా రైతులకు సొసైటీలు, రైతుసేవా కేంద్రాలతో ఎరవులు, పురుగు మందులు ఎమ్మార్పీ ధరలకు అందిస్తున్నట్లు మండల వ్యవసాయశాఖ అధికారి లలిత తెలిపారు.

? మండలంలో ఎన్ని ఎకరాల్లో వరి సాగు లోకి తెచ్చారు.

! మండలంలో ఇప్పటివరకు 6వేల ఎకరాల్లో వరి నాట్లు వేశారు. మరో 8వేల ఎకరాల్లో వరినాట్లు వేసేందుకు అవకాశం ఉంది.

? యూరియా కొరత ఉందా.

! సొసైటీల ద్వారా ఎరువుల సరఫరాకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత నిచ్చింది. అలాగే రైతు సేవా కేంద్రాల ద్వారా కూడా ఎమ్మార్పీ ధరలకు ఎరువుల అమ్ముతున్నారు. కొత్తగా సర్వాయపాలెం, మునునూరు లో సొసైటీల ను అందుబాటులోకి వచ్చాయి.

? ఎరువులు, పురుగు మందుల వాడకంపై అవగాహన కల్పిస్తున్నారా.

! వారంలో ప్రతి మంగళ, బుధవారం 4 గ్రామాల చొప్పున వ్యవసాయ, ఉద్యానవన శాఖ, ఇతర అనుబంధ సంఘాలను కలుపుకుని ఎరువులు, పురుగు మందుల వాడకం, లాభసాటి వ్యవసాయంపై అవగాన కల్పిస్తున్నాం.

జేవీవీ కార్యవర్గ సమావేశం

కావలి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణ జనవిజ్ఞానవేదిక నూతన కార్యవర్గ సమావేశం మంగళవారం ఉదయం స్థానిక రవి నర్సింగ్‌హోమ్‌లో వేదిక అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. తొలుత దాదాసాహెబ్ అవార్డుగ్రహీత ప్రముఖ దర్శకులు శ్యామ్‌బెనగల్, తబలా విద్వాంసులు జాకీర్ హుస్సేన్ మృతికి నిమిషం సంతాపం ప్రకటించారు. అనంతరం జేవీవీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ప్రముఖ వైద్యులు, జేవీవీ గౌరవాధ్యక్షుడు బెజవాడ రవికుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో బెజవాడ రవికుమార్, జేవీవీ పట్టణ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు జేవీవీ బాధ్యులు గాదిరెడ్డి హరినాథ్, సుబ్బరాయశర్మ, పాపిశెట్టి జానకి రాం, కల్యాణి, హరినారపరెడ్డి, కందికట్టు నారాయణ, శారద, జమున, చలపతి రావు, మాలకొండారెడ్డి పాల్గొన్నారు.

మెషీన్ లెర్నింగ్‌లో వాస్తవిక పరిజ్ఞానం తెలుసుకోవాలి

కావలి టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): యువ ఇంజనీర్లు మెషీన్ లెర్నింగ్‌లో వాస్తవిక పరిజ్ఞానాన్ని తెలుసుకోవాలని టీసీఎస్ ఇంజనీర్ మహేంద్ర రెడ్డి తెలిపారు. మంగళవారం విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన సదస్సులో మహేంద్ర రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. భవిష్యత్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సి ఇంజనీరింగ్ ముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు. సదస్సుకు అధ్యక్షతన వహించిన ఏఐ విభాగాధిపత్రి మహేశ్వర రెడ్డి మాట్లాడారు. ఇలాంటి సంకేతిక సదస్సులతో విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శేషయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

టీఆర్‌ఆర్ ప్రిన్సిపాల్‌గా షేక్ నాగూర్‌వలి

కందుకూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా షేక్ నాగూర్‌వలి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఉర్దూ అధ్యాపకుడిగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడ ప్రిన్సిపాల్‌గా బదిలీ అయ్యారు. ఇంతవరకు ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సీనియర్ అధ్యాపకుడు ఓరుగంటి వెంకటేశ్వరరావు నాగూర్‌వలికి బాధ్యతలు అప్పగించారు.

సమీకృత వ్యవసాయంపై అవగాహన

కలువాయి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): వెంకటరెడ్డిపల్లిలో డీఆర్‌డీఏ వెలుగు అధికారులు మంగళవారం మహిళా రైతులకు సమీకృత వ్యవసాయ పద్ధతులపై అవగాహన నిర్వహించారు. డీఆర్‌డీఏ ఏపీవో భానుప్రకాష్, ఏవో వీ ప్రతాప్, వెలుగు ఏపీఎం రవి, ఏరియా కోర్డినేటర్లు కిరణ్, నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

- బండగానిపల్లిలో..

ఉదయగిరి: బండగానిపల్లి పంచాయతీ బిజ్జంపల్లి, లింగంనేనిపల్లి, కృష్ణారెడ్డిపల్లిల్లో పంచాయతీ సిబ్బంది పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టారు. తాగునీటి పథకాలు, చేతిపంపులు, మురికినీటి కాలువల్లో చెత్తాచెదారాన్ని తొలగించి బ్లీచింగ్ చల్లారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ

సంగ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాలలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం దోమల నివారణ మందు పిచికారీ చేశారు. విద్యార్థునులకు జ్వరాలు ఎక్కువగా ఉండడంతో వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి సూచనల మేరకు పంచాయతీ సిబ్బంది దోమల నివారణ మందు పిచికారీ చేశారు. తరగతి గదులు, డార్మెంటరీ, డ్రైనేజీ, మరుగుదొడ్ల పరిసర ప్రాంతాల్లో ఈ మందు స్ప్రే చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుమతి, సబ్ యూనిట్ ఆఫీసర్ ఖాదర్‌బాషా, పంచాయతీ కార్యదర్శి నరసయ్య, వైద్యఆరోగ్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు


లింగసముద్రం: మాట్లాడుతున్న తహసీల్దారు సీతామహాలక్ష్మి

లింగసముద్రం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు సీతామహాలక్ష్మి తెలిపారు. మంగళవారం తిమ్మారెడ్డిపాలెం, గంగపాలెంలో నిర్వహించిన సదస్సులో పాల్గొని రైతుల నుంచి భూ సమస్యలపై అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో లింగసముద్రం నీటి సంఘం అధ్యక్షులు పొలిమేర చిననాగిరెడ్డి, టీడీపీ నాయకులు పొలిమేర పెద్దిరెడ్డి, ఎం బాలకోటయ్య, ఆర్ఐ రమణయ్య, వీఆర్‌వో హుసేన్, సర్వేయర్లు శివప్రసాద్, సాయి, వినోద్ రెడ్డి పాల్గొన్నారు.

● సంగం:వెంగారెడ్డిపాళెం, సిద్దీపురంలో రెవెన్యూ సదస్సుల్లో తహసీల్దారు సోమ్లా నాయక్ భూసమస్యలపై రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచి ఆనం ప్రసాద్‌రెడ్డి, అన్నారెడ్డిపాళెం సాగునీటి సంఘం అధ్యక్షుడు సూరా శ్రీనివాసులురెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● సీతారామపురం:బాలాయపల్లిలో మంగళవారం తహసీల్దార్ కృష్ణారెడ్డి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తమ సమస్యలను పరిష్కరించాలని రైతులు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీని వాసులు, సర్వేయర్ భాగ్యలక్ష్మి, వీఆర్వో బాలయ్య పాల్గొన్నారు.

● ఉదయగిరి: కృష్ణంపల్లిలో తహసీల్దారు సుభద్ర రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు, రైతులు తమ సమస్యలపై అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో వీఆర్వో అంజాద్, సర్వేయర్ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

● వలేటివారపాలెం: డిప్యూటీ తహసీల్దార్ నాయబ్‌రసూల్ కాకుటూరులో జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. భూ సమస్యలు పరిష్కారానికే ప్రభుత్వం సదస్సులు ప్రారంభినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రసాద్ తదితర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రి సమస్యలు పరిష్కరించండి

కావలి టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు మంగళవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ పద్మావతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ కార్యదర్శి పెంచులయ్య, కృష్ణమోహన్‌లు మాట్లాడారు. ఏరియా వైద్యశాల పేరుకే వంద పడకల ఆసుపత్రి అని రోగులకు సరైన వైద్యం అందడం లేదని ఆరోపించారు. జ్వరాలు, జలుబు దగ్గు, వంటి నొప్పులకు మాత్రలు, సూదులు వేస్తారే తప్ప ఇతర జబ్బులతో వచ్చే రోగులను నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేస్తున్నట్లు మండిపడ్డారు. పరిసరాల పరిశుభ్రత పాటించడం లేదని డ్రైనేజ్ సమస్య తీవ్రంగా వుందన్నారు.

ఆధార్, బర్త్ సర్టిఫికెట్లు ఇవ్వాలి

- కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ


స్థానిక సమస్యలను తెలుసుకుంటున్న సబ్‌కలెక్టర్ శ్రీపూజ

ఉలవపాడు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్టీ కుటుంబాలోని ప్రతిఒక్కరికీ ఆధార్ కార్డు, పిల్లలకు బర్త్ సర్టిఫికెట్లు ఇవ్వాలని కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ అధికారులను ఆదేశించారు. మంగళవారం వీరేపల్లి, చాగొల్లులోని ఎస్టీ యానాది కాలనీల్లో పర్యటించారు. ఆధార్ కార్డులు ఎంత మందికి ఉన్నాయని వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నపిల్లలను స్కూళ్లకు పంపించాలని ఆధార్ కార్డు, లేట్‌బర్త్ సర్టిఫికెట్లు లేని వాళ్లకు కాలనీలో ప్రత్యేక క్యాంప్‌లు ఏర్పాటు చేసి అందేలా చూడాలని తహసీల్దారు లావణ్య, ఎంపీడీవో విజయలకు సూచించారు.

అమిత్‌షా వ్యాఖ్యలను ఖండించరేం?

- సీపీఎం నాయకులు మాల్యాద్రి

కావలి టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై కేంద్రమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ప్రతిపక్ష నేత జగన్మోహన్‌రెడ్డిలు ఎందుకు ఖండించరని సీపీఎం సీనియర్ నాయకులు తాళ్లూరు మాల్యాద్రి ప్రశ్నించారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన వ్యవసాయ సంఘం నాయకులు రాధాకృష్ణయ్యతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ వ్యాఖ్యలకు దేశం మొత్తం ఖండిస్తే రాష్ట్ర ప్రముఖులు మిన్నకుండిపోవడం శోచనీయం అన్నారు.

పోలేరమ్మ తిరునాళ్లకు తొలి చాటింపు

అల్లూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా వెలసిన పోలేరమ్మ తిరునాళ నిర్వహణకు గ్రామంలోని మరోవర్గంకు చెందిన గ్రామపెద్దలు మంగళవారం తొలి చాటింపు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి తొలుత విశేష పూజలు చేసి అమ్మవారి ఆలయం ఎదుట హారతి కర్పూరాన్ని వెలిగించారు. కార్యక్రమంలో మేడా వెంకటేశ్వర్లు రెడ్డి, రామకృష్ణారెడ్డి, మేడా కృష్ణారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, శ్రీనివాసుల రెడ్డి, మేడా నిరంజన్‌రెడ్డి, దయాకర్ రెడ్డి పాల్గొన్నారు.

వినియోగదారుల దినోత్సవం

ఉదయగిరి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్‌నారాయణ స్వామి మాట్లాడుతూ వినియోగదారుల హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. హక్కులు, అవశ్యకతను వివరించారు

తిరునాళ్లకు ముందస్తు చర్యలు తీసుకోండి

- కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి

అల్లూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 31వ తేదీ మండలకేంద్రంలోని గంగమ్మ, కలుగోళమ్మ, పోలేరమ్మ తిరునాళకు అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకుని ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఆర్డీవో వంశీకృష్ణ, రూరల్ డీఎస్పీ శ్రీధర్‌లతో కలసి అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రధానంగా విద్యుత్ శాఖ, పురపాలక శాఖ, పోలీసు శాఖలు కీలక బాధ్యత వహించాలన్నారు. ఈ శాఖల అధికారులంతా అప్రమత్తంగా ఉండి ఉత్సవ కమిటీకి సహకరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు లక్ష్మీనారాయణ, సీఐ పాపారావు, నగర పంచాయతీ కమిషనర్ ఉమామహేశ్వర రావు, ఉత్సవ కమిటీ సభ్యులు బాలకృష్ణంరాజు, పప్పు సుధాకర్, గుండవరపు సుధాకర్‌రెడ్డి, నాయకులు, మేడా కృష్ణారెడ్డి, మేడా శ్రీనివాసులు రెడ్డి, బిట్రగుంట చైతన్య రెడ్డి, కృష్ణ చైతన్య, బండి శ్రీనివాసుల రెడ్డి, పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

● కావలి: ఆర్అండ్‌బీశాఖ, పురపాలక శాఖ అభివద్ధి పనులపై మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. తొలుత ఆర్ అండ్‌బీ అధికారులతో కలిసి తుమ్మలపెంట రోడ్డులో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే తన నివాసంలో మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. పట్టణ పారిశుధ్య పనుల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలు గురించి చర్చించారు.


కావలి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి

● బాధిత కుటుంబానికి పరామర్శ

బిట్రగుంట: బోగోలు మండలం ముంగమూరు పంచాయతీ సాంబశివపురానికి చెందిన టీడీపీ నేత యర్రజొన్న శ్రీహరి తల్లి వెంకటమ్మ (89) అనారోగ్యం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి మంగళవారం ఆమె పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుమారుడు శ్రీహరి, కుటుంబ సభ్యులతో మాట్లాడి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నాగేశ్వరావు, ప్రధాన కార్యదర్శి సుధీర్‌బాబు, పార్టీ నాయకులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వీడాలి

కందుకూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై ఏమాత్రం అలసత్వం వహించకుండా మున్సిపాలిటీ అధికారులు, వార్డు సచివాలయ ఉద్యోగులు పని చేయాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. మంగళవారం సాయంత్రం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది, వార్డు సచివాలయాల సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కొర్రపాటి అనూష, డీఈఈ గణపతి లు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

నియోజకవర్గంలోని 13మంది బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సీఎం సహాయనిధి రూ. 7,63,731 చెక్కులను పంపిణీ చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో దామా మల్లేశ్వర రావు, తల్లపనేని రవీంద్రబాబు, నాదెండ్ల వెంకట రమణయ్య, ఏకాంబరం వెంకటరావు, సాధు వేణు, ముప్పరాజు కృష్ణారావు, షేక్ షరీఫ్ పాల్గొన్నారు.

● ఎమ్మెల్యేకు సత్కారం

వీఆర్ కోట ఆనకట్ట సిస్టం అధ్యక్ష, ఉపాధ్యక్షులు తల్లపనేని రవీంద్రబాబు, తోకల మాల్యాద్రిలు మంగళవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఆయకట్టు రైతులతో కలిసి స్థానిక పార్టీ కార్యాలయానికి వచ్చి ఎమ్మెల్యేను దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. మాచవరం, మోపాడు చెరువుల కింద రైతులకు ఇబ్బందిలేకుండా చివరిభూములకు కూడా నీరందేలా చూడాలని ఎమ్మెల్యే వారికి సూచించారు. కార్యక్రమంలో దామా మల్లేశ్వరరావు, వడ్డెళ్ల వెంకటరావు, తల్లపనేని మురళీకృష్ణ, రావుల రవి, పైనీడి వెంకటేశ్వర్లు, కొచ్చర్ల మాధవరావు పాల్గొన్నారు.


బాధితులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

పెరిగిన చలిగాలుల తీవ్రత

ఉదయగిరి రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మంగళవారం చలిగాలుల తీవ్రత పెరిగింది. ఉదయం నుంచే ఆకాశంలో ముసురేసి ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లో కురిసిన చిరుజల్లులకు ప్రజలు బయటకు రాలేదు. వర్షం బలపడే అవకాశం ఉన్నందున కూలీలు, కార్మికులు నివాసాలకే పరిమితమయ్యారు. వృద్ధులు, పిల్లలు చలిగాలులకు తట్టుకోలేక రోజంతా స్వెట్టర్లు వేసుకున్నారు.

● ఉదయగిరి: పట్టణంలో చిరుజల్లులు కురిశాయి. ముసురుతో పాటు చలి గాలులు వీయడంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడ్డారు. వర్షాలతో సాగులోని శనగ, మినుము, కంది పంటల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. వర్షాలతో పంటలపై తెగుళ్లు విజృంభించడంతో పాటు దిగుబడి తగ్గి తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందని వారు వాపోయారు.

● సంగం, (ఆంధ్రజ్యోతి): మండలంలో రోజంతా ముసురు పట్టింది. సాయంత్రం వరకు తువ్వర పడుతూనే ఉంది. చల్లిగాలితో వృద్ధులు, చిన్నారులు వణికిపోయారు.

పోరుబాటను విజయవంతం చేయండి

వింజమూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కరెంటు చార్జీల పెంపునకు నిరసనగా ఈ నెల 27న ఉదయగిరిలో నిర్వహించే వైసీపీ పోరుబాటను విజయవంతం చేయాలని మండల వైసీపీ కన్వీనర్ రేవునూరి శ్రీనివాసులు రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక వీఆర్ ఫంక్షన్ ప్లాజాలో వైసీపీ నాయకులు మద్దూరు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, కాటం రవీంద్రరెడ్డి, మాగంటి శ్రీనివాసులుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఉదయగిరిలోని విద్యుత్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి ఏఈకి వినతిపత్రం అందచేస్తామన్నారు.

ఈ-క్రాప్ నమోదు చేసుకోండి

ఆత్మకూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ పంటలను ఈ క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు దేవసేనమ్మ తెలిపారు. మంగళవారం వెన్నవాడ రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం క్షేత్రస్థాయిలో వరి పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి కిషోర్‌బాబు, వీఏఏ దీప పాల్గొన్నారు.

● సీతారామపురం: సింగారెడ్డిపల్లిలో మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఈవో సాంబశివయ్య వీఏఏ స్వప్ననరేంద్రమార్కెటింగ్ అసిస్టెంట్ చిరంజీవి పాల్గొన్నారు.

వీధిలైట్ల మరమ్మతులు

వలేటివారిపాలెం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పోలినేనిపాలెంలో సర్పంచ్ అనుమోల అమరేశ్వరి ఆధ్వర్యంలో మంగళవారం వీదిలైట్లకు మరమ్మతులు చేపట్టారు. అడిగిన వెంటనే వీదిలైట్లకు పనులు చేయించిన సర్పంచ్‌కు అభినందనలు తెలిపారు.

నాటుసారా తయారుచేస్తే చర్యలు

బిట్రగుంట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారీ చేసినా, అమ్మకాలు చేపట్టినా చర్యలు తప్పవని ఎక్సైజ్ సూపరింటెండెంట్ జే.రమేష్, జగదీష్‌రెడ్డిలు తెలిపారు. మంగళవారం వీరు కప్పరాళ్ళతిప్ప, బోగోలు, చెంచులక్ష్మీపురం, నాగులవరం, సోమేశ్వరపురం గ్రామాల్లో సిబ్బందితో విస్తృత దాడులు నిర్వహించారు. వీరి వెంట కావలి ఎక్సైజ్ ఎస్సై దేవిక, కావలి, బుచ్చి సీఐలు శ్రీనివాసరావు, జలీల్, కోవూరు, కావలి స్టేషన్ల ఎస్సైలు సిబ్బంది ఉన్నారు.

విద్యార్థి దశ ఎంతో కీలకం

ఆత్మకూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ ఎంతో కీలకమని, పలువురు విద్యార్థులు డ్రగ్స్‌కి అలవాటుపడి భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని సీఐ జీ గంగాధర్ తెలిపారు. స్థానిక ప్రగతి ఇంగ్లీష మీడియం స్కూల్‌లో మంగళవారం మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్‌పై అవగాహన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దురలవాట్లుకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రామ్మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

అనంతసాగరం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కామిరెడ్డిపాడు, సోమశిలలోని పేదలకు మంగళవారం వెంగంపల్లి ఎంపీటీసీ యనమల వనమ్మ, రాపూరుకు చెందిన పాపకన్ను నిరంజన్‌రెడ్డి సహకారంతో దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రమణయ్య, కృష్ణ పాల్గొన్నారు.